జ్యోతి

మే '64 60 N.P



తొలిమాట

తెలుగు సాహిత్యంలో ఇది అక్షరాలా (శ్లేషార్థంతోసహా) నవలాయుగం. నవలలపై, ముఖ్యంగా పత్రికలలో సీరియలైజ్ చేసే నవలలపై, అంతకంటె ముఖ్యంగా రచయిత్రుల నవలలపై పాఠకుల ఆదరానికి అంతులేదు. ఇదివర కెన్నడూ లేనంత ఎక్కువగా మహిళలు రాయడం, బాగారాయడం జరుగుతున్నం దుకు ఎంతైనా సంతోషించాలి.

పాఠకుల కోర్కెపై "జ్యోతి" కూడా ఈ సంచికతో ఒక చిన్న సీరియల్ మొదలుపెడుతున్నది. కొద్ది. కథలతో, కొద్ది కాలంలోనే పాఠకుల ప్రశంసలను ఆకర్షించిన శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిగారు వ్రాసిన ఈచిన్ననవల (పోనీ,పెద్దకథ) "సెక్రటరీ" చదివి మా పఠితలు ఆనందిస్తారని నమ్ముతున్నాము.

మరొక ప్రముఖ రచయిత్రి శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారి కథ "నవ్వేందిజాబిల్లి" కూడా ఈ సంచికలోనే వుంది.

మిగతా కథలుకూడా మా పాఠకులకు ఎప్పటివలెనే ఆనందప్రదం కాగలవని మానమ్మిక.

క్రిందటినెల అలస్యంగా అందడంవల్ల ఆగిపోయిన "కూనలమ్మ పదాలు" తిరిగి ఈ సంచికలో మీకు హాయిగొల్పుతాయి.

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న.పై. — ఏడాది చందా : ఏడు రూపాయలే
సంపుటి **2** మే **1964** సంచిక **5**

పాఠక మహాశయా! ఈ నెల

విందు వరస....

ముఖచిత్రం : డి. బి. ఎన్. వారి "దాగుడుమూతలు"లో బి. సరోజాదేవి.

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2

ఉత్తరాయణం

ఏప్రిల్ సంచిక శారదగారి ముఖచిత్రం బాగుంది. విట్సుమాత్రం పొట్ట చెక్కలయ్యేటట్టు చేస్తున్నాయి. జ్యోతికి విట్సు సగం ఆకర్షణ. ఈ సంచికలో ప్రచురితమైన కొడవటిగంటి కుటుంబరావుగారి "స్నేహితులు" కథ ఒకమోస్తరుగాఉంది. ఇకనుండి ఇంకా మంచికథలను వేస్తారని ఆశిస్తున్నాను.

నేమాని వివేకానందరావు, కాకినాడ.

సంగీత దర్శకులు వేణుగారిగురించిన వ్యాసం చదివి చాలా ఆనందించాము కాని శ్రీనివాస్‌గారు వేణు సంగీతంలోని కొన్ని మనసును కదిలించే పాటలను వదిలివేశారు. ముఖ్యంగా "ఎత్తుకుపైఎత్తు"లో సుశీల పాడిన "అంది అందనిలాగ ఆకాశవీధి", "మాంగల్యబలం"లో "పెను చీకటాయె లోకం" అన్న పాటలను విన్నవారెవరూ తేలిగ్గా మర్చిపోలేరు.

శ్రీనివాస్‌గారు "పాడిన పాటే నా" అన్నపాట సుశీల జమునకి పాడిందని వ్రాశారు. కాని ఆ పాట కృష్ణకుమారికి పాడిందనుకుంటాను.

పావిలోల వాసు, తిరపతి.

ఎన్నడూ జ్యోతి చదివి యెరుగని నేను యివ్వాళ యీనెల సంచిక చదవటం తటస్థించింది. వెంటనే ఉత్తరంవ్రాస్తున్నాను.

ముఖచిత్రం నటనావి "శారద" పత్రికకు అంతులేని అందాన్నిచ్చింది. దానికదే సాటి. మా రామగుండంలో ముఖచిత్రం కొఱకు పదిహేను మంది విద్యార్థులు 'జ్యోతి' కొన్నారు.

"అప్పులరాజూ-అప్పులు రోజూ" స్కెచ్ చాలా బాగుంది. రచయిత జి. వి. జి. గార్కి నా ధన్యవాదాలు. కొడవటిగంటి కుటుంబరావుగారు రచించిన "స్నేహితులు" గాధాంతం చాలా సుఖాంతం. "షామియానా" చాలా బాగుంది. పి. బి. శ్రీనివాస్ గారు వ్రాసిన వ్యాసం వేణు - గానలోలుడు జ్యోతికి చాలా ప్రకాశాన్నిచ్చింది.

109 వ పేజీలో "డాక్టర్ చక్రవర్తి" సినీ వార్తలో శ్రీమతి కోడూరి కౌసల్య గారు అని వ్రాశారు. కాని వారు కుమారి కోడూరి కౌసల్యాదేవిగారు.

ఠాగూరు జస్వంత్ సింగ్,
రామగుండం.

వ్యాపారరీత్యా తెలుగుదేశానికి దూరమయినా, పత్రికలవల్ల మన తెలుగుదనానికి దగ్గర్లోనే వున్నాను!

ఈ మాసం "జ్యోతి"లో "నిత్యానందం గారి బొంబాయి విలాసయాత్ర" చదువుతూ, నవ్వుకుంటూ, నిత్యం వేధించే ఎన్నో వ్యాపారవిషమ సమస్యలు మర్చిపోయి, హాయిగా బొంబాయి చూశాను - వాళ్ళతో బాటు!

'షామియానా' చదువుతూంటే, హైద్రాబాద్‌లో ఓసారి నేను చూసిన, అనుభవించిన సంఘటన జ్ఞాపకమొచ్చింది. బహుశః శ్రీమతి అచ్యుతవల్లికూడా నిజకథే వ్రాసివుంటారు.

పేజీలక్రింద వేసిన జోక్సు చాలాబాగున్నాయి-ఈ నెల.

కొన్ని కథలు టీడియస్‌గా, బోర్‌గా వుంటున్నాయి. కొన్ని జోక్సు చాల అసహ్యంగా, తేలిగ్గావుంటున్నాయి అపుడపుడు. ఎందుకో?

వి. వి. కె. రాజు, మంగుళూరు.

ఏప్రిల్ నెల సంచికలో కథలు చాలావరకు బాగాలేవు. ఉన్నవాటిలో 'స్నేహితులు' "నాముఖంలో ఏముంది" అనేవి కొంచెం బాగున్నాయి. 'కూనలమ్మ పదాలు' లేకుంటే జ్యోతికాంతి తగ్గలేదా? పాఠకులు కోరినంతనే, 'సీరియల్'ను ప్రచురిస్తున్న మీరు (రచయిత్రితో) సహా అభినందనీయులు. రాజకీయ వార్తావరణంబాగుంటోంది. కాని కార్టూన్లు చాలావరకు తగ్గించేశారు. ఎక్కువగా వేయాలిమరి. ఉగాది సంచికలోమాదిరి ప్రతినెలా 'భామాకలాపం' శీర్షికక్రింద స్త్రీలకు అవసరమైన విషయాలు వేస్తుంటే బాగుంటుందని మా అభిప్రాయం. వీలైతే ఈ శీర్షికను నిర్వహించేందుకు ప్రయత్నించమని మనవి.

కవిత, మార్కాపురం.

'నటనావి' అంటే అర్థం తెలియక డిక్షనరీ చూస్తే - అసలు ఆ మాటే లేదు. ఆర్వాత అర్థం అయింది నటనా విశారదలో శారద అని.

నిద్రితమైన భావపరంపరలను మేల్కొల్పే శక్తిగలది - 'నామొహంలో ఏముంది' - అన్న స్కెచ్.

"ఇల్లు" కథలో ఉపమానాలు బ్రహ్మాండంగా ఉన్నాయి. ముఖ్యంగా-'ఆమెకా సీను వాళ్ళ అర్థిస్టు బావ రంగులు తుడుచుకునే తెల్లటి పాతషర్టు ముక్కలాగున్నది-అన్న వాక్యం యెంతో బాగా నచ్చింది.

సమ్మర్‌లో విలాసయాత్రలు మామూలే. ఆలాగే నిత్యానందంగారి విలాసయాత్ర బ్రహ్మాండంగా ఎండ్ అయింది.

షామియానాలో చివరిదాకా సస్పెన్స్ బాగా నడిచింది. అయితే 'షామియానా' అని కథకు పేరెందుకు పెట్టారో? కృష్ణచందర్‌గారి స్టయిల్లో 'ఓంప్రథపెట్టిన వార్డెను కథ' నడిచింది. కొ.కు.గారి "స్నేహితులు" యెంతో చల్లగా వుంది ఈ సమ్మర్‌లో. కొత్తజ్యోతి ఎప్పుడు వస్తుందో?

"హరిణాక్షి", హైద్రాబాద్.

జ్యోతి ఏప్రిల్ సంచిక అరవైనయాపైసలూ(లే!) పడేసి కొన్నతరువాత చాల ఆత్రుతగా తిరగవేశాను-ముఖ్యంగా మీరు గత నెలలో ప్రకటించిన "స్నేహితులు" కధకోసం. నిజంచెప్పాలంటే కొడవటిగంటి కుటుంబరావుగారు ఆయన కధామాలకి మరొక పుష్పాన్ని ఏరి కూర్చుకున్నారు. ఆ పుష్పం మీ ద్వారా సువాసనలు వెదజల్లడం నిజంగా సంతోషించదగ్గది. కొడవటిగంటి కుటుంబరావుగారి అభిమానుల్లో నేనూ ఉన్నాను!

ఇకపోతే మిగిలిన కథలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ముఖ్యంగా 'షామియానా' చాల అసందర్భంగాఉంది. లీలావతి కూతురు యం. ఎ. చదువుతోంది. అంటే లీలావతి యవ్వనవతికాదు. ఆమె వయస్సు సుమారుగా నిర్ణయించడం కష్టమూ కాదు. ఏమంటారు? ఫిరోజ్ ఆమెనిచూసి భ్రమపడడం సహజంగాలేదు సరికదా అసందర్భంగాఉంది.

ఇం. వి. రావ్, బాపట్ల.

ఎన్నోమార్లు మీ (మా) "జ్యోతి"కి నా శుభాకాంక్షలు అందజేయ దల్చాను. కాని వీలుపడ లేదు. అభినయవి "శారద"గారి ముఖచిత్రంతో అత్యంతాకర్షణీయంగా వెలువడిన "జ్యోతి" కివే నా శుభాకాంక్షలు.

ఈ నెల "జ్యోతి"లో, "వేణు"గారిని పరిచయంచేస్తూ ఆయన ఫోటో ప్రచురించక పోవటం, ముఖ్యంగా ఆరుద్రగారి "కూనలమ్మ పదాలు" లేకపోవటంతో పత్రిక చిన్నబోయింది. ఒకవిధంగా, మధురానుభూతులతో మనసును నింపగల్గిన పెద్దకథ. కొడవటిగంటి కుటుంబరావుగారి "స్నేహితులు"తో ఆ కొరత తీరింది.

కె. సుబ్రహ్మణ్యం, తిరుపతి.



● ఆలస్యంగా అందినందువల్ల వేణుగారి ఈ ఫోటో క్రిందటి నెల ప్రచురించలేకపోయాము. ●

"జ్యోతి" అట్టమీదిబొమ్మ మరీ అంత అందంగా వెయ్యకండి. పేజీ తిప్పి లోపల చదవలేకుండావున్నాం. ఫోటో ఎంతో బాగుందండి. ఎంతసేపుచూసినా తనివితీరడంలేదు.

ఆరుద్ర బాతాఖానీకొరకు ప్రతిసారి వెదికి నిరాశచెందుతున్నాం.

యస్. భక్తవత్సలం, హైదరాబాదు.

ఏప్రిల్ సంచికలో ప్రచురించిన అచ్యుతవల్లి కథ నిజంగా జరిగిన కథేమో ననిపిస్తుంది. కుటుంబరావుగారు వ్రాసిన "స్నేహితులు" అనేకథ బాగుంది. జనవరినుండి మాకు అందిస్తున్న పతాళి పన్‌చాంగమ్ ఆనందదాయకం. ఆరుద్ర కూనలమ్మ పదాలు, శ్రీశ్రీ పంచపదులు లేకపోవడం వలన కొంత నిరుత్సాహంగానేవుంది.

ఎన్. అంజనేయులు, రావినూతల.

"జ్యోతి'' ప్రారంభ సంచికనుంచి చదువుతున్నాను. జ్యోతి సంపాదకవర్గం చూడగానే తప్పకుండా జ్యోతి తెలుగు మాస పత్రికలలో కెల్ల మణిపూస కాగలదని ఆశించితిని. కాని ఇప్పటివరకు నా ఆశ నెరవేరలేదు ఎదో ఒకటి, రెండు సంచికలు మినహాయిస్తే కథలు ఏవీ చదువదగ్గ స్థాయిలో లేవు (రచయితలందరూ పేరుగాంచిన వారయినా) చిత్రమేమిటంటే జ్యోతి తొలిమాటనుంచి చివరపేజీవరకు (కథలతో సహా) అనవసరమైన, విసుగు పుట్టించే హాస్య, ఛలోక్తులతో నిండివుంటున్నది. ఈ హాస్యధోరణి వాంఛనీయమైనది కాదు. కనుక నేను జ్యోతి అభిమాన పాఠకునిగా సంపాదకవర్గాన్ని కోరేదేమంటే - ఇకనుంచైనా హాస్యధోరణి మాని, గంభీరమైన, శృంగారమైన, విషాదకరమైన కథలు ప్రచురించమని.

'మాగోకి', రాజమండ్రి.

కూనలమ్మ పదాలు
ఆరుద్ర



తీర్చినట్టి బకాయి
తెచ్చిపెట్టును హాయి
అప్పుమెడలో రాయి
ఓ కూనలమ్మా!

నిజము నిలువని నీడ
నీతియన్నది చూడ
గాజు పెంకుల గోడ
ఓ కూనలమ్మా!



చెప్పి దేవుని పేరు
చెడుపు చేసెడివారు
ఏలసుఖపడతారు
ఓ కూనలమ్మా!

రసికుడంతటివాడు
ఇల్లరికమున్నాడు
పెండ్లయిన మరునాడు
ఓ కూనలమ్మా!




మధుపు మైకమునిచ్చు
వధువు లాహిరితెచ్చు
పదవి కైపే హెచ్చు
ఓ కూనలమ్మా!

హరుడు అధికుడుకాడు
నరుడు అల్పుడుకాడు
తమకు తామే ఈడు
ఓ కూనలమ్మా!



సుదతిపాలిట భర్త
మొదట వలపుల హర్త
పిదప కర్మకు కర్త
ఓ కూనలమ్మా!

చివరి ప్రాసలనాళి
చిత్రమైన వరాళి
కావ్యసుధల షడాళి
ఓ కూనలమ్మా!



చెరిపి పరువు ప్రతిష్ఠ
జెయిలు లోపల తిష్ఠ
వేయునింటికి జెష్ఠ
ఓ కూనలమ్మా!

వల్లకాట్లో బూది
స్వార్థపరుడను 'నాది'
మమత బ్రతుకు పునాది
ఓ కూనలమ్మా!

రాజకీయ వాతావరణం

షేక్ అబ్దుల్లా వితండ వాదాలు

కాశ్మీర్ కేసరి షేక్ అబ్దుల్లా ను ఏప్రిల్ ఎనిమిదవ తేదీన విడుదలచేశారు. దాదాపు పదకొండేండ్లు జైలు జీవితం గడిపినతరువాత, తనపైన తెచ్చిన అభియోగాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంటే షేక్ అబ్దుల్లా విడుదలయ్యారు. ఇది ప్రత్యేక పరిస్థితులలో జరిగిన విడుదల.

విడుదలైన కాశ్మీర్ 'సింహం' ఒక్కమాటు బయటిప్రపంచాన్ని చూచేసరికి గర్జించటం సహజం. అట్లాగే శ్రీ అబ్దుల్లా కూడా చెప్పిందిచెప్పకుండా, అన్ని సంవత్సరలపాటు తనలోమగ్నమైమూలుగుతున్న వూహలను ఒక్కమాటు చండప్రచండంగా చెప్పివేశారు.

అందరికీ ఆశ్చర్యం. ఏమిటీ వింత ధోరణి? పిచ్చికుదిరిందంటే' రోకలితెచ్చి తలకు చుట్టమన్నాడుట....

"అందుకే ముందరే మేం చెప్పాం– షేక్ అబ్దుల్లా ని ఇప్పుడు విడుదలచేస్తే కాశ్మీర్ వ్యవహారం అంతా ఒక్కమాటు 'షేక్' అయిపోతుంది - సరిగ్గా మే 6 వ తేదీన భద్రతా సమితి కాశ్మీర్ సమస్యను చర్చిస్తుంది. అలాంటి సమయంలో యిదేమిటి యీ ముసుళ్ళపండగ" అని ప్రశ్నలు అభిప్రాయాలు ఒకవైపు రాజకీయ వర్గాలలో చెలరేగుతున్నాయి.

జైలులోనుంచి విడుదలైన షేక్ సాహెబ్‌కు పూలరథం యెదురైనట్లనిపించింది. ఆ జనసందోహం అట్లా తనను ఆహ్వానిస్తుంటే, అంతమంది ప్రజలు తనకోసం అంతగా పరితపించిపోతుంటే, కాశ్మీర్ ప్రభుత్వం అన్ని సంవత్సరాలు తనను నిర్బంధించటం .... ఆయన బాధ పడ్డారు. ఆవేశంముంచుకువచ్చింది. కాశ్మీర్ ప్రజల వాంఛలను యెవరూ చంపలేరని ఒక్కమాటు పెనుకేక వేశారు....అంతే జైలు నుంచి శ్రీనగర్ చేరుకునేవరకు, దారిలో వాడవాడలా అదే 'కేక' జనాన్ని చూచిన కొద్దీ మరింత గట్టిగా వేస్తూ వెళ్ళారాయన....

కాశ్మీర్ సమస్యకు తుది పరిష్కారం కాలేదు. దానిని గురించి పాకిస్తాన్, భారత దేశాలు కీచులాడుకోవటం సబబుకాదు. కాశ్మీర్ సమస్య పరిష్కారం కాశ్మీర్

ప్రజల చేతుల్లోనే వుంది. 'ప్లెబిసైట్' కాక పోతే మరొకటి - ఏదైనా నిర్ణయం తీసుకోవలసింది మాత్రం ప్రజలే — ఇదీ శ్రీ అబ్దుల్లా ధోరణి.

అప్పట్లో కాశ్మీర్ భారతదేశంలో విలీనం కావటంగురించి తాను ప్రధానిగా వున్నప్పుడు చెప్పినమాటలు అన్నీ 'తాత్కాలిక నిర్ణయాలే' అంటా రాయన ఇప్పుడు. 'తు నాబొడ్డు' అనుకుని అన్నీ మరిచిపోవాలంటారు. తన హయాంలో కాశ్మీర్ శాసన సభ చేసిన నిర్ణయాలన్నీకూడా అలాగే అనుకోవాలి....

ఆయన ధోరణి వింత అనుకోటం మాత్రం వింతే ...

ఎందుకంటే-కాశ్మీర్ సింహం అన్నాళ్లు జైలులోవుండి, ఒక్కమాటు జైలులోనుంచి విడుదలైనప్పుడు, జైలులోకి ప్రవేశించినప్పుడు చూపిన ధోరణినే మళ్ళీ ప్రలాపిస్తుందని చాలామంది అనుకోకపోయినా, ముఖ్యంగా శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రిమాత్రం తప్పకుండా అనుకున్నారు. షేక్ సాహెబ్ ఈవిధంగాకాకుండా, ప్రస్తుత ధోరణికి విరుద్ధంగానేకవక ప్రవర్తించివుంటే 'ఫార్మ్యులా' దెబ్బతినేది....

ప్రస్తుతం కాశ్మీర్ విషయంలో మనం చేస్తున్నపని-ప్రజలమీద నమ్మకంగా బాధ్యతనువేసి పర్యవసానాలకు జాగ్రత్తగా వేచివుండటం-'నాడి'చూసి వైద్య నిర్ణయం-

అందుకే అప్పుడు 'పవిత్రకేశం' విషయంలో 'దొరికిన కేశం' నిజమైనదా కాదా అనే విషయం ప్రజలకు తెలియజెప్పాలనుకున్నప్పుడు—తొణకకుండా బెణకకుండా మతాధికారులకే ఆ నిర్ణయాధికారం వప్పజెప్పారు శ్రీ లాల్‌బహదూర్ అన్నీ సవ్యంగానే జరిగినాయి.

ఇప్పుడూ అంతే....

ప్రజలేం చేస్తారో, వాళ్ళ తప్పుదోవల్లో పడి చెప్పుడుమాటల్లో పడి చెడిపోతారేమో అనుకుని 'బంధనోపాయాలు' ఆలోచించటం ప్రజాస్వామ్య లక్షణంకాదు. ధీరోదాత్త నాయకత్వ లక్షణం అంతకంటే అసలేకాదు.

అందుకే....

కాశ్మీర్ సింహాన్ని నిర్భయంగా గోదాలోకి వదలాలి. ఆడినంతసేపు ఆడనిచ్చి, తరువాత మచ్చికకు మార్గాలు—

ఒక్క విషయం ప్రధాని నెహ్రూ స్పష్టం చేశారు. కాశ్మీర్ భారతదేశంలో విలీనమైనదన్నదానికి తిరుగులేదు. శ్రీలాల్ బహదూర్, శ్రీ చాగ్లాగారలు కూడా యీ విషయాన్ని స్పష్టం చేశారు.

కాశ్మీర్ ప్రధాని శ్రీ సాదిక్ మొన్ననే ఢిల్లీ వెళ్ళి అక్కడి పెద్దలకు పరిస్థితులను వివరించారు.

కాశ్మీర్ భారతదేశంలో విలీనమైన విషయం తిరుగులేనిదని పునరుద్ఘాటించారు.

అయితే—

మరి షేక్‌ను యిప్పుడు యేం చెయ్యాలి అనేది మరో సమస్య. అరెస్టు చెయ్యటం అప్రస్తుతం. నోటికి తాళం వేయించటం, ప్రస్తుతాంశం.

పాత విషయాలు పునశ్చరణ చేసుకుంటే — 1953 లో జరిగిన చిన్న పొరపాటు: కాశ్మీర్ ప్రధానిగా వున్న అబ్దుల్లా ప్రాపకం క్షీణిస్తున్న రోజులు, బక్షీగులాం ప్రభలు వెలగటం ప్రారంభమైన రోజులు— అలాంటి తరుణంలో శ్రీ అబ్దుల్లాని అరెస్టు చెయ్యకుండానే మరోవిధంగా ప్రారంభమైన క్షీణదశను ఆసాంతం ఆయన చూడగలిగేటట్లు సహజమార్గాలకు వదలిపెట్టినట్లయితే, ఫలితాలు మరోవిధంగా వుండేవి.

ఇప్పుడు....'అప్పటి అబ్దుల్లా' మళ్ళీ ప్రత్యక్షమవటం....

అయినా—

అన్ని సంవత్సరాలు 'ఒక ఫార్సు'గా కారాగారం శ్రీ అబ్దుల్లా అనుభవించడం; ఈ మధ్యకాలంలో బక్షీగులాం మహమ్మద్ చెలాయించిన లోప భూయిష్ఠమైన, అవినీతి అట్టడుగుకు దిగజారిన పరిపాలన - ఇవన్నీ ప్రజలలో అబ్దుల్లాపట్ల ఆదరణను, సానుభూతిని పెంచినాయి.

అందుకే ఆయనకు ఆ అఖండస్వాగతం-

కాని సామాన్య కాశ్మీర్ పౌరునిలో మరో భావనకూడా పేరుకుంటోంది. బక్షీ పాలన అంతంకావటం, 'మత ప్రవక్త పవిత్రకేశాన్ని' మళ్ళీ తెచ్చి పునఃప్రతిష్ఠ చెయ్యటం, శ్రీ సాదిక్‌లాంటి ప్రజాభిమాని, ఉత్తముడు రాజ్యాధికారం చేబట్టటం, చివరికి అబ్దుల్లాను విడుదలచెయ్యటం- ఈ సంఘటనలన్నీ ఒక కొత్త చైతన్యాన్ని కాశ్మీర్‌లోయలో ప్రభవింపచేస్తున్నాయి.

గడ్డురోజులు....

జాగర్తగా వ్యవహరించాలి. ఏమాత్రం తొందరపాటు చూపినా అంతా వృథా ప్రయాస అవుతుంది.

అందుకే—

అబ్దుల్లాను అరెస్టు చెయ్యకూడదు.

ఏప్రిల్ 29 వ తేదీన శ్రీ అబ్దుల్లా ప్రధాని నెహ్రూను కలుసుకుంటారు. వారిద్దరిలో ఒకరిపట్ల ఒకరికి ఒక ప్రగాఢమైన గౌరవభావం, మైత్రి మొదటినుంచీ వున్నాయి....

ఒక్కవిషయం మాత్రం మనం మరచిపోరాదు. అబ్దుల్లా మతోన్మాదికాదు. ఆరడుగులపైబడ్డ అజానుబాహువు. కాశ్మీర్ చరిత్రలో నిండైన అంతర్భాగం ఆయన జీవితం శ్రీ జిన్నామాటలకు లొంగని ముస్లిం నాయకుడు అబ్దుల్లా. సామాన్య కుటుంబంలోనుంచిబయలుదేరి భారతదేశ స్వతంత్ర సమరం జరుగుతున్న రోజులలోనే కాశ్మీర్ విమోచనోద్యమం ప్రారంభించిన నాయకుడు.

1947 లో పాకిస్తాన్ దుండగులు కాశ్మీర్‌ను ముట్టడించి దండెత్తితే భీకరంగా పోరాడి భారతదేశంతో పొత్తు గలిపిన 'కాశ్మీర్ సింహం' ఆయన.

ఏమైనా, ఆయనది పొంగిపొరలేస్వభావం. ఆలోచనలను దాచుకోలేడు. బహిరంగంగా ఆలోచిస్తే స్వలాభపరులు మరింత రెచ్చగొట్టారు ఆయనను.

శ్రీ సాదిక్ అంటే ఆయన సుముఖుడు. సామంతోనే కార్యసాధన జరుగుతుందని ఆశిద్దాం.

కమ్యూనిస్టులు

రాజకీయంగా కమ్యూనిస్టులు చెలరేగి "విస్తళ్ళు చింపుకున్నంతగా" మరి యే ఇతరులు చెయ్యలేదేమో ననిపిస్తుంది. చరిత్ర చూస్తుంటే.

అసలు ఉద్యమం ప్రారంభమైనప్పుడే, గత శతాబ్దంచివరి భాగంలోనే-'ఫస్టు ఇంటర్ నేషనల్' వివాదాలతోనే పరిసమాప్తమైంది. 'సెకండ్ ఇంటర్నేషనల్'కూడా అంతే....

విప్లవంరావాలి-వ్యష్టికి, సమష్టికీ మధ్య అంతరం. జాతీయత అంతర్జాతీయంగా ఆలోచిస్తుంటే యెంతవరకూ ప్రతిబంధకం అవుతుందీ-ఇవి కమ్యూనిస్టు వుద్యమంలో స్థూలంగా ప్రధాన సమస్యలు - చివరికి ముసలంపుట్టించి మౌసలపర్వానికి దారితీసినాయి.


రష్యాలో 'బోల్షివిక్' 'మెన్షివిక్' తగాదాల ప్రారంభం ఇంతే.

తనసంగతి తాను చూచుకుంటోంది రష్యా. ఇతరదేశాలలో కమ్యూనిజం వ్యాప్తికి సరిగ్గా ప్రయత్నాలు చెయ్యటంలేదనేది రష్యామీద చైనా చేస్తున్న ఒక అభియోగం.

మొదటి ప్రపంచ యుద్ధం వస్తేనే రష్యాలో కమ్యూనిజం రాగలిగింది. యుద్ధం జరుగుతున్నప్పుడే అంతర్ముఖంగా విప్లవ శక్తులు ప్రజ్వరిల్లి 'బూర్జువా శక్తులను కూలదొయ్యటానికి అవకాశం దొరుకుతుంది.

అట్లాగే రెండవ ప్రపంచ యుద్ధం మూలంగానే చైనాలో కమ్యూనిజం స్థాపనకు అవకాశం కలిగింది.

అలాగే - మూడవ ప్రపంచ యుద్ధం రావాలి; సంఘర్షణలు పేట్రేగి బాంబులు పేలుతున్నప్పుడే విప్లవానికి నిజమైన అవకాశం లభించి యావత్ప్రపంచంలో కమ్యూ



నిజం స్థాపన జరుగుతుంది. ఇది చైనా వాదన.

వేలమంది, లక్షలమంది నరమేధయాగం జరిపి తేనే కమ్యూనిజం నిజంగా స్థాపిస్తాం అంటాడు మావో.

రష్యావాదం యిందుకు ఇప్పుడుభిన్నంగా ఉండటం కమ్యూనిస్టుల ప్రపంచంలో అలజడికి తావుకలిగించింది.

మరింత యెక్కువకాలం సుదీర్ఘంగా ప్రజలను బాధపెడితే విస్పృహ చెంది పోతారు. కమ్యూనిజంమీద విరక్తికూడా పుడుతుంది.

"బట్టర్ అండ్ గన్స్" వీటిలో యేదో ఒకటి కోరుకోమంటే శ్రీ కృశ్చెవ్ వెన్ననే కోరుకుంటాడు.

శాంతి, సౌభాగ్యం, సౌమ్యవిధానాల ద్వారానే సామ్యవాద సమాజ స్థాపన జరగాలంటాడు. స్టాలిన్ జరిపిన హత్యాకాండను తిరిగి జరపకూడదంటాడు.

కమ్యూనిస్టుల్లోని చీలికలు ప్రతిచోటా ప్రతిధ్వనిస్తున్నాయి. 'పెకింగ్' శక్తులు భారతదేశంలో కుట్రపన్ని "శ్రీ డాంగే శీలాన్ని హత్య" (క్యారెక్టరు అశాసినేషన్) చేయాలని విఫలప్రయత్నం చేశారు.

ఒక రాజకీయనాయకుడిని అపఖ్యాతి పాలు చెయ్యటానికి బ్రిటిష్‌వారు అనేక ప్రయోగాలు చేశారు. వాటికిచ్చే విలువ వాటికివ్వాలి.

మరోవిషయం. శ్రీ డాంగే మామూలుగా శ్రీ పాద్ అమృత్ డాంగే అని సంతకం

చేస్తారు. అప్పుడూ యెప్పుడూ కూడా. బ్రిటిష్ ఏజెంట్ అవటానికి సిద్ధపడ్డట్లు తెలియచేసిన ఆ ఉత్తరంలో మాత్రం శ్రీ డాంగే సంతకంలో శ్రీ.పా'డ్'బదులు శ్రీ పా'త్' అని వుంది. 'డి' అనేదానికి బదులు 'టి' అని వుంది.

అదీకాక ఈ లేఖ రాసినాకూడా డాంగేను బ్రిటిష్‌వారు వదిలిపెట్టలేదు. జైలు శిక్ష పూర్తిగా అనుభవించారు. ఆయన తరువాత జరిగిన "మీరట్ కుట్రకేసు"లో మళ్ళీ అరెస్టుకాబడ్డారు.

ఏమైనా ఆ ఉత్తరాల సంగతి ఇప్పుడు అప్రస్తుతం కాదా?

రాష్ట్రంలో రాబోయే రోజులు పంచాయితీల రోజులు. తగువులు, తీర్పులకు పర్యాయ పదం 'పంచాయితీ'.

రాబోయేవి పంచాయితీ అధ్యక్షుల సభ్యుల యెన్నికల రోజులు. పంచాయితీల ప్రయత్నాలు ముమ్మరంగా వాడవాడలో జరుగుతున్నాయి.

అట్లాగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకూడా జరుగుతుందంటున్నారు. మరి యే ఇద్దరూ అనేది తెగని ప్రశ్న. అయ్యేవరకూ అందరూ అయేవారే. ఏ పేరు చెప్పినా తప్పురైటూకూడా అందుకే ఈ పంచాయితీలు.

ఇప్పుడిది పంచాయితీల రాజ్యం.

—అనంతం

చిన్నారికి చిన్నమాట

— బాలగంగాధరతిలక్

జీవితం సంగీతం పెట్టెమీద
చిగురుటాకు అంగుళులను కదలనీ
పలుకుతుంది హిందోళ
ఒలుకుతుంది నవహేల
అపుడు—
బ్రతుకే ఊగే ముత్యాల ఉయ్యాల.

జీవితం నవనీతం పాత్రమీద
చెదరి పడనివ్వకు రాయినీ రప్పనీ
పగులుతుంది స్వప్నం
రగులుతుంది దుఃఖం
అందుకే
బ్రతుకే ఉలిపిరి కాగితం చందం.

జీవితం దేవతల దరస్మితం
చిన్నారీ! పెదవి మీద సింగారించు
కలతవద్దు కొలతవద్దు
అలసట అలజడివద్దు బాల
అపుడు
బ్రతుకే లలిత లలిత లతాంతమాల!



మనసులోని కోరిక

తులసి వెనకాలవున్న అన్ని గదులూ వూడ్చి, దక్షిణపు వైపున్న పడగ్గదిని ఊడవడానికి దగ్గరగావున్న ఆగదితలుపుల్ని మెల్లగా ముందుకుతోసి లోపలికిచూచింది.

గదిలో తన కెదురుగా నిలబడి ఎవరో ముందుకువంగి తనవంకే చూస్తున్నట్లనిపించింది. తులసికి భయంవేసింది. కాస్త నిదానించి చూచేసరికి ఎదురుగుండా గోడ కమర్చబడిన ఒక నిలువుటద్దం కన్పించింది. అందులోని తన ప్రతిబింబాన్ని చూచే తాను భయపడిందన్న విషయం గ్రహించి నవ్వుకుంటూ అద్దం ముందుకెళ్ళి నిలబడింది. రేగిపోయిన ముంగురులను కొనగోళ్ళతో దువ్వుకుంటూ అద్దంలో తన అందాన్ని చూచుకుని మురిసిపోయింది.

ఇంతలో గోడగడియారం ఏదో పాశ్చాత్య సంగీతంలా టింగు టింగుమని గంటలు కొట్టటం మొదలుపెట్టింది. తులసి కంగారుగా గదంతా కలయజూచింది. గోడ గడియారాన్ని చూచింది కాని, అందులోనుంచే ఆ శబ్దం వస్తున్నట్టు గ్రహించలేకపోయింది. ఆ గడియారంలో రెండు పక్షి బొమ్మలు ముచ్చట్లాడుకుంటున్నట్టుగా ముందుకు వెనక్కూ ఊగుతుండడాన్ని తులసి ఎంతో వింతగా పరికించింది. ఆ గది గోడలకు పెద్దపులుల తలలు, జింక తలలు. రకరకాల జంతు చర్మాలు, కత్తులు, కటార్లు, పెద్దపెద్ద తైలవర్ణ చిత్రాలు వున్నాయి. గది పైనుంచి రంగురంగుల గాజుబుడ్ల గుత్తులు వ్రేలాడుతున్నాయి. గదిలో ఒకమూల చక్కని లతలతో, బొమ్మలతో నగిషీ చేయబడిన వల్లజాజి డ్రాయరువుంది. దానిమీద రకరకాల అలంకరణ సామానులు ఉన్నాయి. గది నాల్గుమూలలా స్టాండుల్లో అమర్చబడివున్న వెండి పూలతొట్లు ఉన్నాయి. వాటిలో అప్పుడే కోసి తెచ్చి పెట్టినట్టుగా భ్రమకల్పించే కాగితపు పూలున్నాయి. నీలపు అద్దాలతో తయారుచేయబడిన కిటికీ దగ్గరగా ఒక పాన్పువుంది. ఒక నెమలిబొమ్మలాగా ఆ పాన్పు ఏర్పాటు చేయబడింది. ఆ పాన్పు చుట్టూ సిల్కు తెరలు వ్రేలాడుతున్నాయి.

ఆ గదిని, గదిలోవున్న వింత వింత వస్తువుల్ని చూచేసరికి తులసికి మతిపోయినంత పనయింది. తను ఎక్కడ వున్నానా అనిపించింది. ఇది కలకాదు కదా! ఇలాంటి గదిలో ఉండేవాళ్ళు మనుషులేనా! లేక స్వర్గలోకంలో ఉండే దేవతలా! అబ్బ! వీళ్ళు యెంతగొప్పవాళ్ళో! ఈగది చూడటానికే యింత అందంగా ఉంది. ఇందులో ఉండే మనుషులు ఇంకా యెంత అందంగా ఉంటారో! ఈ ఇంటి ఖామందులు యెంత గొప్ప ధనవంతులో! ఇంత గొప్పవాళ్ళింట్లో పని చేయడానికి నిజంగా తన మల్లన్న మావ ఎంతపున్నెం చేసుకున్నాడో! అదిని కట్టుకున్న తాను నిజంగా అదృష్టవంతురాలే! పోయిన ఏడు తన అయ్యావాళ్ళతో సినిమా చూడ్డానికి బస్తీకెళ్ళింది. ఆ సినిమాలో రాజులు, రాణులుండే గదులు, వాళ్ళ ఇళ్ళు అన్నీ యిలాగే ఉన్నాయి. సినిమాలో చూపించే ఆ మనుషులు, ఆ భవంతులూ ఏవూళ్ళో ఉంటాయే అని మాణిక్యాన్ని అడిగితే అది నవ్వి - "ఓసి, ఎర్రిమొగమా! సినిమాలో వూరికే అట్టా సూపిత్తారే. నిజంగావుండవు-" అంది. అప్పట్లో నిజమేననుకుంది. ఇప్పుడు ఈగదీ, ఈవస్తువులూ, ఇదంతా చూస్తుంటే మాణిక్యం అబద్ధాలు చెప్పిందేమో ననిపిస్తోంది. ఈ ఇంటివాళ్ళుకూడా సినిమావాళ్ళేనేమో. మరయితే వీళ్ళుకూడా పాటలు పాడుతూ ఆకాశంలో యెగురుతారేమో....

తులసి ఇలా అనుకుంటూ ఆ పాన్పు సిల్కుతెరలు తొలగించి లోపలికి తొంగి చూచింది. దానిమీద వెన్నెలలాంటి తెల్లటి దుప్పటి పరచివుంది. మఖమల్ తలగడలు చక్కగా అమర్చబడివున్నాయి. ఆ తలగడలనుంచో, ఆ దుప్పటినుంచో సువాసనలు గుప్పుమంటున్నాయి. తులసికి ఆ పరుపు ముట్టుకుని చూడాలనిపించింది. మళ్ళీ భయమేసింది, ఎవరన్నా చూస్తారేమోనని. భయం భయంగా నలువంకలా చూచి, చివరకు ఎలాగో ధైర్యం చేసి ఆ పరుపుమీద చేయి వేసింది — మల్లెపూల తట్టలోచెయ్యి పెట్టినట్టనిపించింది. పాలకుండలో చేయి ముంచినట్టనిపించింది. కిటికీలోనుంచి వీచే చల్లనిగాలికి సిల్కుతెరలు కదిలి తులసి చెంపలకు రాసుకున్నాయి. తులసికి చక్కిలిగింతలు పెట్టినట్టనిపించింది. ఆ సిల్కుతెరలను చేతులతో పట్టుకుని చెంపలకు ఆనించుకుని, ఆ పాన్పువంక ఆ మఖమల్ తలగడల వంక చూస్తుంటే - తులసి గుండెల్లోంచి ఒక కోరిక చిన్నగా, సన్నగా కదులాడింది. మళ్ళీ వెంటనే తనమనస్సులో అనుకున్నదాన్ని యెవరన్నా విన్నారేమో ననిపించింది. భయపడింది .... సిగ్గుపడిపోయింది. 'ఖామందులు పడుకునే పక్క' అని మనసులో అనుకుని, చెంపలు వాయించుకుని, ఆ పాన్పును కళ్ళకద్దుకుని దణ్ణం పెట్టుకుంది.

తోటలోంచి మల్లన్న "తులశా!" అని పిలుస్తున్నాడు. ఆ పిలుపు విని తులసి వెనక్కు తిరిగింది. ఆ పాన్పు కాళ్ళ కట్టవయిపు గోడదగ్గరగా నిలబెట్టబడివున్న ఒక నగ్నసుందరి పాలరాతి విగ్రహం తులసి కళ్ళబడింది. అప్పటివరకూ తులసి ఆ విగ్రహాన్ని చూడనే లేదు. నగ్నంగావున్న ఆ విగ్రహాన్ని చూడగానే తులసి సిగ్గుల బొమ్మయిపోయింది. చేతులతో కళ్ళుమూసుకుంది. చేతి వ్రేళ్ళ సందులనుంచి ఆ విగ్రహం కన్పిస్తూంది. ఆ నగ్నసుందరి నవ్వుతూ తనవంకే చూస్తున్నట్టనిపించింది.

"ఓ తులశా!" అని మల్లన్న పొలికేకలు పెట్టుతున్నాడు. అక్కడ ఒక సోఫామీదున్న సిల్కు గుడ్డను ఆ నగ్నసుందరి మీద కప్పి తులసి బయటకు వచ్చింది.

ఆ గది తలుపులను చేరగిల వేస్తుంటే "ఇందాకట్నించి పొలికేకలు పెడుతుంటే పలకవేమే? ఇంకా పూడవటంగాలా?" అంటూ మల్లన్న వచ్చాడు.

తులసి "ఆ గది విచ్చిత్తరంగా వుంటే సూత్తున్నా" అని ఆ గదివంక చూపించింది.



మాతృదేవతకు నిర్వచనం: అయిదుగురు మనుషులలో నలుగురికి సరిపడే అన్నంమాత్రమే వుండడం చూసి, తనకి బొత్తిగా ఆకలిలేదని అబద్ధమాడేది.

కృష్ణమాచార్య

"అన్నీ విచిత్రతరంగానే ఉంటాయికానీ, పా, పా! పూలమొక్కలకు నీళ్ళు పొయ్యాలి" అంటూ బయటకు దారితీశాడు. వెనకాలే తులసి నడిచింది.

● ● ●

ఆ భవనం పట్నానికి పదహారుమైళ్ళ దూరానవుంది. పట్నంలోవుండే ఒక ధనవంతుల కుటుంబం. వారు ఆ భవనాన్ని నిర్మించారు. ఆ భవనానికి చుట్టుప్రక్కలా ఎటుచూచినా అడవులూ, కొండలూ, గుట్టలూ ప్రశాంతిలో మునిగివుంటాయి. ఆ ధనవంతుల కుటుంబం యజమానికి ఒకసారి పెద్ద జబ్బుచేసింది. డాక్టర్లు పట్నం వాతావరణంలో కాకుండా ప్రశాంతంగా వుండేచోట కొన్నాళ్ళపాటు ఉండాలన్నారు. అప్పుడు వూరికి దూరంగా ప్రశాంతంగా వుంటుందని ఆ భవనాన్ని అధునాతనంగా, సకల సౌకర్యాలతో నిర్మించారు. ఆయన ఆ భవనంలోకి మకాంమార్చిన కొద్ది రోజులకే స్వర్గస్థుడయ్యాడు. ఆ తర్వాత ఆయన కుమారులు దానిని తమ విలాసమందిరంగా మార్చుకున్నారు.

రోగగ్రస్తుడయిన ఆ కుటుంబ యజమానికి సపర్యలుచేయడానికి ఆయన ముసలి నౌకరు (మల్లన్న తండ్రి) కూడా వచ్చాడు. యజమాని పోయినతర్వాత మల్లన్న తండ్రి అక్కడే వుండిపోయాడు. ఆ భవనం వెనకాలఉన్న గుడిశెలో ఉంటూ ఆ భవనానికి కాపలాదారుడుగా వుంటూవచ్చాడు. నెలకూ, రెండు నెలలకూ ఒకసారి ఆ కుటుంబంలోవాళ్ళు ఎవరో ఒకరు కార్లో వచ్చి నాలుగైదు రోజులుండి పోతుంటారు. ఒకొక్కొక్కప్పుడు ఎక్కువరోజులు మకాం వేస్తారు. అప్పుడు తమవెంట వంటవాళ్ళను కూడా తీసుకుని వస్తుంటారు. తండ్రి చనిపోయిన తర్వాత మల్లన్న ఆ భవనానికి ఆ భవనానికి కాపలాదారు డయ్యాడు. ఆ భవనాన్ని జాగ్రత్తగా కాపలాకాస్తూ, భవనం చుట్టూ ఉన్న పూలమొక్కలకు నీళ్ళు పొయ్యడం, పావురాళ్ళనూ, కోళ్ళనూ పెంచుతుండటం, ఎవరయినా యజమానులూ, వాళ్ళతరఫువాళ్ళు వచ్చినపుడు వాళ్ళకు అన్ని సదుపాయాలూ చేయటం—ఇదీ మల్లన్న పని.

మల్లన్న మొదటిభార్య గర్భంధరించి ప్రసవించేవేళ చనిపోయింది. ఆ తర్వాత తులసిని రెండోపెళ్ళి చేసుకున్నాడు. తులసి రెండురోజుల క్రితమే మల్లన్న ఇంటికి కొత్తగా కాపరానికి వచ్చింది. తులసి వయస్సులో మల్లన్నకంటె చాలా చిన్నది. ఎక్కడో కుగ్రామంలో పుట్టి పెరగడంవల్ల కాస్త అమాయకంగా ఉంటుంది. కాని, పనిపాటలుమాత్రం చక్కగా చేస్తుంది. అందచందాల్లోనూ ఏం తక్కువగా ఉండదు. పుత్తడిబొమ్మలాగా ఉంటుంది. అందుకనే మల్లన్న తనకు పనిపాటల్లో సహాయంగా ఉంటుందని తులసి తండ్రికి రెండువందలిచ్చి తులసిని పెళ్ళిచేసుకుని తన గుడిశెకు తెచ్చుకున్నాడు. నిన్నటిరోజంతా తులసికి తన గుడిశెను సవరించుకోవటంతోనే సరిపోయింది. ఇవ్వాళ బంగళా వూడవటానికి వచ్చింది.

● ● ●

ఆరాత్రి తులసి తిండి తిని కుక్కిమలక మంచంలో పాతబొంత వేసుకుని పడు

కుంది. పడుకుందన్న మాటేగానీ నిద్దర పట్టలేదు. కన్నుమూసినా, తెరచినా బంగళాలోని పడగ్గది, సిల్కుతెరలపాన్పు, నిలువుటద్దం, పాలరాతి విగ్రహం - ఇవే కళ్ళముందు మెదులుతున్నాయి. తాను పడుకున్న కుక్కిమంచం కదిలినప్పుడల్లా కిర్రు, కిర్రుమంటూ తనను వెక్కిరిస్తున్నట్లనిపించింది. ఈ పాడు మంచం తన ప్రాణానికి యెక్కడ దాపురించిందా అని మనస్సులో తిట్టుకుంది.

మొదట్లో మావ తన్ను రెండు మూడు రోజులకోసారి బంగాళాలో గదులు చిమ్మమన్నాడు. కాని, యిప్పుడు తాను రోజూ రెండుపూటలా చిమ్ముతున్నది. ఏదో ఒక పని కల్పించుకుని ఆ గదిలోకివెళ్ళి ఒక్కసారి ఆ పాన్పునూ, పాలరాతి విగ్రహాన్నీ, నిలువుటద్దాన్నీ చూచి వస్తుంది. రాను, రాను తులసి బంగళాలోని పడగ్గదినీ, సిల్కు తెరల పాన్పునూ మరచిపోలేకపోతున్నది. ఏపని చేస్తున్నా అవే కళ్ళముందు కదులాడుతున్నాయి. తన గుడిశెలోని కుక్కిమంచాన్ని చూడగానే దాన్ని యెక్కడికక్కడ విరిచి పొయ్యిలో పెట్ట బుద్ధేస్తుంది. బంగళాలోని గది గుర్తుకు రాగానే తులసి గుండెల్లో గులాబీలు పూస్తాయి.

ఎందుకనో తులసి రెండు మూడురోజులుగా మల్లన్నమీద వుండివుండి విసుక్కుంటున్నది. మళ్ళీ కాసేపట్లో అతడిని అంతులేని అనురాగంలో ముంచి లేవనెత్తుతుంది. అతడిని ఆటలు పట్టిస్తుంది. ఇదివరకు తులసి గుండెల్లో సన్నగా, జాలుగా, రేఖగా మెదిలే కోర్కె యీమధ్యలో తుగా, ముంపుగా, ముమ్మరంగా వూగించి పారేస్తున్నది తులసిని. తనలో యింతగా తావుచేసుకున్న ఆ కోర్కెను మల్లన్నకు మాటల ద్వారా చెప్పడానికి జంకుతున్నది. తన కోర్కెవిని మన్నిస్తాడో లేదో! ఆఖరికి ఓరాత్రి ధైర్యం చేసింది - ఆరుబయట, వెన్నెట్లో ఆ కుక్కిమంచంమీద - తన సౌందర్యారాధనలో మైమఱచిన మల్లన్న మావ చెవిలో మెల్లిగా ఊదింది - 'బాబుగోరి బంగళాలో పడగ్గదిలో ఆపక్క ...' అబ్బ, ఎంత బావుందో! దానిమీద.... మరే ...పడుకోవాలనిపిస్తుంది' - అని.

అంతే! వినకూడని మాట విన్నట్లు మల్లన్న ఉలిక్కిపడ్డాడు. శివాల్నలేచి నుంచున్నాడు. కోపంగా 'ఈకూత మళ్లా కూశావంటే ముక్కలు విరగబొడిసేత్తా! కోరక, కోరక భలే కోరావులే. ఇదా యిసయం, అగదిమీద ఓమోజుసూపిత్తాంటే ఏటో ననుకున్నా.' అని పైపంచ కసిగా దులిపి భుజానేసుకుని బయటికెళ్లాడు.

బయటకెళ్ళిన మల్లన్న ఓ గంటసేపు అక్కడా అక్కడా తిరిగి గుడిశెకువచ్చాడు. మంచంమీద తులసిలేదు. ఆ కుక్కిమలక మంచం, పాత బొంతా మల్లన్నను వెక్కిరించాయి. కంగారుగా మల్లన్న గుడిశెలోకి తొంగి చూచాడు. ఓమూల పడుకుని తులసి వెక్కివెక్కి ఏడుస్తూంది. మెల్లగా దగ్గరకెళ్ళి 'తులశే' అన్నాడు. అతడి గొంతు వినగానే తులసి ఏడుపు యింకా యెక్కువయింది. చేతుల్లోకి తీసుకుంటానికి ప్రయత్నించాడు. ఉహూ....పాముపిల్లలాగా, పొగలాగా, అలలాగా, కలలాగా జారిపోయింది.

"పిచ్చిదానా! మనం అలాంటి పని సేయకూడదే" అన్నాడు.

"ఒక్కసారంటే ఒక్కసారి కేమవుతుందేవిటీ? నామీద నీకు మనసులేదని చెప్పరాదూ." అంది.

—తులసి కన్నీటి వాగయింది. ఉద్వేగాల ఉరవడిలో రెల్లుపొల్లయింది.

"సర్లే వే, రేపు సూద్దాంగా....ఆ.... సరేనా" అంటూ మళ్లా చేతులోనికి తీసుకుంటానికి ప్రయత్నించాడు. ఈసారి తులసి వుడుంలాగా అతుక్కుపోయింది మల్లన్నకు. వెన్నెలలాగా అలుముకుంది. నిప్పురవ్వలాగా చురుక్కుమంది. మల్లన్న చేతి బాణాకర్ర చివరకట్టిన మువ్వలాగా నవ్వింది గుండెల మీద....

మర్నాడల్లా తులసి ఆనందానికి అవధులు లేవు. పనులన్నీ చకచకా చేసుకుంది. మల్లన్న తన్ని పిల్చి బంగళా అంతా కడిగి ముగ్గులుపెట్టి వుంచమని చెప్పినప్పుడు- "ఓస్, నీవు నాకు చెప్పాలేం"టని ! చీర ఎగగట్టి, పమిటచెంగును నడుంచుట్టూ తిప్పి బొడ్లో దోపుకుని, చీపురుతీసుకుని రాంబాణం లాగా వెళ్ళింది బంగళావయిపు. ఆమె కా రోజల్లా బంగళానంతా కడగటం, ముగ్గులు పెట్టటం, ఎక్కడి వస్తువుల్ని అక్కడ సవరించటంతోనే సరిపోయింది.

సాయంత్రం నాల్గుగంట లయేసరికి కార్లో ఇంటి పెద్దకోడలమ్మగారు, పిల్లలతోను, కాలేజీలో చదువుకుంటున్న మరిదితోను దిగారు—తులసి గుండెల్లో రాయిపడ్డది. అందులోను వంటవాళ్ళతో సహా దిగారు. అంటే చాలారోజులే ఉంటారన్నమాట. తులసికి ఏడుపువచ్చినంత పనయింది. వచ్చేసిందికూడా. మొగం ముడుచుకుని గుడిశెలో ఓ మూల కూర్చుంది. మల్లన్న మాటిమాటికీ బంగళాలోకీ గుడిశెలోకీ హడావుడిగా తిరుగుతూ అలిగికూచున్న తులసినిచూచినవ్వుతూ "ఏం, పిల్లా! ఇంకా అట్టా కూసున్నావే. పొద్దుకూకుతుంది. సోకు సేసుకోమరి." అనేసరికి తులసి వుడికిపోయింది కోపంతో. వుక్రోషంతో మొగం కందగడ్డయింది. ఆ రాత్రి మల్లన్న దగ్గరకుపిలిచినా రాకుండా గుడిశెలో ఓ మూల ములగదీసుకుని పడుకుంది.

ఒకరాత్రికాడ మల్లన్న తులసిని- "లేవే"-అంటూ తట్టి లేపాడు. తులసి విసుక్కుంటూ లేచి కూర్చుని, ఆవులిస్తూ "ఎందుకు లేపావు" అని అడిగింది.

"రా, నీకొక గమ్మత్తు సూపిత్తా" నంటూ కిటికీదగ్గరకు తీసికెళ్ళి బంగళావయిపు చూపించాడు.

బంగళా అక్కడకు పదిబారల దూరంలో వుంది. ఎదురుగుండా పడగ్గది కిటికీ కన్పిస్తున్నది. గదిలోపల లైటు వెలుగుతూంది. కిటికీ దగ్గరగా రెండు ఆకారాలు ప్రక్క ప్రక్కన నిలబడివున్నాయి. ఒక ఆకారంలో మరొక ఆకారం కలిసిపోతున్నట్లుంది. కరగిపోతున్నట్లుంది.

తులసి పక్కకుజరిగి మల్లన్నను గట్టిగా వాటేసుకుంది. భయంతో తులసి గుండె దడదడలాడింది. మల్లన్నను బల్లిలాగా కరచుకుని మెల్లిగా "అదేటి మావ, ఆళ్ళిద్దరూ పెదకోడలమ్మగారు, బుల్లిబాబు గోరు కదూ" అని అడిగింది.

మల్లన్న నవ్వుతూ తులసి వీపుమీద గోముగా రాస్తూ 'అళ్ళేమరి' అన్నాడు. ఒక నీచాతి నీచ కార్యాన్ని కళ్ళతో చూచినప్పుడు, చెవులతో విన్నప్పుడు కలిగే జుగుప్సాభావం తులసి నిలువెల్లా ప్రాకింది.

'అటుసూడు' అని మల్లన్న మళ్ళీ ఒక దృశ్యాన్ని చూపించాడు. ప్రపంచంలోని పాపమంతా ఒకచోట చేరుకుని, పేరుకుని ముద్దకట్టినట్టుగా లీనమయిపోయిన ఆ రెండు ఆకారాలు మెల్లగా సిల్కుతెరల పాన్పువైపు నడిచాయి. తులసికి ముచ్చెమట్లు పోశాయి. కాళ్ళలోని సత్తువంతా కరగి చెమటగా కారిపోయింది. నిలవలేక మల్లన్న మీదకు వరిగిపోయింది.

● ● ●

'నీకు తెల్దుగాని తులశా. నేను నాచిన్నతనంనుంచీ ఈ కళ్ళతో ఈ బవంతిలో, ఆగదిలో జరిగిన గోరాలెన్నో సూశా. ఇప్పుడు నిన్నమరిదితో కులుకుతున్న ఈయమ్మ కారుడయివరు సుందరంగాడితో వుండగా నా యీ కళ్ళతో సూశా. ఈబుల్లిబాబుగోరి తరువాతావిడ. ఇప్పుడంటే పెళ్ళయి అత్తారింటికెళ్ళింది గానీ, కాలేజీలో సదివేటప్పుడు పెతి ఆదారం కార్లోవచ్చి ఆ సుందరంగాడితో ఆగదిలో గంటా, రెండు గంటలుండిపోయేది. ఇక పెదబాబుగోరి సంగతి సరేసరి. ఒకమారి తెచ్చిన ఆడమడిసిని ఇంకోమారి తెచ్చేవాడు కాడు. ఆళ్ళల్లో అసలయిన పెదకోడలమ్మ ఎవరో నాకు నిన్నమొన్నటిదాకా తెల్దంటే నమ్ము. ఒకసారి ఏవయిందంటే - పెదబాబుగోరు ఎవతెనో తీసుకొచ్చాడు కార్లో. సూత్తానికి బంగారం సిలకలావుంది - పెళ్ళికూడా అయిందట్టుంది. మరి తిన్నగా కాపరం సేస్కోక, మరాతల్లికి ఏం పాడుబుద్దో ఈయనగోరితో వచ్చేసింది - ఆళ్ళిద్దరూ ఆ గదిలో దూరారో లేదో - ఇంకొకాయన వచ్చిండు. మనిసి మాంఛి దిట్టమైనోడులే. తుపాకి తీసుకుని మరీ వొచ్చిండు. మిల్ట్రీ దొరంట - వచ్చేసి పెదబాబుగోర్ని కాల్చేత్తానని నానాహంగామా సేశాడు. ఆళ్ళిద్దరూ కుక్కల్లాగా కొట్లాడుకున్నారు. మళ్లా ఆ మాతల్లి ఏదీ యెరగనిదానికిమల్లే, ఏదీ జరగనట్టే మిలట్రీదొరగారమ్మకే కార్లో ఉడాయించింది. పెదబాబుగోర్ని నితకతన్నాడులే. అయినా ఆ ఎదవపన్లుమానలేదు బాబుగోరు. ఆళ్ళిద్దరూ అప్పుడప్పుడూ వొస్తూనే వుంటారు యిక్కడికి'—

మల్లన్నను కరచుకుని అతని డొక్కల్లో మునగదీసుకుని పడుకున్న తులసి "ఇక సాల్లే ఆపుమావా. పాడుమాటలు. వింటుంటేనే వళ్లు సిటపటలాడిపోతుంది" అంది.

మల్లన్న నవ్వుతూ "మరి నే సెబితే విన్నా? ఓయబ్బ ఆ మంచమెక్కి కులకాలని కూసున్నావు. ఆ మంచమ్మీన అన్నన్ని గోరాలు జరిగాయి. దాన్ని సూత్తేనే నాకు వళ్ళుమంట!" అన్నాడు.

అంతే, మళ్ళీ జన్మలో తులసి ఆ సిల్కుతెరల పాన్పుమాట ఎత్తలేదు. ఆ గదిలోకి వెళ్ళటానికే అసహ్యించుకుంటుంది. ఎప్పుడన్నా ఆ గది చిమ్మటానికి లోపలికెళ్ళితే, ఆ పాన్పునుచూచి కాండ్రించి ఉమ్మేసి, ఫెళపెళమని మెటికెలువిరిచి, దాన్ని అడ్డమయిన తిట్లు తిట్టికానీ మరీ బయటకురాదు. సిల్కుతెరల పాన్పుఅంటే తులసికి అంత రోత! తన కుక్కిమంచం ఇప్పుడామెకొక పూలతెప్ప; హంసతూలికా తల్పం! దాన్ని ఎంతో అపురూపంగా చూచుకుంటుంది. □□□

సెక్రటరీ

యద్దనపూడి సులోచనారాణి

"బామ్మోయ్! నాకు ఉద్యోగం దొరికింది." ఓరవాకిలిగా వేసివున్న తలుపుల్ని దభాల్నతెరుచుకుని లోపలికివస్తూ అంది జయంతి. "ఎక్కడ? ఆగాగు. అలా మీదపడితే నిలబడలేనే తల్లీ! హఠాత్తుగా సుడిగాలిలా ప్రవేశించి తనని చుట్టేసిన మనమరాలితో అలా నిలబడలేక గుమ్మందగ్గర కూలబడుతూ అన్నారు బామ్మగారు.

"సెక్రటరీ. మంచి వుద్యోగం." కళ్ళలో ఆనందం మెరుస్తుండగా గర్వంగా అంది జయంతి.

"సెక్రటరీ అంటే?" బామ్మగారికి పంతులమ్మ, గుమాస్తా, టైపిస్టు యిలాటి ఉద్యోగాలే తెలుసు.

"అంటేనా? అంటే తెలుగులో కార్యదర్శి అన్నమాట. ఆంధ్ర వనితా విహార్ అని యీ వూళ్లోకల్లా గొప్పసంస్థ. ఈ వూళ్ళోనేకాదు బామ్మా! మొత్తం ఆంధ్రప్రదేశ్ కంతటికీ గొప్ప. అక్కడందరూ ఆడవాళ్ళేలే వుండేది." చివరిమాట చిలిపిగా అంది జయంతి.

"ఆడ మగా భేదంపెట్టుకుంటే అసలు వుద్యోగాలకి వెళ్ళటమే అనవసరం. ఇంతకీ జీతం యెంత యిస్తారట?"

"నూటయాభై" జయంతి కళ్ళలో మరోసారి గర్వం తళుక్కుమంది. వెంటనే బామ్మగారి మెడచుట్టూ చేతులువేసి గుండెల్లో మొహందాచుకుంటూ "ఇహ మనకష్టాలు గట్టెక్కినట్టే. నువ్వు రోజూచేసే పూజలు వృధాపోలేదు. దేవుడు మన మొర ఆలకించాడు. రేపటినుంచి నేనుగూడా రెండుపూటలా శ్రద్ధగా నమస్కారం చేస్తాను."

"ఏం గట్టెక్కటంలే! ఆడపిల్ల రెక్కల మీద బ్రతకాల్సివచ్చిన ఖర్మానికి...."

బామ్మగారి మాటలు పూర్తికానీకుండానే చెయిజాపి నోరుమూసేసిన జయంతి చివ్వున తలెత్తి "నేను సంతోషంగా వుండటం నీకిష్టంలేదులే? అయితే పో! నే నీ పూట అసలు అన్నం తిననే తినను." అంది తెచ్చిపెట్టుకున్న కోపం మొహంలో ప్రదర్శిస్తూ బుంగమూతిపెట్టి.

"లేదులేవేమ్మా! ఊరికే అన్నాను. అసలు నీయిష్టం కాదన్నది యెప్పుడు లే? పొద్దునెప్పుడో యెంగిలిపడి వెళ్ళావు. చూడు మొహం అంతా యెలా వాడిపోయిందో! లేచి త్వరగా స్నానంచేసి వస్తే భోంచేద్దువుగాని." ఒకచేత్తో మనమరాలి బుగ్గలు నిమురుతూ రెండోచేత్తో కళ్ళు తుడుచుకుంటూ అన్నారావిడ. రోజూ పూజలు చేసి భగవంతుడిని ప్రార్థిస్తున్నమాట నిజమే. కాని అది జయంతికి ఉద్యోగం కావాలనికాదు. ఏదైనా మంచి సంబంధం కుదిరి పిల్ల అత్తవారింటికి వెళ్ళిపోయేలా చూడమని. సాధ్యమైనంతత్వరలో తన నీ లోకంనుంచి విముక్తురాలిని చెయ్యమనీను. కాని భగవంతుడు ఆవిడ ప్రార్థనలని ఆ రూపంలో వినలేదు.

"పని బాగా వుంటుందన్నారా?" మరోసారి తన గుండెలలో తల దాచుకున్న జయంతి జుట్టు సరిచేస్తూ అప్యాయంగా అడిగింది.

"ఆ! ఉండచ్చు బహుశా. ఉంటే మటుకేం? పనికితగ్గ జీతందొరకటంలా?"

"వనితా విహార్ అంటే?"

"అంటే ఆడవాళ్ళ సంఘం అన్నమాట. ఇక్కడ ఆడవాళ్ళకి తీరిక వేళల్లో కుట్లు, అల్లికలు, హిందీ నేర్పుతారు. దిక్కులేని వాళ్ళకి ఆశ్రయమిచ్చి వాళ్లచేత బుట్టలు అల్లించటం, బట్టలు కుట్టించటం, కాయగూరలు పండించటం, పూలతోటలు పెంచటం యిలాటి పనులు చేయించి, ఆ వచ్చిన డబ్బుతో వాళ్ళకి తిండి, బట్ట యిస్తారు. ఇది ఆంధ్రప్రదేశ్ మొత్తంమీద పెద్దది. ముఖ్య కేంద్రంకూడా. దీని శాఖలు దేశం అంతటావున్నాయి. ఒక మంత్రిగారి భార్య దీనికి ప్రెసిడెంట్. చాలా పెద్దపెద్దవాళ్ళు పలుకుబడివున్నవాళ్ళు దీనికి అండగా నిలబడి నడిపిస్తున్నారు. ముందు ఉద్యోగంవని, జీతంమాట అటుంచు. పెద్దపెద్దవాళ్ళందరితో పరిచయం అవుతుంది. అదృష్టంకదూ!"

గబగబా చెబుతున్న జయంతికి కళ్ళముందు బామ్మగారి గుండెల్లో మంత్రిగారి భార్యతో పరిచయం, దానితో స్నేహం, తర్వాత ఆవిడ భర్తకి జయంతిని చూపిస్తూ 'ఈ అమ్మాయి మా సెక్రటరీ అండీ' అనటం, తను సిగ్గుపడుతూ నమస్కారం చెయ్యడం అన్నీ కనిపిస్తున్నాయి. జయంతి బుగ్గలోకి వెచ్చటి ఆవిరివచ్చింది. తనుకూడా గొప్పవాళ్ళ సాంగత్యంతో గొప్పదైపోయి ఒక రోజుకి ఫలానా జయంతి అదుగో ఆ వెళ్ళే అమ్మాయే అనిపించుకోవచ్చు. అప్పుడెంత బాగుంటుంది!

"లే! లేచి త్వరగా స్నానం చేసిరా?" కుంపటిమీద వేగుతున్న కూర గుర్తుకు వచ్చిన బామ్మగారు జయంతిని తప్పించుకుని లేచి వెళ్ళారు.

ఆరాత్రి ఎలాగో వేడివేడి నీళ్ల స్నానం చేసి, సయించీ సయించనట్టు భోంచేసి

తెల్లటి వుతికిన బట్టలతో మంచంమీద వచ్చి పడుకున్న జయంతికి యెంతసేపటికీ నిద్ర రాలేదు. ఎంత బాగుందీ ప్రపంచం! సృష్టిలో కంటికి కన్పిస్తున్న ప్రతివస్తువు సజీవశక్తితో నూత్నానందంతో వెలిగి పోతున్నట్లుంది. ఆఖరికి మంచం ప్రక్కన కిటికీలోంచి లోపలికి వస్తున్న వెన్నెల కూడా అర్థంగాని ఏదో భాషలో పలకరించా లని ప్రయత్నం చేస్తోంది. ఎంత వద్దనుకుని నిశ్చలంగా వుండాలన్నా, జయంతి ఆలోచనలు మాటిమాటికీ "ఆంధ్రవనితా విహార్" అని పెద్దపెద్ద అక్షరాలతోవున్న గేటుని కళ్ళముందుకు తెస్తున్నాయి. ఆ గేటుదాటి లోపలికి వెడితే ముందు విశాలంగావున్న ఆవరణలో చక్కగా పద్ధతి ప్రకారం పెంచిన పచ్చగడ్డి. నడిచేవాళ్ళకాళ్ళకి మట్టి కాకుండా పట్టుతివాసీమీద నడుస్తున్నామా అని భ్రమకలిగించే మెత్తటి పచ్చగడ్డి. దాని కిరుప్రక్కలా రకరకాల పూల మొక్కలు వచ్చేవాళ్ళకి స్వాగతం యిస్తున్నామన్నట్టు గాలికి తలూపుతూవుంటాయి అవి. అవిదాటి ఆ పచ్చగడ్డిమీద బాగా ముందుకు వెడితే నున్నటి పాలరాతితో ధగధగా మెరిసే వరండా. వరండాలో ఆ చివరా, యీ చివరా చక్కటి శిల్పంతో చెక్కిన పెద్దపెద్ద స్తంభాలు. వాటిమధ్యగా వున్న గుమ్మంలోనుంచి లోపలికి వెడితే లోపల పెద్దహాలు. హాలునిండా వరసల ప్రకారం అమర్చిన నీలంరంగు వెల్వెట్ కుర్చీలు. కుర్చీలకి అటువైపుగా పెద్దస్టేజీ. ఆ స్టేజీని తనలోపల దాచేసుకుంటున్న పెద్ద పసుప్పచ్చటి వెల్వెట్ కర్టెన్. దాని మీద స్టేజీ ఆ చివరినుంచి యీ చివరికి వచ్చేటట్టు మధ్యలో రక్తవర్ణంలో "ఆంధ్ర వనితా విహార్" అని కన్పిస్తున్న అక్షరాలు. ఆ అక్షరాలు చూసేవాళ్ళ చూపుల్ని క్షణం సేపు తమవైపే ఆకట్టుకునేంత అందంగా వున్నాయి.

వరండాలోంచి వచ్చే గుమ్మాని కిరు ప్రక్కలాపైకివెళ్ళటానికి మెట్లున్నాయి. ఆ మెట్లమీద బంగారపు టంచున్న ఆకుపచ్చ తివాసీ పరచివుంది. ఆ మెట్లెక్కి పైకివెడితే చిన్న వరండా. దాన్ని ఆనుకుని కొన్ని గదులు. ఆ గదులకి వరసగా సెక్రటరీ. ప్రెసిడెంట్. మీటింగ్ హాలు. లైబ్రరీ అన్న బోర్డులున్నాయి. మీటింగ్ హాలు కొద్దిగా పెద్దదే అని చెప్పచ్చు. అందులో ఓ ఇరవైమంది కూర్చునేందుకు కుర్చీలు. టేబిల్. చిన్న అల్మైరా. గదికి మధ్యగా సీలింగ్ ఫ్యాన్ వున్నాయి. వనితావిహార్ దాదాపు ప్రతినెలా యేదో ఒక ప్రత్యేక కార్యక్రమం జరుపుతూనే వుంటుంది. దానికి నిర్ణయించుకోవలసిన కార్యక్రమాన్ని రూపొందించడానికి, సలహాలు తీసుకోవడానికీ, చర్చలు జరపడానికి కమిటీ సమావేశం అవుతూవుంటుంది. సెక్రటరీ గది కొంచెం చిన్నదిగా వుంది. అందులో చిన్న టేబిల్. ఫైల్సుపెట్టే రాక్. టైప్ మిషన్. యెవరన్నావస్తే కూర్చునేందుకు రెండు కుర్చీలు. టేబిల్ ప్రక్కన ఫ్యాన్. గదిలో మూలగా చిన్న టేబిల్‌మీద ఫోన్‌వుంది.

ఆ చిన్నగది గుర్తొస్తేనే జయంతికి స్వర్గంలో అడుగుపెట్టినట్టుగా అన్పిస్తోంది. వైస్‌ప్రెసిడెంట్ సుమిత్రాదేవి జయంతికి మొట్టమొదటిసారిగా ఆ గది చూపిస్తూ "ఇదుగో యిదే నీ గది. ఉదయం 10 గంటల



నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వుండాలి. ఆ లోపలవచ్చే ఫోన్ కాల్స్‌కి జవాబివ్వాలి. ముఖ్యమైన విషయాలుంటే నోట్ చేసుకుని అవసరమయితే నాకు ఇంటికి ఫోన్ చెయ్యాలి. ఏదయినా పనిబడితే మెంబర్స్ యింటికివెళ్ళి వివరాలు అందజెయ్యాలి. టైప్ వచ్చున్నావుగా?" అంది ఆవిడ టైపురైటర్‌వైపు చూస్తూ.

"వచ్చు. కాని ప్రాక్టీసులేదు." సిగ్గుపడుతూ జవాబు చెప్పింది జయంతి.

"ఓస్. ప్రాక్టీసులేకపోయినా ఫర్వాలేదు. మాకు కావాల్సింది పనిగాని సర్టిఫికెట్లుగావు. రేపు వచ్చి జాయినవ్వు." బైటకుదారితీస్తూ అంది సుమిత్రాదేవి.

జయంతి ఒకడుగు వెనక నిలిచిపోయి యింకోసారి గదివైపు పరీక్షగాచూసి గుండెలనిండా గాలి పీల్చుకుంది. ఎంత బాగుంది గది. రేపటినుంచి తను చేయబోయే ఉద్యోగాన్ని గురించి పదేపదే తలుచుకుంటూ ఆరాత్రి కలత నిద్రపోయింది జయంతి.

జయంతి అంతా తన అదృష్టంగా మురిసిపోతున్న ఆ వనితా విహార్‌కి మంత్రిగారి భార్య ప్రెసిడెంట్ అన్నది నామమాత్రమే. అన్ని విషయాలు వైస్‌ప్రెసిడెంట్ సుమిత్రాదేవి చూస్తుంది. క్యాషియర్ కమలానంద్ అని ఒకావిడ వుంది. ఆవిడ ఊళ్ళో పెద్ద పేరున్న డాక్టర్. తన ప్రాక్టీసుతోనే ఆవిడకి క్షణం తీరుబడి వుండదు. ఒకవేళ ఒకటీ. అరా వున్నా మిగతా పనులు బోలెడన్ని. ఇలాగే అందులో మెంబరుగా వున్న ప్రతి వాళ్ళకీ మిగతా బాధ్యతలు బోలెడన్ని. అందుకే కేవలం వనితా విహార్ లోకంగా పెట్టుకుని వుత్సాహంగా. సమర్థతతో నాలుగూ చక్కపెట్టుకు పోగల వ్యక్తి సెక్రటరీగా కావాలి. అందుకే అది మామూలు వ్యక్తికి వదిలేసే వుద్దేశంతో పేపర్లో ప్రకటించారు. వనితా విహార్ సంగతి, అందులో పనిచేసే వ్యక్తుల వ్యక్తిత్వాలు, ఆ ఉద్యోగంలోని సాధక బాధకాలు తెలిసిన యెవ్వరూ దానికోసం ప్రయత్నం చెయ్యలేదు అలా తెలియక చేసినకొద్దిమందిలో అర్హతలని బట్టిచూస్తే పదిమంది తేలారు. ఆ పదిమందిలో ఒక్క జయంతే ఇంటర్వ్యూలో నెగ్గింది. మనిషిని చూస్తూనే ఓవిధమైన వ్యక్తిత్వాన్ని సూచించే వేషభాషలు, ఆడంబరంలేని సంభాషణ, అడుగుపెడుతూనే అందరి చూపులూ తనవైపు ఆకట్టుకోగల ఓవిధమైన అమాయకత్వంతో గూడిన అందం, ప్రవర్తనలో నిదానం, అన్నిటికంటె ఆ అమ్మాయి యీ ఉద్యోగం పట్ల చూపుతున్న విపరీతమైన శ్రద్ధాసక్తులు వనితావిహార్ కమిటీ ఏకగ్రీవంగా జయంతిని సెక్రటరీగా అంగీకరించేలా చేశాయి.

స్వంత బొమ్మ తప్ప మరో వ్యక్తిని దగ్గరగా యెరుగని జయంతి, పుస్తకాల్లో కన్పించే ప్రపంచమే యీ ప్రపంచంకూడా అనుకునే జయంతి, అందరూ తనలాటివాళ్ళే అనే భ్రమతో తనకు దొరికిన ఈఉద్యోగం గురించి అది లభించటం కేవలం ఆకాశంలోనిజాబిలి అరచేతిలో చిక్కిందన్నట్టు వూహించటంలో ఆశ్చర్యంలేదు.

● ● ●

రోజూ బాగా బారెడు పొద్దు పైకివస్తేనే గాని. కప్పుకున్న దుప్పటి కదల్చటాని కిష్టపడని జయంతి మర్నాడు తెలతెలవారుతుండగానే లేచింది. 9 గంటలకల్లా భోంచేసి

వున్న బట్టల్లో తన కిష్టమైనవి వేసుకుని కొట్టుకునే గుండెలతో స్వప్నలోకంలో నడుస్తున్నదానిలా వనితావిహార్‌కి వచ్చింది. జయంతి వచ్చేటప్పటికి యెవరూ లేరు. కాపలావుండే రంగయ్యమటుకు వచ్చి తాళాలుతీసి జయంతిని తీసుకెళ్ళి లోపల కూర్చోపెట్టాడు. దాదాపు గంట పోయిం తర్వాత సుమిత్రాదేవి వచ్చింది. ఆవిడ ఒంటరిగా రాలేదు. వెంట నలుగురున్నారు. వస్తూనే పైన వరండాలో స్తంభందగ్గిర నిలబడ్డ జయంతిని వచ్చావా అన్నట్టుచూసి చిరునవ్వునవ్వి తలూపి వచ్చినవాళ్ళతో లోపలికి వెళ్ళిపోయింది. తనుగూడా వాళ్లతో వెనకాలే వెళ్లాలి అనిపించినా మళ్ళీ పిలవలేదుగదా అనే సంకోచంతో ఆగిపోయింది.

లోపల కమిటీహాల్లో కూర్చుని వాళ్ళేదో చాలాసేపు మాట్లాడుకున్నారు. బిగ్గరగా నవ్వుకున్నారు. కొంచెంసేపు కంఠం తగ్గించి గుసగుసలాడినట్టు మాట్లాడుకున్నారు. బైటవంటరిగా వాళ్ళకిచెందనిదానిలా స్తంభాని కంటుకుపోయి కాళ్ళు పీక్కుపోతూ అలా నిలబడటం జయంతికి చాలా విసుగనిపించింది. కాని, మొదటిరోజు విసుగుగాని, బాధగాని, నిరాశగాని చెందకూడదని మనసు నిబ్బరంచేసుకుంది.

గంట గంటన్నర అయిపోయింతర్వాత వచ్చినవాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళతో పాటు యివతలకి వచ్చిన సుమిత్రాదేవి వాళ్ళని పంపేసి జయంతి దగ్గరకువస్తూ నవ్వుతూ "లోపల వచ్చి కూర్చోపోయావా? పోన్లే, రా!" అని జయంతిని తీసుకెళ్ళి చెయ్యవలసిన పనులన్నీ మరోసారిపురమాయించింది. ఆవిడ యివాళ చెప్పినదాంట్లో ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటలకువరకూకాకుండా అవసరం అయితే ముందు రావాలి. ఆలస్యంగా వుండాలి. నెల నెలా జరిగే ప్రోగ్రామ్స్ నిర్ణయించి కమిటీ కాపీ ఒకటి సెక్రటరీకి పంపుతుంది. దానితో పాటు చెయ్యవలసిన పనులు ఆదేశిస్తూ మరో కాగితంకూడా వస్తుంది. ఏవైనాపనులు పడితే సభ్యుల యింటికి వెళ్ళి పనిచేసుకు రావాలి. ఇవన్నీ వరసగా ఆవిడ యే కరువు పెడుతుంటే జయంతికి సంతోషమే అనిపించిందిగాని, 'అమ్మో! యిన్నిపనులా' అన్పించలేదు.

ఆ రోజు పనిలో ప్రవేశిస్తున్నట్టు గుర్తుగా ఆ నెలాఖరులో జరగబోయే వార్ ఫండ్‌కి డబ్బు పంపటంకోసం ఏం ప్రోగ్రాం యేర్పాటు చెయ్యాలా అన్న నిర్ణయంకోసం



"శిల్పిగారూ! చౌకులోవున్న శివాజీబొమ్మ అద్భుతంగా చేశారండీ. కాని పోజుమాత్రం అదోలా వుందేమిటండీ?"

"ఏం చెయ్యను చెప్పండి. ముందు గుర్రంమీద శివాజీని చెయ్యమన్నారు. సగ మయ్యాక గుర్రానికి డబ్బుల్లేవు. శివాజీతో సరిపెట్టమన్నారు."

కమిటీ సమావేశమౌతుంది. సుమిత్రాదేవి సభ్యులపేర్లు, టెలిఫోన్ నంబర్లు-యింటి అడ్రస్‌లు వున్న జాబితా యిచ్చి చూస్తూండ మని వెళ్ళిపోయింది.

చూస్తుండగానే మధ్యాహ్నం అయింది. ఒక్కొక్కరే రావటం ప్రారంభించారు. అందరూ రకరకాలుగా వున్నారు. ఒకరికీ ఒకరికీ పొంతనేలేదు. భిన్న భిన్న ప్రకృతులు. భిన్న భిన్న వ్యక్తిత్వాలు. మీటింగ్ మొదలయ్యేముందు సుమిత్రాదేవి జయంతిని అందరికీ పిలిచి పరిచయంచేసింది. అందరి పేర్లు ఆసక్తిగావింటూ అత్యంత శ్రద్ధతో నమస్కారంచేసింది జయంతి. కాని వచ్చిన వాళ్ళెవరూ జయంతిని పట్టించుకున్నట్టే లేదు. సుమిత్రాదేవి చెబుతున్నది సాంతం వినకుండానే జయంతినిచూసీ చూడనట్టు గానే "ఓహో! యీ అమ్మాయేగదూ! అనో "అహ అలాగా!" అనో, "సంతోషం" అనో అని నిర్లిప్తంగా అనేసి వాళ్ళవాళ్ళ గొడవల్లో పడిపోయారు. నిరాశచెందకూడదని మొదటే నిర్ణయించుకున్న జయంతి ఒకరోజున వీళ్ళే శ్రద్ధాసక్తులతో తనవైపు చూసేలా చేసుకోవాలని మనసులో శపథం చేసుకుంది.

పరిచయం చెయ్యడం అయిపోయిన తర్వాత సుమిత్రాదేవికుర్చీలో కూర్చుంటూ "రాజశేఖరాన్ని కూడా రమ్మనమని ఫోన్ చేశాను. ఎందుకు రాలేదో-" అంది.

"వస్తానని చెప్పాడా? చెబితే తప్పకుండా వస్తాడు." నడినెత్తిన ముడివేసుకుని మిసెస్ రేఖారాణి అని పరిచయం చేయబడిన ఒకావిడ అంది. ఆవిడ వయసు చూస్తే 30 సంవత్సరాలుపైబడ్డట్టుంది. అలంకరణమటుకు 20 సంవత్సరాల లోపలవాళ్ల చేసుకునేలావుంది.

"ఏదో మీటింగ్ వుందట. వీలయితే వస్తానన్నాడు. లేకపోతే మన నిర్ణయంకాపీ పంపమన్నాడు."

"ఇంకేంమరి" అంది రేఖారాణి.

ఆడవాళ్ళకి సంబంధించిన యీ వనితా విహార్‌తో ఆ రాజశేఖరానికి ఏంసంబంధమో జయంతికి అర్థం గాలేదు. మెంబర్స్ లిస్టులో అతనిపేరు లేదు.

"ఈ సంవత్సరం అతనికి టెక్స్టయిల్ మిల్స్‌లో ఆరు లక్షలు లాభంవచ్చిందిట?" యెవరో రేఖారాణిని అడిగారు.

"ఆరుగాదు పదహారు" కరెక్టుచేసింది రేఖారాణి.

"ఏంవస్తే యేం లాభం? వూరివాళ్ళ పడితినటమేగా! ఓ యిల్లా, సంసారమా?" కళ్ళజోడుపెట్టుకుని పొట్టిముక్కున్న మిసెస్ వర్మ యీసడింపుగా అంది.

"సంసారం లేకపోవచ్చు. బ్రహ్మాండమైన యిల్లుంది." కనుబొమలు ముడిచి అందులో తన కోపాన్ని దాచేసుకుంటూ అంది రేఖారాణి.


''సెక్రటరీ''కథలో పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితం. ఇందులో వచ్చే సంఘటనలు గాని, వ్యక్తిత్వాలుగాని యెవరికైనా దగ్గరగా అనిపిస్తే అందుకు నేను బాధ్యురాలిని గాను.

—రచయిత్రి.

"నా మొహం. ఆయిల్లు వుండీ లేనట్టే. పెళ్ళాం బిడ్డలు లేని యిల్లు కంటే వల్లకాడు నయం." నిర్లక్ష్యం అంతా పెదవి విరుపులో చూపిస్తూ అంది మిసెస్ వర్మ.

ఈసారి రేఖారాణితోపాటు మిగతావాళ్ళ మొహాలుకూడా యెర్రబడ్డాయి. గౌరవ మర్యాదలు, అందరిలో బోలెడంత పలుకుబడి, సంఘంలో పరువుప్రతిష్ఠలు పుష్కలంగావున్న వ్యక్తినిగురించి మిసెస్ వర్మ అలా తీసేస్తూ యీసడింపుగా మాట్లాడటం యెవరికీ నచ్చలేదు. రాజశేఖరం వ్యక్తిగతంగా యెలాటివాడయినా, అందరిలోకీ ధనవంతుడైన ఆతనితో ప్రతివాళ్ళకి పని ఉంటుంది. అన్నింటికంటె ముఖ్యంగా అతను యీ వనితా విహార్‌కి కన్పించకుండా బోలెడంత సాయం చేస్తున్నాడు. అతను వెన్నెముకలా అండగా నిలబడబట్టే వనితా విహార్ మంచిపేరు తెచ్చుకుని దేశం అంతా వ్యాపిస్తోంది.

అసహ్యం, రోషం దాగినస్వరంతో రేఖారాణి విసురుగా యేదో జవాబు చెప్పబోతుండగా విషయం ప్రక్క దోవలో పడుతోందని రెప్పపాటులో గ్రహించిన సుమిత్రాదేవి టేబిల్‌మీద ముందుకు వంగి గబగబా మాట్లాడేస్తూ "ఆ! ఆ! అసలు విషయానికి వద్దాం. ఇంతకీ ఏం చేద్దాం- నాటకం వేయిస్తే బాగుంటుంది కాని మంచి నాటకాలు వేసే వాళ్ళెవరున్నారు? పోనీ సుధామూర్తి సజెస్ట్‌చేసినట్టు సినిమాస్టార్ డాన్స్ పెట్టిస్తే?" అంది. నెమ్మదిగా తర్వాత అందరూ ఆ విషయాన్ని గురించి తర్కవితర్కాల్లో పడిపోయారు.



ఇద్దరు ఋషులు హిమాలయాల్లో పక్కపక్క గుహల్లో తపస్సు చేసుకుంటుండేవారు. ఒకరిఉనికి ఒకరికి తెలిసినా ఎప్పుడూ కలుసుకోలేదు. ఇరవైఏళ్ళ తరవాత పెద్దాయన చిన్నాయనగుహకెళ్ళి కాసేపు లోకాభిరామాయణం మాట్లాడివెళ్ళిపోయాడు. అయిదేళ్ళ తరవాత మళ్ళీ ఆయనే చిన్నాయన గుహకివచ్చి పలకరించాడు.

"రండిరండి అన్నగారూ! ఏదేనా మర్చిపోయారా?" అన్నాడు చిన్నాయన.

సుమిత్రాదేవికి కుడిప్రక్కనున్న కుర్చీలో కూర్చున్న జయంతికి యిదంతా తమాషాగా అన్పించింది. ఆ రేఖారాణీ అన్నావిడకి యీ మిసెస్ వర్మకి, కారణం యేమిటో తెలియదుగాని, బొత్తిగా పడదనీ తెలుస్తోంది. మిసెస్ వర్మమాటలతో కత్తులు నూరుతుంటే రేఖారాణి చూపులతో బాణాలు విసురుతోంది. మళ్ళీ యిద్దరిలో బోలెడంత చదువు - సంస్కారం వున్నట్టు కన్పిస్తోంది. కలిగిన కుటుంబాల్లో పుట్టి చిన్నప్పటినుంచి పదిమందితో కలిసి తిరగటం

నేర్పిన వీళ్ళకి తగాదా యేమిటి? ఎవరి భావాలు వాళ్ళు దాచుకోలేని యీ బలహీనత లేమిటి? లేకపోతే యెందుకు దాచుకోవాలి అనే అహంకారమా! ఏదయినా కావచ్చు.

సుమిత్రాదేవి సూచనప్రకారం ప్రదర్శనకయ్యే ఖర్చులు పోను, వార్ ఫండ్‌కి పంపవలసిన మొత్తం తీసెయ్యగా కొంత వనితా విహార్‌కి మిగిలి తీరాలి. దాన్ని అందరూ అంగీకరించారు. తర్వాత టికెట్లు నిర్ణయించటంలో మళ్ళీ వాదోపవాదాలుజరిగినాయి. చివరికి అదికూడా తేలిపోయింది.

మీటింగ్ అయిపోతుండగా సుమిత్రాదేవి ఆదేశించినప్రకారం క్రిందకెళ్ళి రంగయ్య చేత టీ తెప్పించి అందరికీ తనే స్వయంగా అందిచ్చింది జయంతి. పనైపోవటంవల్ల ఒక్కొక్కరే సుమిత్రాదేవికి చెప్పి వెళ్ళిపోతున్నారు. ఎంతో అప్యాయంగా వాళ్ళ యోగక్షేమాలు అడుగుతూ మధ్యమధ్య తనింట్లో యివ్వాళ్ళ విందులు వేళ్ళటోసుకుంటు మాట్లాడి పంపిస్తోంది సుమిత్రాదేవి.

మొదట రేఖారాణి వెళ్ళిపోయింది. కొద్దిసేపయింతర్వాత సుమిత్రాదేవితో ఆ కబురు ఈ కబురు చెప్పి మిసెస్ వర్మ వెళ్ళింది. అందరిదగ్గర సెలవుతీసుకున్న సుమిత్రాదేవి దూరంగా నిలబడిన జయంతిని దగ్గరకిపిలిచి టేబిల్‌మీద పెట్టిన కాగితాలుతీసి అందిస్తూ "ఇదుగో యిది టైప్‌చేసి తలా ఒక కాపీ-" అంటుండగానే యింతలో బైటనుంచి "నోర్ముయ్" అన్న రేఖారాణి స్వరం విన్పించింది. దానివెంటనే "షటప్" అన్న మిసెస్ వర్మ గొంతుకూడా విన్పించింది. జయంతితోపాటు సుమిత్రాదేవికూడా ఉలిక్కిపడింది. క్షణంసేపు ఆవిడ కళ్ళు, కనుబొమలు కుంచించుకున్నాయి.

వెంటనే చేతిలో వున్న కాగితాలు జయంతిమీద పడేసి, "కర్మ! దీనికి వైస్ ప్రెసిడెంట్‌గా వుండే కంఠే గాడిదలు కాయటం సులభం-" అని సణుక్కుంటూ స్థూలకాయాన్ని వూపుకుంటూ గబగబా ముందుకు వెళ్ళింది. తనమీదపడి క్రింద బడబోయిన కాగితాలని భద్రంగా పట్టుకుని జయంతికూడా ఆవిడ వెనకాలే వెళ్ళింది.

"చూడండి, కాలుతొక్కి పైగా యెలా పేలుతోందో?" రేఖారాణి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"చూడలేదని చెప్పలేదూ?" మండిపడుతూ అంది మిసెస్ వర్మ.

"కళ్ళు కన్పించటంలా? అంత నెత్తిన పెట్టుకుని యెందుకు నడవాలి?"

విసురంతా కళ్ళలోనే గాక కంఠంలో కూడా చూపిస్తూ అంది రేఖారాణి.

"వినండి ఆవిడ మాటలు" అంటూ సుమిత్రాదేవివైపు తిరిగి "నేను చూడక తొక్కిన మాటనిజం. ఆవిడ ఒక్కనిమిషం ఆగితే నిజంగా క్షమాపణ చెప్పేదాన్ని. కాని యిప్పుడనవసరం. నే వెడుతున్నాను." మిసెస్ వర్మ క్షణంలో టకటక మెట్లు దిగి వెళ్ళిపోయింది.

"చూశారా ఆ పొగరు." మిసెస్‌వర్మ వెళ్ళినవైపే చూస్తూ పళ్ళుకొరుకుతూ అంది రేఖారాణి.

"చూస్తూనేవున్నా. ఈ విడ పద్ధతి బొత్తిగా బాగాలేదు." కళ్ళజోడు సరిచేసుకుంటూ అంది సుమిత్రాదేవి.

"తెలిసికూడా అన్నీ చూస్తూ మీ రెందుకూరుకుంటున్నారో నాకు అర్థం కావటంలేదు. ఆవిడని మెంబర్‌గా యెందుకు తీసెయ్యరు?"

"ఎలా! మంత్రిగారికి దగ్గిరచుట్టమే!" నిస్సహాయంగా చూస్తూ అంది.

"అయితే? ఇందాకమటుకు యిందాక చూశారా!"

"అవును. అవును. అతన్నిగురించి అలా మాట్లాడాలంటే యెంత ధైర్యం కావాలి?"

"ధైర్య మెందుకు? మిడిసిపాటుంటే చాలు. ఊరివాళ్ళంతాపడి అతని సంపద తింటున్నారుట-అది యీవిడ కెందుకో? అతనిష్టం. మీకు ఆవిడని మెంబరుగా తీసెయ్యటం చాతకాకపోతే చెప్పండి. రాజశేఖరానికి చెప్తే సరి. ఇలాటివాళ్ళని అతను క్షణంలో వంచగలడు."

కళ్ళజోడు తీసుకుని చీరకొంగుతో తుడుచుకుంటున్న సుమిత్రాదేవి ఖంగారుగా "వద్దు రేఖారాణీ! ఇప్పుడలాటివి యేవీ వద్దు. చాలా గొడవౌతుంది. సమయంరానీ. చెప్దాం. దానికే నేనూ చూస్తున్నాను. ఎప్పుడూ నెవం మనమీద వుండకోగూడదు." అంది.

"సరే, మీ యిష్టం. నే వస్తాను." రేఖారాణి వెళ్ళిపోతుంది.

"వెధవగోల. ఇద్దరూ యిద్దరే. కొరివిదయ్యాలు" సుమిత్రాదేవి మొహంలో ప్రసన్నత రేఖారాణితోపాటే వెళ్ళిపోగా మళ్ళీ కనుబొమలు ముడుచుకుని తిట్టుకొంటూ వెనక్కితిరిగింది. తిరుగుతూనే తన వెనకే బొమ్మలా నిలబడ్డ జయంతినిచూసి క్షణంసేపు తెల్లబోయి ఆ వెంటనే కోపంతెచ్చుకుంటూ "నువ్విక్కడే వున్నావా? నీకు చెప్పినపని వదిలేసి వింతచూస్తున్నావా? వెళ్ళు-వెళ్ళు-టైప్‌చెయ్యి" అంది.

జయంతి కాగితాలు తీసుకుని తనగదిలోకి వెళ్ళిపోయింది. అది టైప్‌చేస్తుండగా సుమిత్రాదేవి వచ్చి "నేను వెడ్తున్నాను. టైప్ చేసివుంచితే నేను రేపువచ్చి సంతకాలు చేస్తాను. పనికాగానే నువ్వెళ్ళిపో." అంటూ పురమాయించి వెళ్ళబోతూ హఠాత్తుగా ఆగి వెనక్కితిరిగి జయంతి దగ్గిరగావచ్చి "ఇదుగో! అమ్మాయి. పెద్దదానిని చెబుతున్నాను. నువ్విక్కడ నాలుగురోజులుండా

● రంగస్థలంమీద నటిస్తున్న ఒక నటుడు - "పాతాళంబున -" అని పద్యంయెత్తుకుని, చేతితో యాక్షన్ చేస్తూ, ఆ చేతిని ఆకాశంవంక చూపించాడు. ప్రేక్షకులు గొల్లుమన్నారు. ఐతే, అతడు చేసిన యాక్షన్ రైటేనని శ్రీ శ్రీ సమర్థించారు. ఏమిటంటే - ఆంధ్రనాటకరంగం అధోగతిలో వుంది కాబట్టి, ఆ రంగంమీద వున్న నటుడు "పాతాళంబున -" అని చెయ్యి పైకెత్తి యాక్షన్ చెయ్యటంలో పొరపాటేమీ పడలేదని!

— సుకుమార్

అనుకుంటే యీ గొడవలేం. పట్టించుకోకు. నీ పనేదో నువ్వు చూచుకుని నీ దారిని నువ్వెళ్లు. ఇలా జరిగిందని, అదని యిదనీ యెవరితో అనగూడదు. ఇక్కడిమాట యీ నాలుగ్గోడలు దాటి బైటికి పోగూడదు. తెలిసిందా! గుర్తుంచుకో" అని వెళ్ళిపోయింది.

టైప్‌రైటర్‌కి కాగితాలు బిగిస్తున్న జయంతి తెల్లబోయి అలాగే కూర్చుండిపోయింది. బాగుంది. తనేదో తప్పుచేస్తున్నట్టు యీ వార్నింగేమిటి? భయం అనుకుంది. అసలు రాజశేఖరం అన్న వ్యక్తి యెవరు? రేఖారాణి కేమౌతాడు! అతనంటే మిసెస్ వర్మ కెందు కింత యీసడింపు? అసలు వీళ్ళిద్దరికీ యెందుకుపడదు! ఎంత వద్దనుకున్నా ఆ సంఘటనని జయంతి మనసులోంచి తుడిచివేయలేకపోయింది. వనితావిహార్ సెక్రటరీగా జయంతి జీవితంలో మొదటిరోజు అలా గడిచిపోయింది.

● ● ●

జయంతిలో చలాకీతనం, వ్యక్తిత్వం నిరూపించుకోటానికా అన్నట్టు వార్ ఫండ్‌కి నిధి పోగుచెయ్యటంకూడా ఆ నెలలోనే వచ్చింది. తిండి తిప్పలమాట మర్చిపోయి, ఎండ, వానని లక్ష్యపెట్టకుండా కమిటీ ఆదేశించిన ప్రకారం సుమిత్రాదేవి సలహాలు తు. చ. తప్పకుండా జయంతి యిల్లిల్లు తిరిగి టిక్కెట్లు అమ్మింది.

కొత్త సెక్రటరీ పుణ్యమా అని ఈమధ్య యెప్పుడూ అమ్ముడుపోనన్ని టిక్కెట్లు అమ్ముడుపోయినాయి. అనుకున్నదానికి రెట్టింపుకంటె పైనే వసూలైంది. ఆ వసూలైన మొత్తాన్ని చాటంత మొహంచేసుకుని తెచ్చిపెట్టుకుంటూ "భేష్! సెబాష్!" నాకు నచ్చావు. నీలాటివాళ్ళు నలుగురు నా చేతి క్రిందవుంటే చాలు. వనితావిహార్ని ప్రపంచమంతా విస్తరింపచెయ్యగలను." అంది సుమిత్రాదేవి.

ఆ కాస్త మాటకే జయంతి లేత హృదయం పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. ఉదయంనుంచి భోజనం లేకపోయినా, సుమిత్రాదేవి గుక్కెడు కాఫీ నీళ్ళయినా పోయకపోయినా, కొన్నిరోజుల నుంచి యిల్లువాకిలి పట్టకుండా కాకిలా తిరుగుతున్నావని బామ్మ కోప్పడుతున్నా జయంతికివేం పట్టలేదు. మనసంతా సంతోషంతో వుక్కిరిబిక్కిరిగా వుంది. ప్రపంచంలో వున్న ప్రతి వస్తువు, చివరికి చెట్టూ, చేమ, యిల్లు, రోడ్లూ, బస్సులు అన్నీ తన విజయాన్ని చూసి అభినందిస్తున్నట్టే కన్పించింది. ఈరోజే యేముంది? అసలు నాట్యప్రదర్శనరోజు. ఆరోజుగాని జయంతి కష్టానికి ప్రతిఫలం దొరకదు. ఆరోజుగాని అందరికీ జయంతి ఫలానా అని తెలియదు. అంతవరకూ యిలా మామూలుగా వుండిపోవాల్సిందే! అప్పుడుగాని తన వ్యక్తిత్వం యెవరికీ తెలియదు. జయంతి మనసులో నుంచి నిట్టూర్పు వచ్చింది. హు! అవకాశాలంటూ కలగాలి గాని తనలాటివాళ్ళు పర్వతాలు యెత్తెయ్యలేరూ?

ఎంతో ఆనందంతో, కోటి కాంతులు వెలిగిపోతున్న కళ్ళతో, పీక్కుపోయిన మొహంతో నడుస్తున్నట్టు గాకుండా అలల మీద అతి తేలికగా కదిలిపోతున్నట్టు యింటికి వచ్చిన జయంతి తలుపుతట్టటంతోనే లోపల్నుంచి వచ్చిన బామ్మగారు

జయంతిని చూస్తూనే ధుమధుమలాడుతున్న మొహంతో, "ఏం ఉద్యోగమే నాతల్లీ! పొద్దున ప్రక్కమీదనుంచి లేచిపోయిన దానివి యిప్పుడా రావటం? ఓ తిండిలేదు - తిప్పలులేదు. భోజనం బొగ్గులు అక్కర్లేకుండా నువ్వెలిగిస్తున్న ఆ రాచకార్యమేమిటో కొంచెం చెప్పు వింటాను" అంది గుమ్మాని కడ్డంగానిలబడి.

"ముందు లోపలికి రానిస్తావా లేదా?" పాటపాడుతున్నట్టుగా అంది జయంతి.

బామ్మ దారియిచ్చింది.

"పొద్దుననుంచి చూసిచూసి నా ప్రాణం విసిగింది. అసలు-"

"బామ్మా! ప్లీజ్" జయంతి మధ్యలోనే ఆపేసి బామ్మగారి రెండుభుజాలమీద చేతులు వేసి కళ్ళలోకి చూస్తూ "మై డియర్ బామ్మగారూ! ఈ రోజు మనం చాలా సంతోషంగావున్నాం. దయుంచి నువ్వే మీ అనద్దు-" అంది.

"పైగా యిదొకటి. మాట్లాడ్తే నోటికి తాళంవేస్తావు. ఆ యెదురింటి వనజచూడు-"

"ఛో బామ్మా! మందని మళ్ళేనే వుద్యోగంచేసే పంతులమ్మకి నీ మనమరాలికి పోలికా?" అని వెంటనే చేతులుతీసేసి "ఆకలేస్తోంది. రెండు నిమిషాల్లో స్నానం చేసి వస్తాను. పెట్టు" అంది.

ఎప్పుడూలేంది లలలూ.లలలూ. లాలలూ అంటూ కూనిరాగం తీస్తూ పాటలు పాడుతూ నీళ్ళు పోసుకుంటున్న మనమరాలి వైపు బామ్మగారు వింతగా చూసింది. జయంతి కూనిరాగం తీస్తూనే అన్నం తింది. అట్లాగే నిద్రపోయింది కూడా.



హోటలువాడితో గెస్టు: "అయ్యా! నా గదికి ఒక నిలువుటద్దం పంపిస్తారా?"

హో. వా.: "ఏం, ఇప్పుడున్నది నిలువుటద్దంలో సగం వుంది. చాలదుటండీ?"

అతిథి: "చాలదు కనకే అడుగుతున్నా. నిన్నా మొన్నా లాగూ వేసుకోకుండానే బయటికి వెళ్ళా."

"భగవంతుడా! ఈడు వచ్చిన యీపిల్ల ఉద్యోగం యేమిటి? ఈతిరగడం ఏమిటి? నన్ను కనికరించు భగవాన్ -" పసిపిల్లలా ప్రక్కకు తిరిగి సగం బోర్లగా పడుకున్న జయంతి తలక్రింద దిండు సరిచేసి పక్కగా పడుకుంటూ దేవుడిని ప్రార్థించసాగింది బామ్మగారు. ఆవిడ యీ అరవై సంవత్సరాల్లో ప్రపంచంలో మంచికంటె చెడే యెక్కువ చూసింది. న్యాయంకంటే అన్యాయమే కన్పించింది ఆవిడకి. జయంతి వెర్రిబాగులపిల్ల. సాధ్యమైనంత త్వరలో పెళ్ళియేలా చూడమని ఆ రాత్రి మరీమరీ ప్రార్థించసాగింది.

జయంతి లక్ష కళ్ళతో యెప్పుడా యెప్పుడా అని యెదురుచూసిన ఆ రోజు రానేవచ్చింది. ఉదయం 8 గంటలకే యేదో యింత సయించీ సయించనట్టు బొమ్మ బలవంతంమీద భోంచేసిన జయంతి తనకివున్న ఒకే ఒక మంచి చీర లేత గులాబీరంగు జార్జెట్ చీర, అదేరంగులో కొద్దిగా ముదురుగావున్న గులాబిరంగు క్రేప్ జాకెట్ వేసుకుని వనితావిహార్‌కి వచ్చేసింది.

ఈ రోజు జయంతి చెయ్యాల్సిన పనులు బోలెడన్ని వున్నాయి. పదిమంది పెట్టు తనే చేస్తోంది. అయినదానికి కానిదానికిప్రతి దానికి ప్రతిఒక్కరూ జయంతీ జయంతీ అని పిలిచేవాళ్ళే. అందరికీ జయంతిపేరు నాలిక చివర వుండిపోయింది. ఒక్కళ్ళు మాట కూడా కాదనలేదు. ఎవరిమనసూ నొప్పించలేదు. జయంతి ప్రపంచంలో విసుగు అనే ఒక మాట వుందని ఆక్షణంలో పూర్తిగా మర్చిపోయినట్టే కన్పించింది. గాలికంటె వేగంగా, మెరుపుకంటె చురుగ్గా, అలలకంటె తేలికగా నడుస్తున్న జయంతి గిరగిర బంగారుతీగెలా తిరుగుతూ ప్రతివాళ్ల చెయ్యి అందుకుని ఆ పనిలో సాయపడసాగింది.

సాయంత్రం అయిపోయింది. వనితావిహార్ ముందు స్వాగత పూర్వకంగా అందంగా తీర్చి దిద్దిన వరస ప్రకారం అమర్చిన రంగురంగుల దీపాలు వెలిగాయి. చూస్తుండగానే జనం గుంపులు గుంపులుగా రాసాగారు. హాలంతా నిండిపోయి కిటకిటలాడసాగింది. అక్కడే నిలబడిన జయంతి సుమిత్రాదేవి ఆదేశించిన ప్రకారం స్పేరుగా తెప్పించి పెట్టిన కుర్చీలు వేయించి వచ్చిన వాళ్ళకి కూర్చునేందుకు స్థలం చూపించసాగింది.

ఇంత గందరగోళంమధ్య జయంతి ఒక విషయం గ్రహించకపోలేదు. బోలెడంత డబ్బు పెట్టి టిక్కెట్లు కొన్నవాళ్ల యెవరూ రాలేదు. ఒకవేళ వచ్చినా చాలాకొద్దిమంది వుండి వుంటారు. మర్యాదకోసం యిచ్చిన ప్యాసులమీదమటుకు బ్రహ్మాండంగా వచ్చారు, ఒక్కొక్క ప్యాసుమీద కనీసం అరడజనుకి తక్కువలేకుండా. అందుకే హాలు కిటకిట లాడి చోటు చాలటంలేదు.

మొదటి తరగతి ఎంట్రెన్స్ దగ్గిర జయంతిని నిలబడమని చెప్పింది సుమిత్రాదేవి. పెద్దపెద్దవాళ్ళు చాలామంది వస్తారు. జాగ్రత్తగా స్వాగతం చెప్పి వాళ్ళకి కూర్చునేందుకు చోటు చూపించాలి. జయంతి అలాగే నిలబడిపోయింది. ఎవరో వచ్చారని కుర్చీలు తెప్పించి లోపల వేయిస్తున్న జయంతి యింతలో ప్రక్కవాళ్ళు "మంత్రిగారు" "మంత్రిగారు" అనటంతో వేయిస్తున్న కుర్చీలు వదిలేసి బైటకు పరుగెత్తుకొచ్చింది. జయంతి మనుష్యుల్ని తప్పించుకుని వచ్చేలోపలే మంత్రిగారు స్టేజీదగ్గరకు వెళ్ళిపోయారు. ఏదోపనిమీద ఆయనతో వెళ్ళకుండా వెనక దిగబడిపోయిన సుమిత్రాదేవి గుమ్మం ప్రక్కన వూరికే నిలబడిపోయిన జయంతిని చూస్తూ విసుక్కుంటూ "ఆదేమిటి? ఇప్పుడేనా అలా నిలబడేది? అక్కడ జనంనిలబడ్డారు. కుర్చీలువేయించమని చెప్పాలా" అంది. హఠాత్తుగా లభించిన యీ తిరస్కారంతో జయంతి మనసు చివుక్కుమనటమే గాకుండా కళ్ళలో నీళ్ళు కూడా తిరిగాయి. ఇంతలో అటువైపుగా

వచ్చిన మిసెస్ కరుణాకరం "అరె! అక్కడ వాళ్ళంతా నిలబడిపోయారే" అంటూ పరుగెత్తికెళ్ళి కుర్చీలు సర్దివేసి కూర్చోపెట్టింది. ఒక్క కరుణాకరమేగాదు మిగతా అందరూ అంతే. యెవరిని చూసినా వనితావిహార్ భారం అంతావాళ్ళే మోస్తున్నట్టు చురుగ్గా పనిచేస్తున్నారు.

మొదటి తరగతి ఎంట్రెన్స్ దగ్గర వలంటీర్‌గా నిలబడిపోవటంతప్ప యింకేం చెయ్యాలో జయంతికి అర్థంగాలేదు.

ప్రోగ్రాం మొదలయ్యేముందు అరచేతి మందాన వెడల్పాటి జరీఅంచుగల పట్టుచీర కట్టుకుని, వంటినిండా రాళ్ళనగలతో ధగధగ మెరిసిపోతూ మంత్రిగారి భార్య ప్రెసిడెంట్ హోదా ఒలకబోస్తూ స్టేజీమీదకు నడిచివెళ్ళి రిపోర్టు చదివింది. ఆయాసపడుతూ, తడబడుతూ, మధ్యమధ్య ఆగి చెమట తుడుచుకుంటూ. సవాలక్ష తప్పులతో ఆ యింగ్లీషులో ఆ రిపోర్టు చదవకపోతే హాయిగా తెలుగులో చదవకూడదూ అన్పించింది జయంతికి. ఆదే తనే అయితేనా? జయంతి బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరివచ్చింది. ఇదేమిటి అందరూ యిలా ఒక్కసారిగా తనని మర్చిపోయారెందుకు!

అధ్యక్షత వహించిన మంత్రిగారులేచి అరగంటసేపు మధ్య మధ్య స్టేజీకి ఓ ప్రక్కగా నిలబడిన భార్యవైపు సగర్వంగా చూసుకుంటూ వనితావిహార్ చేస్తున్న నిస్వార్థసేవని వేనోళ్ళ కొనియాడుతూ, కనీసం కొన్ని సంస్థలయినా యిలా పనిచేస్తే దేశం చాలా బాగుపడుతుందని, ఆడవాళ్ళు యీ అత్యవసర పరిస్థితుల్లో ముందడుగు వేసి దేశ రక్షణ బాధ్యతను తాముకూడా పంచుకుంటే పురుషులకి తేలికౌతుందని చెప్పారు. దాదాపు గంటసేపు సుదీర్ఘంగా యిచ్చిన ఆయన ఉపన్యాసంలో పేరుపేరునా వనితావిహార్‌కోసం కష్టపడుతున్న వాళ్ళని గురించి పొగిడాడు. కాని అంత దీర్ఘంగా వున్న ఆ వుపన్యాసంలో జయంతిపేరు మచ్చుకికూడా విన్పించలేదు. చిట్టచివర యింకా చాలామంది యిందులో పనిచేశారు అంటూ ఓ లిస్ట్ చదివాడు. ఆ లిస్ట్‌లో యెక్కడో పదిమందిలో జయంతి తన పేరు విన్పించిందో లేదో కూడా మరిచిపోయింది.

నిలబడి నిలబడి కాళ్ళు పీక్కుపోతున్న జయంతి హఠాత్తుగా బాగా నీరసం అనిపించటంతో స్పేరుగా పెట్టివున్న కుర్చీల్లో తనే వెళ్ళి ఒక కుర్చీ తెచ్చుకుని మొదటి

● ఆమధ్య మద్రాసులో ఒకసభ జరిగింది. ఆ సభకు డాక్టర్ పి. వి. రాజమన్నారు అధ్యక్షతవహించారు, సభారంభంలో స్వాగత వాక్యాలు ముగిసిన తర్వాత, అధ్యక్షులు లేచి, కార్యక్రమంగల కాయితాన్ని చూసి, "తర్వాత, ప్రెసిడెంట్స్ అడ్రస్—"అని చదివి, "నెంబరు 8 విక్టోరియా క్రిసెంటురోడ్డు ఎగ్మూరు, మద్రాసు "అని చట్టున కూచున్నారు!

— సుకుమార్

తరగతి ఎంట్రెన్స్ గుమ్మానికి కొంచెం ప్రక్కగా వేసుకుని కూర్చుండిపోయిందే! నాట్యం మొదలైంది. ముందువరసలో సోఫాలో కూర్చున్న మంత్రిగారికి కుడివైపు రేఖారాణి, యెడంవైపు మిసెస్ వర్మ కూర్చునివున్నారు.

నాట్యం మొదలవగానే ఆలోచనలన్నీ మర్చిపోయి ఆటే చూడటంలో నిమగ్నురాలైపోయిన జయంతి చాలా సేపయింతర్వాత తన వెనక యెవరో నిలబడ్డట్టు తోచటంతో పులిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది. పొడుగ్గా తెల్లగా బాగా నిలువెత్తు మనిషి. నిగనిగలాడుతున్న నల్లటి జుట్టుతో, తెల్లటి బట్టల్లోవున్న అతను చేతులుకట్టుకుని ఆదోరకమైన ఠీవితో నిలబడి తదేకంగా డాన్స్ చూస్తున్నాడు. కూర్చున్న జయంతి గిరుక్కున వెనక్కి తిరగటంతో డాన్సు చూస్తున్న అతనుకూడా కళ్ళుతిప్పి జయంతి వైపు చూశాడు.

జయంతి చప్పునలేచి నిలబడి "లోపలికి వెళ్ళండి" అంది. అతనెవరో ఫలాన అని తెలియకపోయినా గౌరవ మర్యాదలు యివ్వవలసిన మనిషిగానే కన్పించాడు. జయంతికి బాగా దగ్గిరగా నిలబడివున్న అతను జయంతి మాటలకి యేమాత్రం కదలకుండా చిరునవ్వుతో "ఫర్వాలేదు. మీరు కూర్చోండి. డాన్స్ అయిపోవచ్చింది" అన్నాడు. జయంతికూర్చుండిపోయింది. మళ్ళీ ఇద్దరూ డాన్సు చూడటంలో నిమగ్నులైపోయినారు.

ప్రోగ్రాం దాదాపు అయిపోతుండగా యింతలో హఠాత్తుగా యెక్కడినుంచో వూడిపడిన సుమిత్రాదేవి గబగబా వస్తూ "అరె మీరిక్కడున్నారా? లోపలికి వెళ్ళలేదేం? మీకు మంత్రిగారి పక్కన ఖాళీ వుంచిన సోఫా అలాగే వుండిపోయింది. అరె! జయంతీ! వారు నిలబడి వుంటే నువ్వు కూర్చున్నావా?" అంది గట్టిగా మందలిస్తూ. సంగతేమిటో తెలియని జయంతి లేచి నిటారుగా నిలబడి యిద్దరివైపు చూడసాగింది.

"నో! నో! నేనే లోపలికి వెళ్ళనన్నాను. అసలు నేను వచ్చింది కూడా యిప్పుడే" అన్నాడతను చేతులు పాంట్ జేబుల్లో పెట్టుకుంటూ. "అలాగా! యీ అమ్మాయి మా సెక్రటరీ కొత్త పాపం. తెలియదు." జయంతిని పరిచయం చేస్తూ అంది సుమిత్రాదేవి. జయంతి రెండుచేతులు జోడించి నమస్కారం చేసింది. అతను చేయలేదు. చేతులింకా అలాగే పాంట్ జేబుల్లో పెట్టుకుని తలమటుకు వంచుతూ "అవును. ఎవరినో అప్పాయింట్ చేశారని విన్నాను. పేరు?" అన్నాడు. జయంతి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"జయంతి" జయంతితోపాటు సుమిత్రాదేవికూడా చెప్పింది. అతనెవరో పరిచయం చేస్తుందేమో అనుకుంది జయంతి. అదేం ఆవసరం లేనట్టు సుమిత్రాదేవి వెళ్ళిపోయింది. ఆవిడ వెనకే అతను వెళ్ళిపోయాడు. ప్రోగ్రాం అయిపోయింది. జనం గుంపులు గుంపులుగా యివతలకివచ్చేస్తున్నారు. వాళ్ళకి దారియిస్తూ గుమ్మం ప్రక్కగా నిలబడిపోయిన జయంతిదూరంగా వెళ్ళిపోతున్న సుమిత్రాదేవివైపు. అతనివైపు చూడసాగింది. అతను నిలబడ్డప్పుడే గాదు. నడుస్తుంటేకూడా, వెనకనుంచి

చూసినా మనిషి మంచి హుందాగా నిండుగా వున్నాడు.

టైటకొచ్చేసిన మంత్రిగారు వెళ్ళికారులో కూర్చున్నారు. కారుచుట్టూ చాలామంది మూగారు. వాళ్ళందరిలో పొడుగ్గా వుండటం వల్లనేమో అతను స్పష్టంగా కన్పిస్తున్నాడు. అందరూ ఆడంబరంగా వీడ్కోలుయిచ్చారు. మంత్రిగారి కారు కదిలి వెళ్ళిపోయింది. జయంతిలో నుంచి యెంతబలవంతాన ఆపుకోవాలన్నా ఆగని నిట్టూర్పొకటి బైటకు వచ్చింది. మంత్రిగారు రానూవచ్చారు. వెళ్ళనూవెళ్ళారు. తను పరిచయం చేయబడనేలేదు.

చూస్తుండగానే జనం పలచబడిపోయారు. హాలు ఖాళీ అయిపోయిందికూడా. హఠాత్తుగా అందరికీ మళ్ళీ జయంతి గుర్తువచ్చింది. ఒక్కసారి అంతా జయంతీ జయంతీ అని పిలవటం మొదలుపెట్టారు. విన్పించినా జయంతి నిలబడ్డచోటునుంచి ఒక్కడుగు కూడా కదపలేదు.

ఓ ప్రక్క రేఖారాణీ యింకో ప్రక్క అతను నడుస్తుండగా జయంతివైపు వచ్చిన సుమిత్రాదేవి ఆగి "జయంతీ! నువ్వింకో అరగంటవుండి వాళ్ళవన్నీ సర్దించేసింతర్వాత వెళ్ళు. నేనుకూడా వుండేదాన్ని కాని మా చిన్నబ్బాయికి జ్వరం. ఒళ్ళు పేలిపోతోంది. నేను రాకపోతే పని జరగదని తప్పని సరిగా వచ్చాను." అంటూ "రేఖారాణీ! పోదామా" అంది ప్రక్కకు తిరుగుతూ.

రేఖారాణి నల్లంచు పువ్వులున్న తెల్ల సిల్కుచీరె కట్టుకుంది. గుండెల్లోకి దిగిపోయిన నెక్‌వున్న జాకెట్టు. మెళ్ళో ముత్యాల పేరు. చేతిమీద "షాల్". నడినెత్తిమీద



డాక్టరు: "మనిషి కనిపించకుండా ఎక్కడినించో తెలీకుండా మాటలు వినిపిస్తూవుంటాయా మీకు?"

రోగి: "చిత్తం."

డాక్టరు: "రాత్రిళ్ళా, పగలా?"

రోగి: "టెలిఫోను మోగుతుంటే ఎత్తినప్పుడల్లానండీ."

చుట్ట. చుట్టనుంచి ఒకప్రక్కకు వేళ్లాడుతున్న మల్లెపూలు. మనిషి నలగలేదు. చెదరలేదు. అప్పుడే తయారైవచ్చినట్టుంది. జయంతికి క్షణంసేపు విపరీతమైన యీర్ష్య అన్పించింది. తనే రేఖారాణి అయి. రేఖారాణి జయంతి యెందుకు కాగూడదు! మంత్రిప్రక్కన యెంత ఠీవిగా కూర్చుంది!

"రండి. మీరుకూడా" పరధ్యానంగా నిలబడిపోయిన అతనివైపు చూస్తూనే అంది రేఖారాణి.

"నేనా? నేనుకూడా వుండి యివన్నీ చూస్తాను. నాకు నిద్ర రావటం లేదు" అన్నాడు.

"నిజంగా! మెనీ మెనీ థాంక్స్." సుమిత్రాదేవి మనసులో కలిగిన సంతోషాన్ని కళ్ళలో, కనుబొమ్మల్లో, మొహం

అంతా ప్రతిఫలిస్తుందగా అంది. కాని రేఖా రాణి కనుబొమలు ముడుచుకున్నాయి.

"అయితే మీరెందుకు రండి డ్రాప్ చేస్తాం." అంది రేఖారాణి.

"నో, నో. ఉండనివ్వు. నేను పూరికే సాయంత్రం వుంటానన్నానంతే." అన్నాడతను. అతనిమాట లెందుకో రేఖారాణికి నచ్చి నట్టులేదు. ఆ నచ్చకపోవటం అతనికిపట్టి నట్టులేదు. సుమిత్రాదేవితో వెళ్ళిపోతున్న రేఖారాణి వెనక్కు తిరిగి జయంతివైపు వంకర చూపొకటి విసిరివెళ్ళింది. ఎందుకో తెలియదుగాని ఆ చూపు చాకులా సూటిగా వచ్చి జయంతి లేతమనసులో నాటుకుని కలుక్కుమంది.

అందరూ వెళ్ళిపోయారు. బైటలైట్లన్నీ తీసేశారు. లోపలకూడా ఒక్కొక్కలైటు తీసేస్తున్నారు. చిందర వందరగావేయబడిన స్పేర్ కుర్చీలుకూడా ఖాళీచేయబడు తున్నాయి.

"మీరు కూర్చోండి. నే నవన్నీ చూసి వస్తాను" అతను జయంతివైపు చూడకుండానే అనేసి వెళ్ళిపోయాడు. ఏం చెయ్యాలో తోచక హాలులో ఒంటరిగా నిలబడిపోయిన జయంతి ప్రక్కనున్న కుర్చీలో కూల బడింది. ఉదయం యెప్పుడో తిన్నతిండి. అదికూడా సరీగ్గా సయించనేలేదు. పగలల్లా తిరుగుతుంటే తెలియలేదుగాని ఇప్పుడు బోలెడంత నీరసం అనిపిస్తోంది. మధ్యలో కొంచెం కాఫీఅయినా తాగుదామంటే టైమ్ దొరకనేలేదు.

ఉదయంనుంచి తిరిగితిరిగి అలిసిపోయిన జయంతి కుర్చీలో కొంచెం అలా వెనక్కువాలగానే కళ్ళమీదకి మత్తులాటిది వచ్చి ఆవరించుకుంది. అంతా మగతగా మంచుతెర కప్పినట్టుంది. ఏదీ స్పష్టంగా తెలియటం లేదు. ఎన్ని ఆలోచించిందితను. ఒక్కటీ కూడా జరగటంలేదు. అంతా యేదోనంతడి· బోలెడంతమంది రకరకాలవాళ్ళు గుంపులు గుంపులుగా పోతున్నారు. వాళ్ళందరికీ దూరంగా-ఓ ప్రక్కగా ఒంటరిగా తను. తనకేంలేదు. ప్రత్యేకత అనేది అసలేలేదు.

ఎంత దిగులుగా అనిపిస్తోంది. తనకి యెవరూలేరు. బామ్మకితప్ప ఈ ప్రపంచంలో యెవరికీ తను అక్కర్లేదు. ఎంతదూరంగా వుంది తను ! తనున్నచోట యెంత ఒంటరి తనం ! తనచుట్టూ వలయంలా చుట్టుకు పోయిన యీ భయంకరమైన వంటరి తనాన్ని ఛేదించుకుని యెవరైనా జయంతీ అంటూ దగ్గరకు రాకూడదూ ! తన పిచ్చి గాని యెవరొస్తారు ? ఎవరికి కావాలి తను? లేదు. లేదు. ఎవరో కావాలంటున్నారు· నవ్వుతూ అస్పష్టంగా వున్న మొహం ఒకటి మీదకు వంగి నువ్వు నాకు కావాలి అంటోంది.

ఇప్పుడెంత హాయిగావుంది. ఎవరిదో చేయివచ్చి తన చేతిని పెనవేసుకుంది. ఆ స్పర్శ యెంత ధైర్యాన్నిస్తోంది. ఆచేతిని పట్టుకుని అలా అలా దూరతీరాలకు ఎగిరి పోతే యెంత బాగుండును ? తనచేతిలో నుంచి జారిపోబోయి తప్పించుకో బోతున్న ఆ చేతిని మరింత బలంగా దగ్గరకి పట్టుకుని గుండెలకి దగ్గిరగా లాక్కుంది జయంతి. ఏదో నూతన స్పర్శ. ఏదో తెలియని సువాసన. అర్థంగాని ఆనందం. జయంతిని వుక్కిరి బిక్కిరి చేశాయి.

జయంతి వులిక్కిపడి లేచింది. ఎదురుగా అతను. అతనిచెయ్యి తన రెండు చేతుల్లో. జయంతికి క్షణంసేపు తనెక్కడుందో, కళ్ళముందు తనేం చూస్తోందో అర్థం గాలేదు. తెల్లబోయిన జయంతి ఒక సారి చిరునవ్వుతో వున్న అతని మొహం లోకి, యింకోసారి తన చేతుల్లోవున్న అతని చేతివైపు చూసింది.

"అదేమిటి తలేవారే! కూర్చోండి అని చెప్తే హాయిగా నిద్రపోతున్నారా? పైగా లేపుదామని తట్టబోతే చెయ్యిగట్టిగా పట్టుకున్నారు" నవ్వుతూ అంటున్న ఆమాటలు జయంతిని పూర్తిగా యీలోకంలోకి తీసుకు వచ్చాయి. చప్పున చేతిని వదిలేసి నిల బడింది. కాని ఈసారి అతను వదలలేదు. జయంతి చేతినిపట్టి కొద్దిగా పైకెత్తుతూ మృదువుగా, "చాలా అలసిపోయారులా వుంది-అవునా?" అన్నాడు అప్పటికేసిగ్గుతో నరనరం మెలిదిరిగిపోతున్న జయంతి అవునన్నట్టు గబగబా తలూపింది. హాలులో యిందాకటిలా దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లులేవు. హాలుకి మధ్యగా వెలుగుతున్న లైటుమాత్రం వుంది. స్టేజిని యెప్పటిలా తనలో దాచేసుకున్న పసుపుపచ్చటి వెల్వెట్ కర్టెన్ మామూలుగా యేమీ యెరగనిదానిలా వేళ్లాడుతోంది. "పదండి వెళదాం" అన్న అతని మాటలతో జయంతి కదిలింది. ఇద్దరూ బైటకొచ్చేశారు. వరండాకి కొద్ది దూరంలో వెన్నెలలో నల్లగా నిగనిగలాడుతున్న కారొకటి నిలబడివుంది. దాన్ని చూడగానే జయంతి వులిక్కిపడినట్టుగా "నే వెళ్ళటం ఎలా" అనుకుంది. ముందు చకచక మెట్లుదిగుతున్న అతను హఠాత్తుగా ఆగి వెనక్కుతిరిగి "యేమిటి" అన్నాడు.

అతనివెనకే దాదాపు అంత వేగంతో గబగబా దిగివస్తున్న జయంతి హఠాత్తుగా అతను ఆగటంతో అతనిమీద తూలిపడబోయి అతి ప్రయత్నంమీద గుండెలదగ్గరగావచ్చి ఆగిపోయింది.

"ఏమిటి?" ఇంకోసారి అడిగాడు అతను.

"నేను వెళ్ళటం యెలా?"

"నడిచివెళ్ళండి. రిక్షాలుండవు. బస్సు లిప్పుడురావు." అతను మళ్ళీ నడుస్తూ అన్నాడు. జయంతికి కోపంవచ్చింది. పరిచయంలేని మనిషితో పరాచకం ఆడటం మర్యాదస్థుల లక్షణంగాదు.

● ఒక కుర్రాడు పెంపుడుకుక్కని గొలుసుపట్టుకుని నడిపించుకు తీసుకుపోతున్నాడు. ఒకాయన కుర్రాడికేసి ముచ్చటగా చూసి

"కుక్కని పెంచుకుంటున్నావా అబ్బాయ్? దానిపేరేమిటీ!" అని అడిగాడు.

"అసలుపేరేమిటో తెలియదుగాని నేను జాకీ అని పిలుస్తానండి." అన్నాడు కుర్రాడు.

"రండి. యింకొంచెం సేపయితే మీరు నడుస్తూనే నిద్రపోయేలావున్నారు" కారు డోరుతెరిచి పట్టుకుంటూ అన్నాడు. జయంతికి నవ్వు వచ్చింది. కోపం యెక్కువైందికూడా. అటువైపుగా తిరిగివచ్చి డ్రైవింగ్ సీటులో కూర్చున్న అతను కారు స్టార్ట్ చేస్తూ "దారిచూపించాలి" అన్నాడు.

గేటుదాటి బైటకురాగానే జయంతి చెప్పినవైపు అతను కారు తిప్పాడు. దగ్గర దగ్గర ఒంటిగంట కావస్తుండటంవల్లవీధులన్నీ నిర్మానుష్యంగావున్నాయి. వెన్నెల్లో అర్ధరాత్రి వేళ నిశ్శబ్దంగావున్న వాతావరణం జయంతి నిద్రమత్తు కళ్ళకి యింకా యెలాగోవుంది. ఖరీదుగల కారు. మెత్తని సీటు. బైటనుంచి రివ్వున వీస్తున్న చల్లటిగాలి.

"మీ యింట్లో యెవరెవరుంటారు?"

"బామ్మా నేను." క్షణంసేపు ఆగి జవాబుచెప్పింది.

"అదేం? యింకెవ్వరూ లేరూ?"

"ఉహూం."

"అమ్మా, నాన్నా?"

"చిన్నప్పుడే పోయారు." బైట వెన్నెలలోకి చూస్తూ అంది. ఇద్దరిమధ్య మౌనం ఆవరించింది. ఉన్నట్టుండి అతను నిట్టూర్పు విడవటం వినిపించింది. జయంతి తలతిప్పి చూసింది. రోడ్డుమీద దృష్టిని నిలిపి డ్రైవ్ చేస్తున్న అతను జయంతివైపు చూడలేదు. కొంచెం ఆగి "మీరు నాకంటె అదృష్టవంతులు" అన్నాడు

"ఎలా?" జయంతికూడా రోడ్డువైపు చూస్తూ అంది. రోడ్డుకి అటు యిటు నిలబడ్డ చెట్ల నీడలతో వెన్నెల దోబూచులాడుతోంది.

"మీకు కనీసం బామ్మయినా వున్నారు. నా కెవరూలేరు"

జయంతి వూరుకుంది. ఇతనెవరో తనకింతవరకూ తెలియనేలేదు. అడగటానికి ధైర్యం చాలలేదు. అతనిమాటలు స్నేహపూర్వకంగా యెన్నోరోజులనుంచి పరిచయం వుండి మాట్లాడుతున్నట్టుగా వున్నాయి.

"అసలు మీరి వుద్యోగానికెందుకు వచ్చారు?"

జయంతి వులిక్కిపడింది. "బావుంది. అందరూ యెందుకు వుద్యోగాలు చేస్తారు?" జయంతి యెదురుప్రశ్న వేసి జవాబు తప్పించుకుంది.

"అందరూ యెందుకు చేస్తారనేది అర్థం లేని ప్రశ్న. కొంతమంది సరదాకి చేస్తారు. కొంతమంది చేస్తున్నాం అనే గొప్పకోసం చేస్తారు. ఇంకా కొంతమంది తిండికోసం చేస్తారు. కొంతమంది తోచక కాలక్షేపానికి చేస్తారు." అతని మాటలకి పదునుంది.

"వాటిలో యే ఒక్క కారణం అయినా కావచ్చు. బహుశా ఏదో ఒకటి తప్పక అవుతుందికూడా."

"ఏ కారణాన వచ్చినా మీరీ ఉద్యోగంలో యెక్కువ రోజులు వుండలేరు. అదిమటుకు ఖచ్చితంగా చెప్పగలను. కావాలంటే పందెంవేస్తాను."

బాగుంది జోస్యం! జయంతి అహం దెబ్బతింది. ఎంత అనవసర ప్రసంగం అనిపించిందికూడా. సంభాషణ పొడిగించటం



యిష్టంలేనట్టు తలతిప్పి బయటకు చూడసాగింది.

"నే నీ ఉద్యోగం చెయ్యలేనని మీ కెలా చెబుతున్నారు?" బైటకుచూస్తున్న జయంతి అర్థమక్కుండా వుండలేకపోయింది.

"కొంతమందిని చూస్తూనే కొన్ని విషయాలు అర్థమైపోతాయి. మీ సంగతి తెలియకపోయినా వనితా విహార్ సంగతి బాగా తెలుసు."

జయంతి యేదో సమాధానం చెబుదాం అనుకునే లోపలనే యిల్లు వచ్చేసింది.

"అరె ఆపండి, ఇక్కడే" సడెన్ బ్రేక్‌తో కారు ఆగిపోయింది.

"థ్యాంక్స్ వస్తాను." ఇంకోమాట చెప్పకుండా, చెప్పేందుకు అవకాశం ఇవ్వకుండా జయంతి డోరు తెరుచుకుని దిగింది.

"ఎక్కడా యిల్లు? ఫర్వాలేదా?"

"అదుగో ఆ కన్పించేదే. వస్తాను"

"ఆల్‌రైట్. గుడ్‌నైట్." అంటూ అతను జయంతి వేసిన తలుపు సరిగ్గా పడలేదని గ్రహించి ముందుకు వంగి చెయి చాచాడు.

"ఇంతకీ నే నడగలేదు. మీరూ చెప్పలేదు మీ పేరు?" బొమ్మలా నిలబడిపోయిన జయంతి అతనివైపే చూస్తూ అడిగింది.

"నా పేరా?" తలుపువెయ్యబోతున్న అతను ఆగి "అవును నిజమే-సుమిత్రాదేవి నన్ను పరిచయం చెయ్యనేలేదుగదా! మీకు తెలుసుకోవాలని కుతూహలంవుంటే నాపేరు రాజశేఖరం-" అన్నాడు డోరులాగి గట్టిగా వేసేస్తూ.


"రాజశేఖరమా?"జయంతి చేయి అనుకోకుండా గుండెలమీదకు వెళ్ళింది. కళ్ళు వెడల్పుఅయినాయి.

"అవును. అలాచూస్తారేం? మీకు నచ్చలేదేమో! తెలిసినవాళ్ళు శేఖరం అని. ఆప్తులు, స్నేహితులు రాజా అని పిలుస్తారు. వస్తాను. గుడ్‌నైట్-" కారు వెళ్ళిపోయింది

"మైగాడ్! రాజశేఖరం!" ఊపిరిపీల్చుకోవడం మర్చిపోయింది జయంతి.

(ఇంకా వుంది)

● ఒకగొప్ప తెలుగువాడికి షష్టిపూర్తి జరుగుతోంది. ఆయన్ని గంటసేపుగా ఇంద్రుడు, చంద్రుడు అని ప్రశంసిస్తూ అలిసిపోయిన ఒకవక్త ఆ వూపులో ఉత్సాహం పట్టలేక, "వీరు షష్టిపూర్తి చేసుకోవటం నాకుచాలా ఆనందంగావుంది. త్వరలోనే వీరికి నూరేళ్లునిండి శతజయంతి కూడా చేసుకోగలరని ఆశిస్తున్నాను" అనేసి నాలిక్కరుచుకున్నాడు.



స్నేహం

బలరామ

"అమ్మాయి బాగానే ఉంది కదూ?" అన్నది సావిత్రి.

రైలు నత్తకన్నా వేగంగానే పరుగెత్తుతోంది. ఆ సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో వాళ్ళుముగ్గురూ కాక మరోయిద్దరు- భార్యా,భర్త కాబోలు-ఉన్నారు. కిటికీదగ్గర కూచుని బైటికి చూస్తూన్న పార్థసారథి సావిత్రి ఉత్కంఠతకు తనలోతానే నవ్వుకో సాగాడు.

ఆమెకే అర్థంకాలేదు. ఒకనిముషంపోయాక "చాల్లే" అన్నది. ఆతర్వాత ఆమె ఆలోచన ఆ పిల్లమీదికిపోయింది. చెంపకి బారెడేసి కళ్ళు, తనకిమల్లెనే బారెడు జడా. కుంద నపుబొమ్మలా ఉందా అమ్మాయి. సారధికి, ఆ పిల్లకి పెళ్ళికాదా?

సారధి తన ఆలోచనల్లో తానుండి పోయాడు. అతనికి చూసివచ్చినఅమ్మాయిని గురించి నిశ్చితంగా యింతవరకూ ఎలాంటి అభిప్రాయం ఏర్పడలేదు. ఆ అమ్మాయి తాను ఊహించుకున్న సుందరిలాగా ఉన్నదో లేదో కూడా అతను చెప్పలేకుండా ఉన్నాడు. నిజంచెప్పాలంటే, తన ఊహా సుందరి రూపం ఏమిటో ఆతని మనసులోనే స్పష్టంగాలేదేమో? అతని స్నేహితుల్లో చాలామందికి పెళ్ళిళ్ళయినాయి. కొంత మంది తండ్రులయినారుకూడా. వాళ్ళలో ఎక్కువమంది భార్యలు అద్భుతమయిన సౌందర్యవతులుకారు. కొంతమంది అనాకారిగా ఉన్నారుకూడా. అట్లాంటివాళ్ళని చూసి చూసి ఎట్లాచేసుకున్నారా అని అతను ఆశ్చర్యపోయేవాడు. ఇప్పుడనిపిస్తోంది- వాళ్ళు తనలాగానే యిదమిత్థమని ఏదీ నిర్ణయించుకోలేక ఏదో ఊహించుకుని, మనసుని నమ్మించుకుని, వాళ్ళని పెళ్ళిచేసుకుని ఉండాలి. తనూఅట్లాగే చెయ్యవలసివొస్తుందా అని భయంవెయ్యసాగిం దతనికి.

ఇంటిదగ్గర నరసింహంగారు, ముకుంద రామయ్యగారూ మాత్రం నిశ్చింతగా చదరంగం ఆడుకుంటూ, చుట్టలుకాల్చుకుంటూ కూచున్నారు. ఇంట్లోకి రావటానికి వీల్లేక పోవటాన పెళ్ళిసంబంధం చూడటానికి వెళ్ళలేకపోయిన రుక్మిణమ్మ మాత్రం గుమ్మందగ్గరనుంచుని వొచ్చే ప్రతి బండి వంకా ఆశగా చూస్తోంది.

చదరంగంలో తన ఆధిక్యం మరోసారి నిరూపించుకున్న నరసింహం "వీళ్ళింకా రాలేదేం బావా?" అన్నాడు గడియారం ఎనిమిదిగంటలు కొట్టటం విని.

"వొస్తార్లే!....మరో ఎత్తువేద్దామా?....' అన్నాడు ముకుందరామయ్య.

"కానియ్యి"

గుమ్మంలోనుంచున్న రుక్మిణమ్మకి ఈ మాటలు చెవులో చెప్పినట్టుగా వినిపించాయి. మగవాళ్ళిద్దరిమీదా ఆవిడకి వొళ్ళు మండి పోయింది. ఐనా వాళ్ళననుకుని ప్రయోజనం ఏవుంది. వాళ్ళిద్దరూ కలిసివుంటే ప్రపంచంలో ప్రళయం వొచ్చినా వాళ్ళకి పట్టదు. ఒక్కచోట చదువుకుని, వొక్కచోట ఉద్యోగాలు చేసి రిటైరై, ఆచోటే పక్క పక్కగా యిళ్ళుకట్టుకుని ఆ యిద్దరూ యిద్దరిలాగా కాక వొక్క ప్రాణంగానే యింతవరకూ బతికారు. అటు ముకుంద రామయ్యకీ బోలెడంతమంది బలగం వున్నారు. ఇటు నరసింహానికీ కావల్సినంత మంది చుట్టాలున్నారు. ఐతేనేం? ఏ ముహూర్తాన వాళ్ళయిద్దరికీ స్నేహం కలిసిందోగాని ఆమానవులు చుట్టాల్నీ పక్కాల్నీ అందర్నీ మరిచిపోయారు. 'బావ బావ' అనుకుంటూ వొకళ్ళవెనక వొకళ్ళు తిరుగుతుంటారు. ఏం మనుషులో? ఒక్కబాధ్యత పట్టదు. అనుకుంది రుక్మిణమ్మ. రాత్రి తొమ్మిది దాటాక, కడుపులో ఏమీ లేక పోవటంవల్ల నీరసంతో మాగన్నుపట్టాక రుక్మిణమ్మ వీధిలో రిక్షాలాగిన చప్పుడై

కళ్ళు తెరిచింది. సారధి, సావిత్రి, సుభద్రమ్మా ఆపసోపాలు పడుతూ లోపలి కొచ్చారు.

● ● ●

రెండు మూడు రోజులు గడిచాయి.

సావిత్రికి రోజు యుగంగా గడిచింది. సమయం గడుస్తున్నకొద్దీ ఆపిల్లకి ఎందుకో ఈపెళ్ళి జరగదనిపించ సాగింది. ఎన్ని సార్లడిగినాచిరునవ్వుతో 'నీయిష్టం'అంటాడు గాని ఏదీ తేల్చిచెప్పడు సారధి. సావిత్రి తనుగా అడగటానికి అభిమానం అడ్డొచ్చి తల్లి రుక్మిణమ్మతోనూ, తండ్రి నరసింహం తోను వొకటికి రెండుసార్లు అడిగించింది. ఊహుఁ! అతను మాట్లాడలేదు. చివరికొక రోజున సారధి ఆఫీసునించి తిరిగొచ్చి స్నానం అదీ చేసి గదిలో కూచునివుండగా పోయి పలకరించింది.

"అందరూ అడగటం ఐంది. ఇహ నువ్వొచ్చావా?" అన్నాడు సారధి నవ్వుతూ.

"అదికాదు బావా! నీకు పిల్లని చేసుకోవాలనిలేదా?" అన్నది సావిత్రి.

"లేదు."

"ఎందుకు లేదు?"

"ఎందుకో లేదు! అంతే."

"నువ్వు సరిగ్గా చూశావా అసలు?"

సారధి నవ్వి "నీకు బాగా నచ్చిందా?" అన్నాడు.

"ఆ"

"సుఖపడతా నంటావు?"

"తప్పకుండా సుఖపడతావు బావా."

"ఐతే కానియ్యి. అడిగేదేంవుంది?" అన్నాడతను.



"ఏమోయ్. మీ ఆవిణ్ణి ఇంటికి తీసుకొచ్చారా? అబ్బాయా, అమ్మాయా?"

"చెప్పుకోచూదాం."

"అబ్బాయి!"

"కాదు."

"అమ్మాయా?"

"ఆ, ఆ, నీ కెవరో చెప్పేశా రన్నమాట అప్పుడే."

"నాకోసం వొప్పుకుంటున్నావా?" అన్నది సావిత్రి.

సారధి నవ్వి "అదేమీ కాదులేవయ్యా! ....ఆలోచించుకోటానికి యింత వ్యవధి పట్టింది. అంతే" అన్నాడు.

సావిత్రి సంబరంగా "ఐతే....మావయ్య చేత ఉత్తరం రాయించనా?" అన్నది.

"ఓకే" అన్నా డతను తలవూపి.

సావిత్రి చెప్పినవార్తవిని సుభద్రమ్మా, రుక్మిణమ్మా ఏనుగెక్కినట్టుగా సంబరపడి పోయారు. సావిత్రి కలమూ కార్డూ తీసుకు వెళ్ళి ముకుందరామయ్య చేతికిచ్చి "తెనాలి వారికి ఉత్తరంరాయి మావయ్యా!" అన్నది.

ముకుందరామయ్య స్నేహితుడివంక చూసి ముసిముసినవ్వులు నవ్వాడు. నరసింహామూ నవ్వి ''మొత్తానికి సాధించావే అమ్మా!'' అన్నాడు కూతురితోటి.

సావిత్రి గర్వంగా తలెగురవేసింది.

ముకుందరామయ్య ఉత్తరం రాసిన నాలుగోరోజున తెనాలినుంచి కబురు తీసుకుని సుబ్రహ్మణ్యం దిగబడ్డాడు. సుబ్రహ్మణ్యం కూడా యింటి గుమ్మంలోకి రాంగానే, ఎదురుకున్నది సావిత్రినే. అతన్ని చూడంగానే సావిత్రికి చటుక్కున ఆనాడు రైల్లో సారధి అన్నమాటలు గుర్తొచ్చాయి. ఒక్క క్షణంపాటు తాను సిగ్గుపడాలో, కోపం తెచ్చుకోవాలో తేల్చుకోలేకపోయింది సావిత్రి. ఆ తర్వాత యింటికి వొచ్చినవాడిని వీధిగుమ్మంలోనే నిలబెట్టానన్న సంగతి గమనానికి వొచ్చి "లోపలికి రండి" అన్నది. సుబ్రహ్మణ్యం లోపలికి వొచ్చి కూచున్నాక "నాన్నగారు మావయ్యగారితో చెప్పమని పంపారు. ఆయనకి పనుల వొత్తిడి మూలాన రాలేకపోయారు. వారంరోజుల్లో మంచిరోజుచూసిముహూర్తం పెట్టించి కబురు చేస్తామన్నారు" అన్నాడు.

"మావయ్యగారు యింట్లోలేరు. వారొచ్చిందాకా ఉంటారా?" అన్నది సావిత్రి.

కొత్తమనిషి గొంతు వినిపించి వంటింట్లోనుంచి "ఎవరే అమ్మాయ్?" అంటూ వొచ్చిన సుభద్రమ్మ, సుబ్రహ్మణ్యాన్ని చూసి "నువ్వాబాబూ?....వారు యింట్లో లేరే?" అన్నది.

తను తెచ్చిన కబురు ఆమెకి వినిపించి "నాకు ఊళ్ళో కొంత పని వుందండీ! మావయ్యగారు యింటికెప్పుడొస్తారో?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"రావాలి! నాయనా! మరోగంటకన్నా వొస్తారు" అన్నది సుభద్రమ్మ.

"నేను మధ్యాహ్నం మూడింటికి వొస్తాన్లెండి, వారితో చెప్పండి. అన్నాడతను లేస్తూ.

"అట్లాగే" అన్నది సుభద్రమ్మ.

సుబ్రహ్మణ్యం నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

సుబ్రహ్మణ్యం వెళ్ళిపోయిన పది నిముషాలకి ఈ లోకంలోకి వొచ్చింది సావిత్రి. ఆమెకి సారధి మాటల్లోని సత్యం నిరూపణ ఐపోయింది. సుభద్రమ్మ వొచ్చిందాకా అతను తనవంక ఎగాదిగాచూస్తూనే మాట్లాడాడు. సుభద్రమ్మతో మాట్లాడుతూకూడా ఆమెవంక దొంగచూపులు చూస్తూనే వున్నాడు. ఆ సంగతి, సారధి అట్లా అనకపోయివుంటే యిప్పటికీ తాను గ్రహించేది కాదేమో అనుకున్నది సావిత్రి. బావమీద ఆ పిల్లకున్న ప్రేమ, గౌరవం ఆ నిరూపణతో మరింత పెరిగింది.

సుబ్రహ్మణ్యం వెళ్ళిపోయిన అరగంటకి సారధి యింటికివొచ్చాడు. అతని రాక కోసమే కాచుక్కూచున్న సావిత్రి వొక్క గెంతులో అతనిగదిలోకివెళ్ళి "మీ బావమరిది వొచ్చి వెళ్ళాడు బావా! వారంరోజుల్లో ముహూర్తం పెట్టిస్తార్ట" అన్నది.

"ఇకనేం? నీకు కావలిసినంత సందడి" అన్నాడు సారధి నవ్వి.

"చాల్లే!....ఐనా మిడిసిపడకులే. ముందుంది ముసళ్ళపండగ" అన్నది సావిత్రి.

"ఏవిటో అంత పండగ?"

''చూస్తావుగా!... వొచ్చేఆవిడ ఉంగరాలవేళ్ళతో మొట్టకపోతుందా? నేను చూడకపోతానా? నీ రహస్యాలన్నీ చెప్పేస్తాను. నా కసి అంతా తీర్చేసుకుంటాను.''

''మా తల్లివికదూ? 'ఆ రహస్యం' మటుకు చెప్పకేం?'' అన్నాడు సారధి నవ్వకుండా.

సావిత్రి భ్రుకుటి ముడిచి ''ఏ రహస్యం?'' అన్నది.

సారధి పకపకనవ్వి ''కోతలు కొయ్యమంటే పెద్దకూతురువి'' అన్నాడు.

సావిత్రి నవ్వి "నువ్వు చాలా తెలివిగలవాడివి బావా" అన్నది.

''థాంక్స్!....సరేగాని సావిత్రీ! ఇంత కష్టపడి పెళ్ళిసంబంధం కుదిర్చావు? నీకేం కావాలో చెప్పు'' అన్నాడు సారధి.

''ఇస్తావా?"

"తప్పకుండా, నీకు కాదంటానా?"

"పోన్లేబావా! అమాకేంచాలు"

"అట్లాకాదు. కోరుకోవాలి"

"సాయంత్రం....సినిమాకెళదాం"

"ఇంతచిన్నకోరికా?"....ఆల్ రైట్. తప్పకుండా వెళదాం. ఐతే వొక్కషరతు. సాయంత్రం ఆఫీసునించి యింటికొచ్చేసరికి ఆలస్యం ఔతుందేమో? కనుక నువ్వే అక్కడికొచ్చెయ్. కలిసి వెళదాం"

"ఓకే"

ఆఫీసులో పనంతా ముగించుకునే సరికి ఐదున్నర కావచ్చింది. సారధి బద్ధకం వొదిలేలా వొళ్ళొకసారి విరుచుకుని డ్రాయర్ తాళంవేసి లేవబోతూ యెదుట కుర్చీలో కూచుని ఇంగ్లీషు సినిమా పత్రిక తిరగేస్తున్న మూర్తితో "పోదామా?" అన్నాడు. మూర్తి పత్రిక మూసి పట్టుకుని "పద" అన్నాడు. ఇద్దరూ బైటికివొచ్చి కాంటీన్ చేరుకున్నాక "మధ్యాహ్నం మీ బావమరిది వొచ్చాడు ఆఫీసుకి" అన్నాడు మూర్తి.

"మా బావమరిదా? ఎవరు?" అన్నాడు సారధి.

"అ అదేనోయ్. నువ్వు చేసుకోబోయే అమ్మాయి అన్నగారు"

"రాజారావుగారబ్బాయా? కనిపించలేదే?"

"నీకోసంరాలేదులే. నాకోసంవొచ్చాడు"

"నీకు తెలుసా అతను?"

"మేం ఎస్సెల్సీదాకా కలిసిచదువుకున్నాం. నీ సంగతి కూడా వొచ్చిందిలే మామాటల్లో!"

"ఏం అడిగాడేవిటి?" అన్నాడు సారధి నవ్వి.



గుమాస్తా ఫోనులో యజమానితో:
"చిత్తం....లేదండి.... ఆఫీసులో జులుబుచెయ్యనివాణ్ణి నేనొక్కణ్ణే నండి. అందుకనే సెలవుపెట్టేశానండి."

"చాలా అడిగాడులే. అంతా నీకు 'ఫర్'గానే చెప్పాను. చివరికి సావిత్రిగారి సంగతికూడా అడిగాడు" అన్నాడు మూర్తి.

"దానిసంగతెందుకు?"

"నీకూ వాళ్ళకీ ఉన్న చుట్టరికం సంగతోయ్! ఏమీలేదు. ఇద్దరిదీ వొక్కకాకు కూడా కాదనిచెప్పాను. అదిసరేగాని సారధీ! వొక్కమాట అడుగుతాను చెబుతావా?" అన్నాడు మూర్తి.

"అడుగు."

"మా సావిత్రి మా సావిత్రని చెప్పుకుంటావుకదా? ఇట్లా వాళ్ళ సంబంధమేదో చూడకపోతే ఆ పిల్లనే చేసుకోరాదుటోయ్! కాకాంతరంఅని మీ నాన్న వొప్పుకోడనా?"

సారధి విర్ఘాంతపోయాడు.

"బానోయ్!....ఇంతదాకా వొచ్చింది గనక చెబుతున్నాను. ఊళ్ళో అందరూ అదే అనుకుంటున్నారు. ఆ అమ్మాయి కేవిటి తక్కువ? అసలీ సంగతి మీ అమ్మగారికన్నా తట్టలేదా?"

"ఊళ్లో అంతా అనుకుంటున్నారా?" అన్నాడు సారధి తడారిపోయిన గొంతుతో.

"ఆ....సుబ్రహ్మణ్యంకూడా అదే అడిగాడు. మీ యిద్దరూ బాగా స్నేహంగా ఉంటారనిమాత్రం చెప్పాను."

సారధి రాయిలాగా వొక్కక్షణం కూచుని "వొస్తాను బ్రదర్" అని వడివడిగా వీధిలోకి వొచ్చేశాడు.

సారధి రోడ్‌మీదికి వొచ్చేసరికి అప్పుడే రిక్షా దిగిన సావిత్రి యెదురువొచ్చింది. ఆమెను చూడంగానే చటుక్కున మొహం తిప్పుకున్నాడు అతను. బొద్దుటివరకూ ఆమె మీద తన మనసులో పొంగిపొరలిన నిష్కల్మషమయిన వాత్సల్యం విరిగిపోయినట్టూ. తనేదో తప్పుచేసినట్టూ అనుభూతి చెందసాగాడతను. సావిత్రి "బావా" అని కేకవేసి నప్పుడుకూడా నిలబడ్డాడేగాని ఆమెవంక చూడలేకపోయాడతను.

"అలా ఉన్నావేమిటి బావా?" అన్నది సావిత్రి.

తానున్నది రోడ్‌మీద అన్న స్పృహ రాగా, అతను ఉద్వేగాన్ని అణుచుకుని "పద సినిమాకు పోదాం" అన్నాడు.

"నాకు ఆకలేస్తోంది. ఏదన్నా తిని పోదాం."

సారధి చిరాగ్గా "ఇంటిదగ్గర తినిరాలేదూ?....పద" అన్నాడు.

సావిత్రి కేవురించిన ముఖంతో "పోనీ వొద్దులే" అన్నది.

సారధి "బతిమాలించుకోవాలా? పద" అన్నాడు.

సావిత్రి అతని వెనక కాంటీన్‌లోకి వెళ్ళింది. నాలుగుసార్లు సర్వర్ వొచ్చి ఏం కావాలిసార్ అని అడిగి వెళ్లాక ఐదోసారి వొచ్చినప్పుడు "ఆవిడ కేంకావాలో యియ్యి" అన్నాడు సారధి. సావిత్రి ముభావంగా ఊరుకోవటంతో తానే ఏం కావాలో తెప్పించాడు సారధి. కాంటీన్‌లోంచి బైటికివొచ్చాక "ఇంటికిపోదామా?" అన్నది సావిత్రి.

"సినిమా వొద్దా?"

"ఎందుకులే?"

సారధి అప్పటికి శాన్త తెప్పరిల్లాడు. అతనికి మంచీ, చెడూ నిర్ణయించుకోగల



శక్తి లేకపోలేదు. ఐతే మూర్తి అన్న మాటలవల్ల కలిగిన ఆ అలజడి అతన్ని తాత్కాలికంగా కంపింపచేసింది. ఆ అలజడి ఉపశమించటంతో అతను మామూలు మనిషై "కోపం వొచ్చిందా సావిత్రీ? పద సినిమాకు పోదాం" అన్నాడు.

సినిమాలోకూడా యెక్కువగా మాట్లాడలేదు సావిత్రి. ఇంటినించి బయలుదేరేటప్పుడు అతనితో ఏవేవో చాలామాట్లాడాలని బయల్దేరిందామె. కొట్టుకున్నా, తిట్టుకున్నా తనకోసం అతనూ, అతనికోసం తానూ పుట్టినట్టుగా మెలిగారు - పెరిగారు. అతనికి పెళ్ళికావటం కంటే తనకి సంతోషకరమైన విషయం ఏమీలేదు. పైగా రాజారావుగారి పిల్లకూడా చిదిపిదీపంపెట్టుకునేట్టువుంటుంది. సినిమా యింటర్వెల్ ఐపోయాక సావిత్రి

మెల్లిగా అడిగింది. ''ఏంజరిగింది, బావా?'' అని. సారధికి అసంగతంతా ఎట్లాచెప్పాలో పోపట్టాన తట్టలేదు. చి వ రి కి మజిలీలు మజిలీలుగా ''జరిగిందంతా చెప్పి నే నిప్పుడే వొస్తాను'' అని బైటకి వెళ్ళిపోయాడు.

● ● ●

ఆతర్వాత నాలుగైదు రో జు ల దా కా సావిత్రి, సారధి కలుసుకోలేదు. మాట్లాడు లేదు. గిల్లి క జ్జా ల తో పసిపిల్లల్లా అల్లరి చేస్తూండే వాళ్ళిద్దరూ గంభీరముద్ర ధరించి, తప్పించుకు తిరగటం మొదటిసారిగా గమ నించింది రుక్మిణమ్మ. ఆవిడ కెంత ఆలో చించినా ఈ మిస్టరీ అం తు ప ట్ట లే దు. 'వొదిన' కేమన్నా తెలుసేమోనన్న ఉద్దే శ్యంతో సుభద్రమ్మని కదలేసింది. ఆవిడా వెర్రిమొహమే వేసింది. చివరికి సావిత్రినీ, సారధినీ అడిగి తేల్చుకోవటానికే నిశ్చ యం చేసుకున్నారు యిద్దరూను.

సావిత్రి తల్లి ఎంత అడిగినా మనసులో మాట చెప్పలేక పోయింది. అం దు లో చెప్పేందుకుమాత్రం ఏముంది? కాని రుక్మి ణమ్మ అలా వొదిలి పెట్టేరకం కాకపోవ టాన చివరికి కళ్ళ నీళ్ళతో జరిగిందంతా చెప్పింది. రుక్మిణమ్మ ముఖం దమ్మిడీ అంత ఐ పోయింది. ఎంత అప్రదిష్ట?

కొడుకునించి ఆరా తియ్యటానికి ప్రయ త్నించి పరాజయంపొందిన సుభద్రమ్మకి, రుక్మిణమ్మకూడా తననించి తప్పుకు తప్పుకు తిరగటం మరో మిష్టరీఐంది. చివరికి ఆవిడ తన మనసులోదంతా భర్తదగ్గిర వెళ్ళబోసు కుంది. ముకుందరామయ్య నరసింహంతో వెళ్ళబోసుకున్నాడు.

ఆ రో జు మామూలుగా ఆఫీసునించి యింటికి వొచ్చిన సారధి యింట్లో అంతా అదోరకంగా ఉండటమూ, వొకళ్ళ నొకళ్ళు దొంగల్లాగా చూసుకోవటమూ, ముసిముసిగా నవ్వుకోవటమూ గ మ నిం చి అయోమ యంలోపడి తన గదిలోకి వెళ్ళిపోయాడు. బట్టలు విప్పుతుండగా బల్లమీదవున్న కార్డు అతనికంటపడింది. రాత అపరిచితమైందిగా కనిపించి ఉత్తరం అందుకుని కిటికీదగ్గిరకి వెళ్ళాడు. ఆ ఉత్తరం తె నా లి నుం చి వొచ్చింది. మామూలు మాటలు ఐనాక.... "మీ సంప్రదాయానికి మా సంప్రదాయానికి కుదరదనిపించినందున మీ సం బం ధం మేము వొదులుకుంటున్నాము ...'' అని ఉన్నది. సారధిముఖాన కత్తివేటుకి నెత్తురు లేకుండాపోయింది. ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపి బైటకివిసిరేసి బోబోతూ పెరటిలో నిలబడివున్న సా వి త్రి ని చూసి ఆగిపోయాడు.

సావిత్రి చిన్నగా నవ్వి తలదించుకుంది. సిగ్గుపడుతూ. అప్పటికిగాని అతని మనస్సు కుదుటపడలేదు. □□□

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటినిత్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపు లను జతచేసి పంపించాలని మనవి. రచన నతో పాటు కాక తరువాత స్టాంపులు పంప వద్దని, అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

సంప్రదాయాలు

ఎమ్. సీతాగోపాల్



''రాజూ''

''అమ్మా''

''ఇవాళ బావ వస్తాడట స్టేషన్ కి వెళ్లాలి.''

''నాకు వీలవదమ్మా''

''సరే నీ యిష్టం'' అంటూ నిట్టూర్చింది రాజేశ్వరమ్మ.

చిన్నపాలేరు సోముల్ని పిల్చి బండి కట్టమని సిద్ధమై తనే స్టేషన్‌కి వెళ్ళింది.

అల్లుడు వస్తూంటే వుండవలసిన సంతోషం ఆమె ముఖంలో కన్పించదు. అవును ఎలావుంటుంది? చక్కగా కూతురుతో, కళకళలాడే సంసారంతోవస్తే ఆనందంగాని? పాలేరుని బండి ఏసమయానికి వస్తుందో ఎంతాలస్యంగా వస్తుందో కనుక్కోరమ్మంది.

"అరగంట ఆలీశమవుద్దిటమ్మగోరూ" అని జవాబుచెప్పాడు సోములు. "బండి రాగానే ర"మ్మని పంపేసింది. ప్రయాణీకులకై ఏర్పరచబడిన బెంచీపై కూర్చుంది రాజేశ్వరమ్మ. రైలువస్తే అమ్మకం కోసం ఎదురుచూస్తున్న కిళ్ళీబడ్డీవాడు, కూలీలు చెదురుబదురుగావున్న ప్రయాణీకులను చూసింది. తనకు తెలిసినవారెవరూ లేరక్కడ. ఎంత నివారిద్దామన్నా వీలు కాకుండా ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

రాజేశ్వరమ్మకి ఇద్దరు కొడుకులు. ఒక్కత్తే కూతురు. రాజు పెద్దవాడు. తర్వాత మూడేళ్ళకు పార్వతి పుట్టింది. పార్వతి తర్వాత చాలాకాలానికి ప్రకాశం పుట్టాడు. రాజేశ్వరమ్మ భర్త యోగానందం స్థితిమంతుడవడంవల్ల, పార్వతి ఒక్కత్తే కుమార్తె అవడంవల్ల పార్వతి అన్నగారి గారాబంతోనూ, తమ్ముడితో చిలిపి తగూ లేసుకుంటూను పెరిగి పెద్దదయింది.

పార్వతి చక్కనిపిల్ల. పచ్చటి నుదుటి మీద తుమ్మెదల్లా ముసిరే ముంగురులు చూస్తూంటే ఎవరికైనా సవరించబుద్దేస్తుంది. విశాలమైన సోగకళ్ల చూస్తూంటే ఆకళ్ళలో తమ ప్రతిబింబం చూసుకోవాలన్న కోర్కె కలుగకమానదు. సూదైన శిరీష పుష్పం లాంటి ముక్కు. రెండు దొంగవళ్ళు పేర్చారా అనిపించే చిన్ననోరు. నవ్వితే బుగ్గమీద సొట్టతోపాటు తళుక్కుమనే తెల్లని పలువరుస. సన్నని నాజూకైన బుజాలవంపు యౌవనశోభతో పార్వతి చూవరులకు కనువిందొనరిస్తూండేది. అందంగా, చలాకీగా, తెలివిగా వుండే చెల్లెలంటే రాజుకి అంతులేని అపేక్ష. పార్వతికి అన్నయ్యంటే గౌరవం, ఆదరం. ప్రకాశం చిన్నవాడు: అక్కని విడిచి ఒక్కక్షణం వుండేవాడు గాదు.

ముత్యాల్లాంటి ముగ్గురు బిడ్డల్ని చూసుకుని మురిసిపోయేవారు తల్లిదండ్రులు. చూడ ముచ్చటగావుండేది రాజేశ్వరమ్మ సంసారం. పెళ్లీడు వచ్చిందని, తగినవరుడికై ప్రయత్నం చేయమని పోరేది రాజేశ్వరమ్మ. "వస్తాడులేవే అల్లుడు. నిన్ను వెతుక్కుంటూ నేను రాలే? అలాగే మన బంగారుతల్లికోసం యెవడు పూజ చేశాడో?" అనే వారాయన గర్వంగాను పరిహాసంగాను. బంగారు కలాశ లాంటి కూతుర్ని చూస్తే ఆయనకు అంతులేని వాత్సల్యం. భర్త అలా అనగానే తన పెళ్ళి వుదంతంగుర్తువస్తుంది రాజేశ్వరమ్మకి. యోగానందం స్నేహితుడు పరమశివంతో కలిసి వచ్చాడు ఆవూరికి. తలవని తలంపుగా ఆయన రాజేశ్వరమ్మను చూశారు. ఎన్ని సంబంధాలు వచ్చినా కాలదన్ని రాజేశ్వరినే చేసుకున్నారాయన. తాముతెచ్చిన సంబంధంతిరక్కొట్టి రాజేశ్వరిని చేసుకున్నందుకు కొంతకాలం గునిసినా దీపంలాగా వుండేకోడలు నట్టింట తిరుగుతూండేసరికి



కొడుకు చక్కని గుణవంతురాలైన కోడల్నే ఎంచుకున్నందుకు తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. రాజేశ్వరమ్మ అత్తయ్యాఅంటూ అత్తగార్ని క్షణమైనా విడిచిపెట్టేదికాదు. తీరికసమయాల్లో అత్తా కోడళ్ళిద్దరేకమై కబుర్లుచెప్పుకునేవాళ్ళు. ఆ సమయంలో యోగానందం పిలిచినా రాజేశ్వరమ్మ పలికేదిగాదు. ఆమె వంటరిగా చిక్కినప్పుడు "రాణీగారికి అత్తగారి గారం ఎక్కువై ఈ దీనుని పిలుపే చెవికెక్కడం లేదే" అని పరిహాసమాడేవాడు. ఇవన్నీ గుర్తువచ్చి రాజేశ్వరమ్మ మొహంమీద చిరునవ్వు వెలిసేది. నునుసిగ్గుకళ్ళలో తొంగిచూసేది. "సర్లెండి. మన పెళ్ళి సంగతులిప్పుడెందుకు? పార్వతి పెళ్ళి సంగతి చూడండి. ఏ వయస్సు ముచ్చట్లు ఆ వయసులోనే జరగా" లంటూ వెళ్ళిపోయేది.

యోగానందంగారు వరునికై అన్వేషణ ప్రారంభించారు. ఎంతమందిని చూసినా తన కూతురికి ఈడుజోడైన అందమైన యువకుడు కన్పించలేదు. ఒక రోజు యోగానందం చిరుఎండలో పచారుచేస్తూండగా చిన్ననాటి స్నేహితుడు పరమశివం, అతని అన్నగారు శివరామయ్య కుమారుడు రాజశేఖరం వచ్చారు. అందరిని సగౌరవంగా ఆహ్వానించారు సరదాగా గడిపేవారు యోగానందం, ఆయన అతిథులూనూ. రాజశేఖరానికి ఏమీతోచేదికాదు. పెద్దవాళ్ళ ధోరణి వేరుగావుండేది. తనతో మాట్లాడే రాజు ఏదైనా పనిలోవుంటే అసలు తోచేది కాదు. చిన్నవాడు ప్రకాశంతో ఏం కబుర్లు చెబుతాడు?

9

మేష్టారు: "ఏమిట్రా, ఈ అంకె వెయ్యడం? ఈ నాలుగుచూడు? తొమ్మిదిలా వుంది."

కుర్రాడు : "అది తొమ్మిదేనండి."

మేష్టారు : "ఇది తొమ్మిదా? సరిగ్గా నాలుగులావుంది."

సాయంత్రం తోటలోకి వెళ్ళాడు శేఖరం. పొన్నచెట్టుక్రింద బండమీద కూర్చుని జాజులు గుచ్చుకుంటోంది పార్వతి. వేరే ధ్యానంలోవున్న పార్వతి శేఖరం రాకను గమనించలేదు. ఆ భంగిమలోనున్న పార్వతిని ఎంతచూసినా తనివి తీరలేదు శేఖరానికి.

ఏకాంతంలో నున్న పార్వతితో మాట్లాడాలనిపించి గొంతు సవరించుకున్నాడు. ఆ శబ్దానికి వెనుతిరిగిచూసిన పార్వతి బెదిరిన హరిణంలాగా మాల నక్కడే వదలివేసి రివ్వున పారిపోయింది. పార్వతి శేఖరాన్ని అసలు చూడకపోలేదు. ఏకాంతంలో ఈ అపరిచిత యువకుని చూడగానే, ఏదో సిగ్గు, బెరుకు ఆమెను పారిపోయేలా చేశాయి. ఒకరకంగా చూస్తే ఇది పెద్దవాళ్ళు చేసిన తతంగమేమో ననిపిస్తుంది. ఆమె వదిలేసిన

మాలతీసుతుని యింట్లోకినడిచాడు శేఖరం. రాజుకి విద్యావంతుడు. సుగుణవంతుడైన శేఖరమంటే మంచి అభిప్రాయంఏర్పడింది. యోగానందం శేఖర్ వినయవిధేయతలకు ముచ్చటపడ్డారు. చుట్టంచూపుగా వచ్చిన వాళ్లీ సంబంధం స్థిరంచేసుకునివెళ్ళారు. రాజా పార్వతిని తెగవుడికించేవాడు. శేఖరం పేరుచెపుతే పార్వతి బుగ్గలు కందిపోయేవి. తనువు పులకెత్తేది. ఏవేవో వూహించుకుని తన్మయమొందేది. ప్రకాశానికి అందమైన బావమీదే ధ్యాసంతా.

చాలా వైభవంగా వివాహం జరిగింది. యోగానందం అల్లుడికి తగురీతిగా కట్నం. కానుకలు చదివించారు. పార్వతికి పుట్టింటి కట్నంకింద పొలం యిచ్చారు. అంతులేని వెండిసామాను. నగలు వచ్చాయి బహుమానరూపంగా. ఆరోజు తొలిరేయి. శేఖర్ మనస్సులో అంతులేని అనందం. పార్వతికి సంకోచం సిగ్గు. అన్ని వేడుకలూ ముగిశాక దంపతులిద్దరూ ఏకాంతంలో మిగిలారు. శేఖర్ స్పర్శ మధురాతి మధురమై ఆనంద ప్రవాహంలో తేలియాడింది పార్వతి. అందచందాలలో వారిద్దరూ రతీమన్మధులనే మరపించారు.

తర్వాత పార్వతి కాపురానికి వెళ్ళింది. పార్వతికి అత్తగారులేదు. అంత యింట్లో తనూ, భర్త - మామగారూ కొంతమంది నౌకర్లూ, వంటపనిచేసేందుకు కనకమ్మా తప్ప వేరెవ్వరూలేరు. పార్వతి సాహచర్యంలో శేఖర్‌కి రోజులు క్షణాల్లాగా గడిచిపోయేవి. శేఖర్‌కి కనపడని క్షణం పార్వతికి యుగంగా తోచేది. అసలేమీ కాలక్షేపం వుండేదికాదు. తీరిక సమయాల్లో పార్వతిని వీణ వాయించమనీ. పాట పాడమనీ వేధించేవాడు శేఖరం. మురిపించుకుని పాడేది పార్వతి.


ఎప్పుడూ పూలరెమ్మల్లే చకాచకా ఇంట్లో తిరిగే పార్వతి ఆనాడు ఎంతకీ లేవలేదు. శేఖరం ఆదుర్దాగా పార్వతి మంచందగ్గరకు వెళ్ళి అడిగాడు ,సంగతేమిటని? పార్వతికి ఏం చెప్పాలో తోచక తలనెప్పి. వికారంగా వుందని చెప్పింది. తన తల్లితండ్రులను చూడాలనిపిస్తోందని చెప్పింది. పార్వతికి కులాసా లేకపోవడానికీ తల్లి తండ్రులను పిలిపించమనటానికి గల సంబంధం శేఖరానికి అర్ధంగాలేదు. కాఫీ యివ్వడానికి వచ్చిన కనకమ్మ "రాజబాబూ! అమ్మాయికి ఒంట్లో కులాసా లేదు. ఎండలో తోటలో దొడ్లలో తిప్పద్దు" అంటూ పార్వతిని సమీపించి "తల్లీ! కాస్త కాఫీతాగు తావా! పోనీ కొంచెం ఫలహారం చెయ్యి. ఏమీ తినకపోతే మరీ నీరసించిపోతా"వంటూ బ్రతిమాలింది.

అంతా అయోమయంగా తోచింది శేఖరానికి. పార్వతి తేచివెళ్ళింది ముఖంకడుక్కోడానికి. పార్వతి నడకలో మునుపటి వయ్యారంలేదు. ముఖంలో ఏదో వింత కాంతి. మెరుపు కనిపిస్తున్నాయి. కనకమ్మకి శివరామయ్య దగ్గిర కొంచెం చనువు తక్కువైనా, ఇంటికి ఆడదిక్కు ఆవిడేకనుక పార్వతి గర్భవతిగా నున్నసంగతి తెలియజేసింది. బోసిగావున్న ఇంట్లోకి కిలకిలలాడే మనుమడు వస్తాడన్న సమాచారం ఆయనకి చాలా ఆనందాన్ని కలుగజేసింది. శేఖర్ వచ్చి పార్వతి తల్లిదండ్రులను పిలిపించమంటోందని చెప్పాడు. "అవును బాబూ! ఈ సమయంలో ప్రతి ఆడపిల్లా తల్లిదగ్గర వుండాలని కోరుకుంటుంది. ఇవాళే మనిషిని పంపుతా"నన్నారాయన. శేఖరంఆశ్చర్యంగా చూడ్డం గమనించి "నాకు మనుమడు పుట్టబోతున్నాడురా" అన్నాడు.

ఆనందంలో ఆ అన్నమాటతప్ప వేరేమీ అతనినోట వెలువడలేదు. శేఖరం పరుగున పార్వతిదగ్గరచేరి "దొంగపిల్లా! ఇంతచక్కని శుభవార్త దాచిపెట్టి నా దగ్గర తలనెప్పని చెపుతావా. చూడు నీ కేం శిక్షవిధిస్తానో" అంటూ ఆమెను మాణిక్యవీణలా వాళ్ళో వేసుకుని ప్రేమధారలలో ముంచేశాడు. సిగ్గుతో నోరువిప్పలేదు పార్వతి.

యోగానందం. రాజేశ్వరమ్మా వచ్చి పార్వతిని పుట్టింటికి తీసుకెళ్ళారు. శేఖరానికి పార్వతినివదిలి వుండాలనిపించలేదు. ఏదైనాఅంటే ఎగతాళిచేస్తారేమోనని వూరుకున్నాడు. తరచూ వచ్చి చూస్తూంటానని ప్రమాణం చేశాడు పార్వతికి. రాజా వేళాకోళానికి అంతులేదు. "ఏమే పారూ - నీకూ మగకుర్ర పుడితే నాకిస్తావా" అనేవాడు. అన్న అంటున్నాడు గదా అని బదేళ్ళ ప్రకాశంకూడా "నాకిస్తావా" అనేవాడు.

తొమ్మిది నెలలు నిండాయి. ఒకానొక ఉదయాన కూతుర్ని కన్నది పార్వతి. మనుమడే పుడతాడనుకున్న శివరామయ్య అందంగా ఆరోగ్యంగావున్న మనుమరాల్ని చూసి మురిసిపోయేవారు. ప్రసవమైన రెండోరోజున పురిటి సంధివచ్చి తనని ప్రాణంగా చూసుకుంటున్న ప్రియవరివారాన్ని విడిచి మరో లోకానికి వెళ్ళిపోయింది పార్వతి. అయింట్లో శోకదేవత తాండవ మాడింది. రాజు ఏడుపుకి అంతేలేదు. అంతవరకు చెల్లెలికూతుర్ని చూసి మురిసిన రాజు పసిపిల్ల ఏడుపు విన్పిస్తే చాలు విసుక్కునేవాడు. బంగారంలాంటి నాచెల్లెల్ని మింగావే అని చీదరించుకునే



స్టేజీ వెనకాల, ఒక నటుడు డ్రామా కంట్రాక్టరుదగ్గిరి కొచ్చి: "కొంప మునిగిందండోయ్. ఆఖరిసీను జరుగుతోంది. హీరో, విలను యుద్ధం చేస్తున్నారు. మీరు వెంటనే పాతబాకీ చెల్లించకపోతే చావ నంటున్నాడు విలన్."

వాడు. అన్నీ తెలిసినరాజు కూడా చెల్లెలి మరణానికి పసిపిల్లే కారణమనేవాడు.

కూతురి చావు తిరుగులేని దెబ్బ గా వారిని బాధిస్తున్నా మనవరాలి పెంపకంలో లోటు చేసేవారుకాదు. రాజుకి ఆ పసిపిల్ల యింట్లో వుండడమే యిష్టంలేదు. శేఖరం ''పారూ! ఈ చిన్నదాన్ని అనంతమైన ఈ లోకంలో వదిలి నన్నన్యాయం చేసి వెళ్ళి పోయావా" అని చాటుగా ఏడ్చే వాడు. పార్వతిలేని యిల్లు దీపంలేని గూడులా వుందనీ పిల్లని తెస్తే మనశ్శాంతి వుంటుం దని అత్త మామల్ని వొప్పించి రెండేళ్ళ కూతుర్ని తెచ్చేశాడు. రాజు ఏదో భారం తగ్గిన వాడిలా హాయిగా వూపిరిపీల్చాడు. ప్రకాశానికి పాపవెళ్లాక అల్లరి తగ్గి పోయింది.

పార్వతి కోర్కె ప్రకారం విద్యావతి అనే పిల్చేవాడు శేఖరం పాపని విద్య ఆట పాటలలో కిలకిలనవ్వులతో కొంతబాధని మరువగలిగాడు. అన్నివేళలా కనకమ్మ విద్యని కనిపెట్టుకునివుండి తల్లిలా గే పెంచింది. విద్యకి ఐదు సంవత్సరాలు నిండాయి. విద్యాభ్యాసం చేయించాలని ఘన మైన ఏర్పాట్లుచేశారు శివరామయ్యగారు. పిలువందుకుని రాజేశ్వరమ్మ, యోగానందం, ప్రకాశం వచ్చారు. రాజు ససేమిరా రాను పొమ్మన్నాడు. అయ్యవారు రావడం, అక్ష రాలు దిద్దబెట్టడం, పిల్లలకి మిఠాయిలు, పలకా బలపాలూ పంచడం జరిగాయి. విందుకూడా గొప్పగా జరిగింది.


ఆనాడు హాల్లో కూర్చుని అందరితో కబుర్లాడుతున్న శివరామయ్య అమ్మా అంటూ గుండెమీద చెయ్యేసుకుని అలాగే వొరిగిపోయాడు. ఆనందోత్సాహాలతో మారుమోగుతున్న యిల్లు ఏడుపులతో నిండింది. పట్టుపరికిణీ రెపరెపమంటూంటే "అక్షరాలు చూడంటూ" వచ్చింది విద్య. "ఇంకెక్కడి తాతయ్యమ్మా" అంటూ గొల్లు మన్నాడు శేఖరం. ఆ చిన్నిహృదయానికి తాతయ్య లేడనే సంగతి కొంతవరకు బోధ పడింది. ఏడ్చి రాగాలుపెట్టింది. తాతయ్యతో నేనూ పోతానంటూ ఎంతమందిపట్టుకున్నా ఆగలేదు. సంతోషంగా వచ్చిన యోగానందం దంపతులు విచారంతో వెనక్కు మళ్లారు.

అంతా తెలుసుకున్న రాజు "నాకు తెలుసు! అది అందర్నీ మింగడానికే పుట్టింది. పుట్టగానే నా బంగారు చెల్లిని పొట్టనబెట్టుకుంది. అక్షరాభ్యాసం నాడు తాతయ్యని మింగింది. ఇంకా యెంతమందిని భక్షిస్తుందో మహా తల్లి" అన్నాడు ఏవగింపుగా. అతని కంఠం దుఃఖంతో పూడిపోయింది చెల్లెలితలపుతో.

"ఊరుకో నాయనా! అవేంమాటలు. నువ్వే అలా అంటే లోకులసంగతిచెప్పాలా వేరే! అది పసిపిల్ల. అదేం చేసిందికనుక! నాతల్లిని చూసుకునే అదృష్టం నాకు లేక పోయింది. దానిదారి అది చూసుకుం"దని వెక్కి వెక్కి ఏడ్చింది రాజేశ్వరమ్మ.

అంతా వింటున్న ప్రకాశం చిన్న హృదయంలో విద్యంటే ఏదోజాలికలిగింది. విద్యకన్నా ప్రకాశం ఆరేళ్ళు పెద్దవాడు. ఆ రోక్లాసు చదువుతూండేవాడు. అప్పు డప్పుడూ రాజేశ్వరమ్మే వెళ్ళి విద్యను పిలుచుకొచ్చేది. లేదా శేఖరమే విద్యని అమ్మమ్మగారింట్లో దింపేవాడు. ఎంతో స్నేహంగా వుండే రాజు ముభావంగావుండే వాడు శేఖరంతో. అందుకే అత్తగారింట్లో వుండాలన్పించేదికాదు శేఖరానికి. రాజుకి విద్యంటే నిరసనే - అసలు పలకరించే వాడుకాదు. "పెద్ద మామయ్య నాతోమాట్లా డడేం అమ్మమ్మా" అనడిగేది విద్య అమా యకంగా. అవిదేం చెప్పగలదు కనుక! ప్రకాశం విద్య చదువు సంధ్యలను గూర్చి కనుక్కునేవాడు. తోటల్లోకి షికార్లు తిప్పే వాడు.

కొంతకాలానికి రాజుకు వివాహమైంది. పెళ్ళికి విద్యని పంపలేదు శేఖరం. రాజు భార్య రమణి కాపరానికి వచ్చింది. అప్ప టికి రమణికి పందొమ్మిదేళ్ళు. విద్యకి పద్నాలుగు. తనభార్య, విద్య కలిసిమెలిసి తిరగడం యిష్టంగావుండేదికాదు రాజుకి. ఎప్పుడైనా రమణి, విద్య నవ్వుకుంటూ కబుర్లుచెప్పుకుంటే రాజు చిటపటలాడేవాడు. ఒకసారి రమణి అడిగింది సంగతేమిటని. అన్ని తెలుసుకున్న తర్వాత విద్యంటే ఆపేక్ష ఎక్కువయింది రమణికి. రాజు విద్యని మా యింటి దేవతను మింగిన మహంకాళి అని చీదరించుకోవడం నచ్చ లేదు రమణికి. ఎదురుచెప్పే ధైర్యంలేక వూరుకున్నది రమణి.



ఆనాడు విద్యపుట్టినరోజు. తలంటిపోసి. కొత్తబట్టలు కట్టబెట్టింది రాజేశ్వరమ్మ. ఆ సందర్భంగా ఏ వేడుకలూ జరుగరాదని పట్టుపట్టాడు రాజు. చేసేదిలేక వూరుకుంది రాజేశ్వరమ్మ. మర్నాడు వ్యక్తురాలయింది విద్య. ఉన్న ఒక్క ఆడపిల్లకీ ముచ్చట్లు జరపకపోవట మేమిటని రాజు ఎంత పంత గించినా వినకుండా పేరంటం జరిపింది. నాల్గోనాడు బంతి ఏర్పాటుచేసింది. తోటి పిల్లల ఎగతాళికి తట్టుకోలేకపోతోంది విద్య. అందర్నీ మందలించింది నవ్వులాటగా రాజేశ్వరమ్మ.

ఇప్పుడు పార్వతిలాగే వున్నది విద్య. పచ్చి కాటాకుకోసం తోపుకెళ్ళిన యోగానందంగారిని కోడెతాచు కాటేసింది. చుట్టూ పనిచేస్తున్న పాలేర్లు చేతులమీద యోగానందంగార్ని యిల్లుచేర్చారు. మంత్ర తంత్రాలు ముగిసేలోగానే దాటిపోయారు యోగానందంగారు. బంతికోసం జరిగే ఏర్పాట్లు శ్రాద్ధంకోస మయ్యాయి. రాజేశ్వరమ్మకు తెలివేలేదు. రమణి పరిచర్య చేస్తోంది అత్తగారికి. రాజు పిచ్చెక్కినవాడికి మల్లే "చెబితే విన్నావా అమ్మా! దాన్ని పిల్చుకొచ్చి ఇంట్లో వుంచావు. వద్దన్నా వినకుండా వేడుకలన్నావు. కన్న తల్లినీ తాతయ్యలిద్దర్నీ ఇలాగే పొట్టనబెట్టుకుంది చండిక. దాన్నిప్పటికైనా వదిలించు. లేకపోతే ఇంకా ఎంతమంది కావాల్సివస్తారో దాని ఆకలి తీర్చడానిక"ని కేకలువేశాడు రాజు. ప్రకాశం అన్నకి నచ్చచెప్పాలని చూశాడు. దాంతో రాజు యింకా పేట్రేగిపోయాడు. ఎలాగో కర్మకాండ పూర్తి చేశాడు రాజు.

అన్నీ విన్న విద్యగుండెల్లో శూలాలు గుచ్చినట్లయింది. తనవల్లనా యింతమంది చనిపోయింది! అందుకే నేనంటే పెద్ద మామయ్యకి ఇష్టంలేదు కాబోలనుకున్నది విద్య. ఏడుపుల్లో విద్య సంగతెవరూ పట్టించుకోలేదు. ప్రకాశం జాగ్రత్తగా వున్నాడు. విద్య మునుపటిలాగా చిన్నపిల్ల కాదు. జ్ఞానంతెల్సినపిల్ల. అన్నీవిన్నది. ఏం అఘాయిత్యం చేసుకుంటుందోనని.

ఎవ్వరూలేనిచోట కూర్చుని ఆలోచిస్తోంది విద్య. అవును తనెందుకు బ్రతికివుండాలి ఇప్పటికే తన నష్టజాతకంవల్ల కుటుంబంలో ముఖ్యమైనవాళ్ళు మరణించారు. తన్నందరూ మహమ్మారిలా చూస్తున్నారు. ఇంతకన్నా చావడం మేలనుకున్నది. మెల్లిగా లేచి తోటలో మోటబావిదగ్గరకు చేరింది. లోతైనబావి. నీళ్ళు చూస్తూంటే గుండె జల్లుమని వెనక్కుతిరిగింది. మళ్ళీ రాజు మాటలు చెవుల్లో రింగుమన్నాయి.

ఇక్కడ ప్రకాశం విద్యకోసం చూస్తే యింట్లో కనపడలేదు. తల్లి నడిగితే తెలీదన్నది. రాజు "పీడా వదిలింది గ్రహం" అని విసుక్కున్నాడు. రమణి మరిదితో "ఇందాక తోటలోకి వెళ్ళింది. చీకటిపడింది. ఏమో! బాబూ పిల్చుకురా" అంటూ బ్రతిమాలింది. తోట, ఒక్కర్తె అన్నపదం వినపడగానే రివ్వున బావిదగ్గరకు వెళ్ళాడు. ప్రకాశం.

అప్పటికే విద్య నీళ్ళలో దూకేసింది. "విద్యా యెంతపని చేశా"వంటూ తనూ దూకాడు ప్రకాశం. అరుపులూ, శబ్దం వినపడి పనివాళ్ళుబావిదగ్గరికివచ్చారు. చిన్నప్పట్నుంచీ ఈతల్లో ఆరితేరిన ప్రకాశం తెలివిగానేవున్నాడు. భయపడిన విద్యకి స్పృహ తప్పింది. ఎలాగో యిల్లుచేరారు. "మీరందరూ కలిసి దాని పసి మనసు విరిచేశారు. అది యెంత కష్టపెట్టుకోకపోతే ఆత్మహత్యకి పూనుకుంటుంది? అక్కయ్యా, మామయ్యగారు, నాన్న పోవడానికి అదేనా కారణం? ఏళ్ళు రాంగానే సరా? వివేకం లేకపోయాక! ఇకనైనా దాన్ని సరిగ్గా చూడండి" ఆనిరూక్షంగా అన్నవంక చూసి లోపలికి పోయాడు దుస్తులు మార్చుకోడం కోసం.

బట్టలు మార్చి తల తుడిచింది రమణి. వేడివిప్పులలో సాంబ్రాణి వేసి తల ఆరపెట్టింది రాజేశ్వరమ్మ. రాజు "విద్యా! నిన్నెన్ని మాటలన్నాను తల్లీ! నిజంగా యివ్వాళ నువ్వే చచ్చిపోయివుంటే చెల్లి నన్నెంత శపించేదో గదా! నా అజ్ఞానం మన్నించమ్మా" అన్నాడు విద్య నుదుటి మీద చెయ్యివేసి. రాజువంక ఆశ్చర్యంగా ఆనందంగా చూసింది రమణి. కొంతసేపటికి తెలివి వచ్చిన విద్య భోరుమని ఏడ్చేసింది.

మామగారి చావు తెలిసి వచ్చిన శేఖరం యివన్నీవిని "మనం ఇక్కడవుండద్దు తల్లీ, పార్వతిజీవితానికి ప్రతిబింబంగా నిన్నుచూసుకుంటున్నాను. నువ్వూ నన్నన్యాయం చేసిపోతావా" అన్నాడు. "నాన్నా" అంటూ తండ్రిమీద వాలిపోయింది విద్య. ఆతర్వాత విద్య, శేఖరం వెళ్ళిపోయారు. కొత్తబట్టలు యిచ్చింది రమణి. "జాగ్రత్తగా చదువుకో విద్యా! అనవసరమైన ఆలోచనలు చెయ్యకు" అన్నాడు ప్రకాశం.

ఇదంతా జరిగి రెండేళ్ళయింది. మళ్ళీ యిప్పుడు వస్తున్నాడు శేఖరం అత్తవారి వూరికి. కూ మనే రైలుకూతతో ఆలోచనల్నుంచితెమిలి బైటపడి రైల్లోంచి దిగుతున్న శేఖరం వైపుగా నడిచింది రాజేశ్వరమ్మ. శేఖరం వెనకాలే దిగిన విద్యను ప్రేమగా కౌగలించుకున్నది. సన్నగావుండే విద్యవొళ్లుచేసి బంగారు బొమ్మల్లేవున్నది పార్వతే మళ్ళీ వచ్చిందాఅన్నంత భ్రమ కలిగించింది. రమణికి విద్యను చూచేసరికి చాలా సంతోషం కల్గింది. రాజు పలకరించి వెళ్ళిపోయాడు పనివుందంటూ.

మరి రెండురోజులకి ప్రకాశం వచ్చాడు పరీక్షలు ముగించుకుని. విరిసిన పువ్వల్లే వున్న విద్యను చూసి ముచ్చటపడ్డాడు ప్రకాశం. సాయంత్రం చల్లగాలికి తోటలో కూర్చుని చదువుకుంటోంది విద్య. అటు వేపుగా వచ్చిన ప్రకాశం విద్యచేతిలోని ఇంగ్లీషు నవలచూసి ఆశ్చర్యపోయాడు. యింగ్లీషు నవలలు అర్థంచేసుకునే జ్ఞానం సంపాదించుకున్నందుకు మనసులో అభినందించాడు విద్యని. వెనుకగా వెళ్ళాడు ఏం చదువుతోందో చూద్దామని. సోమర్సెట్ మామ్ రాసిన "హ్యూమన్ బాండేజ్" చదువుతోంది.

వెనుక పదధ్వనికి వులికిపడి లేచింది విద్య. "కూర్చో విద్యా! భ్రుళ్ళిపడ్డావేం" అన్నాడు ఆమె సరసనే కూర్చుంటూ. విద్యకి ప్రకాశందగ్గర తగినంత చనువుంది. రెండేళ్ళతర్వాత చూస్తున్నందుకు కొంచెం సిగ్గనిపించింది. పైగా ప్రకాశం మునుపులాగా లేడు. చాలా మారిపోయాడు. వయస్సు తెచ్చిన మార్పే అది.

"బావ పెళ్ళిచేస్తానంటున్నాడు నీకు విద్యా" అన్నాడు సూటిగా. "నన్నెవరు చేసుకుంటారు మామయ్యా: నే నందర్నీ

చంపడానికే పుట్టానంటారుగా" అన్నది కన్నీటితో గొంతుపెగల్చుకుని. ఆమె బేలతనానికి కరిగిపోయాడు ప్రకాశం. "అవేం మాటలు విద్యా! నీ పుట్టుకకీ, ఒకరి చావుకీ ఏం సంబంధం వున్నది. చదువుకున్నదానివి. అన్నీ తెలిసినదానివి, అలా బాధపడతావేం" అన్నాడు వోదారుస్తూ. "నన్నెవరయినా జాలిపడి చేబట్టి నాన్న దిగులు తీరిస్తే వాళ్ళకి జన్మంతా ఋణపడి వుంటాను" అన్నది విద్య. "అహా! మాటలు చాలానేర్చావే! ఋణపడి వుండక్కర్లేదులే చక్కగా సంసారం చేసుకుంటూ పిల్లలతో కళకళలాడుతూంటే అదే చా"లన్నాడు ప్రకాశం. సిగ్గుపడింది విద్య. "లే విద్యా పోదాం" అన్నాడామె చేయి పుచ్చుకుని. జల్లుమన్నది విద్య శరీరం. ఇంతకుమునుపెన్నిసార్లు మామయ్య తనను తాకలేదుగనుక! ఇలాంటి మధురసంచలనం ఎన్నడూ రాలేదే అనుకున్నది విద్య.

సంధ్యచీకట్లు అలముకుంటున్నాయి. చెట్లమధ్య చీకటి దట్టంగా వ్యాపించింది. చేతిలోచేయివేసి నడుస్తున్న ప్రకాశం విద్యను తన హృదయంమీదకు చేర్చుకుని బలమైన తన కౌగిలిలో పొదువుకుని "విద్యా! నీ కన్న చక్కనిది. గుణవంతురాలైన అమ్మాయి ఎక్కడైనా వుంటుందా! నిన్ను జారవిడుచుకునేంత అవివేకినిగాను. నువ్వు నాదానివే" నన్నాడు. మొదట విద్య కంగారుపడినా బలమైన బాహువులు తనకి అభయమిస్తున్నట్లుగా తోచేసరికి అందులోని హాయి, నిబ్బరం అనుభవించింది. "నేనంటే నీ కెందుకింత దయ మామయ్యా! చిన్నప్పటినుంచీ రాజు మామయ్య చీదరించుకున్నా నువ్వే చేరదీసేవాడివి. నేనేంచేసినా నీ ఋణం తీర్చుకోలేను. ఎందుకు నీ కింత ప్రేమ నేనంటే" అన్నది జీరబోయిన గొంతుతో.

"దయాలేదూ, ఋణమూ లేదు. అట్లాంటి మాటలు చెప్పకు. ఇంక నిశ్చింతగా వుండు విద్యారాణీ'' అన్నాడు చిలిపిగా. సిగ్గుపడి, యిల్లు సమీపిస్తోందని ఆతనినుంచి విడివడి ముందుగా యిల్లుచేరింది విద్య. శేఖరంతో ముందుగా మాట్లాడాడు ప్రకాశం. ప్రకాశం వంటి వానిచేతిలో విద్యను పెడితే తనకేం దిగులుండదు. ఆనందంగా అంగీకరించాడు శేఖరం. తర్వాత తల్లితో చెప్పాడు. ఆలోచించి చివరకు సరేనంది రాజేశ్వరమ్మ. రాజు ఏమీ అనలేదు. రమణి మాత్రం ముడిసిపోయింది. ఇంక విద్య యెప్పటికీ తనతోనే వుంటుందిగదా అని.

అన్నీ నిశ్చయమయ్యాక విద్య ప్రకాశానికి కనపడ్డమే మానేసింది. "ఈసిగ్గు ఎన్నాళ్ళో చూస్తాను" అని నవ్వుకున్నాడు ప్రకాశం. శేఖరం వైభవంగా వివాహం చేశాడు. ఉన్నదంతా విద్యదేననీ, విద్యని ప్రకాశానికి అప్పగించి బరువుతీరిన వాడిలా వెళ్ళిపోయాడు శేఖరం.

తర్వాత నాల్గునెలలకి వేడుక జరుగబోతోంది యింట్లో. రమణికి సూడిదలివ్వబోతున్నారు. బంధువర్గమంతా చేరారు. అంతులేని కోలాహలం. విద్య రమణిని విడిచి వుండడంలేదు. విద్యని పిలిచి ప్రయాణం కమ్మన్నాడు ప్రకాశం. తెల్లబోయింది విద్య. ఈవేడుక సమయంలో రమణిని విడువడానికి సుతరామూ యిష్టం లేదు విద్యకి

తల్లితోచెప్పి ప్రకాశం విద్యను తీసుకుని మద్రాసువెళ్ళాడు. విద్యకి మద్రాసు చూపించాలనే మిషతో. రాజు కేమీ తెలీదు. బంధువర్గంవాళ్ళు ఆశ్చర్యపోయారు. ఎవ్వరూ ఎక్కువ తర్కవితర్కాలు చేయలేదు. ఆ రాత్రి ప్రకాశం విద్యతో "నీకు రావడానికి చాలా కష్టమనిపించిందిగదూ విద్యా! కానీ పరిస్థితుల దృష్ట్యా మనం అక్కడ వుండడం నాకే యిష్టంలేకపోయింది. ఏవో వేడుకలంటున్నారు. ఖర్మంజాలక ఏమన్నా జరిగితే నిన్నంటారు. నువ్వు బాధపడతావు. అన్నిటికన్నా యిలా ఈ హోటల్‌గదిలో ఏకాంతంగా వుండడమే నాకు బాగుంది. అయినా వేడుకలన్నీ నీకూ జరుపుతారుగా. తొందరెందుకూ!" అన్నాడు.



"ఊరుకో! మామయ్యా! అల్లరిమాటలు'' అనిమాత్రం అన్నది విద్య. మామయ్యది యెంత దూరదృష్టి. తనంటే ఎంత ప్రేమ. ఇదంతా తన అదృష్టమేననుకున్నది విద్య. తన అదృష్టాన్ని లిఖించిన భగవంతునికి చేతులు జోడించి ''ఎంత దయామయుడివి ప్రభూ! కఠినులైన మనుష్యులతోపాటు కరుణామయులను కూడా సృష్టిస్తుంటావు. నీ లీల లెంత వింతైనవి'' అంటూ నమస్కరించి తృప్తిగా, నిశ్చింతగా ప్రకాశం కౌగిలిలో నిద్రపోయింది విద్య.

□□□



భామా కలాపం

"గృహమేకదా స్వర్గసీ....మా...." అంటూ పాడుతూ పుస్తకం తిరగేస్తున్నా నేను. "ఒసేవ్, నువ్వాపాట పాడితే తంతాను. 'గృహమేకదా నరక సీమా' అను'' అంటూ ఉసూరుమంది మా మిత్రురాలు.

పెళ్ళయి ఏడాదేనా కాలేదు. ఇదేమిటా యిలా అంటోంది. అనుకొని "ఏమయింది నీకు" అన్నా గంభీరంగా.

"ఏమవడమేవిటి? పొద్దుటినుంచి సాయంత్రం, రాత్రిదాకా అన్ని వస్తువులూ అందించలేక ఛస్తున్నాను ఆయనగారికి. ఇంకా ఏదో కనపడలేదంటూనే వుంటా రాయన" అంది.

ఇదేనండీ, కొందరు ఆడవాళ్లతో వచ్చిన చిక్కు. ఆయన యిలా అంటారు అలా అంటారు అంటూ మొదలెడతారేకాని, అది సబబా, కాదా అనే సంగతి చూడరు సరికదా, ప్రయత్నించరు. అసలు మగవారికి కావలసిన వేముంటాయి చెప్పండి? ఆఫీసు కెళ్ళేముందు దువ్వుకోటానికి దువ్వెన, అద్దం. వేసుకునే వాళ్ళకయితే పౌడరు డబ్బా, హెయిరాయిలు. ఇంతేగా? దీనికేముంది చెప్పండి? పొదుపు అంటూ కూర్చోక రెండు దువ్వెనలు కొనండి. ఒకటి మీకు, పిల్లలకూ. ఒకటి ఆయనకి. ఇక పౌడరు. ఒకడబ్బాకొని పెళ్ళిలో మీకెవరేనా ప్రెజెంట్ చేసిన వెండి, స్టీలు, లేక

రత్నా మహీధర్

అట్ట పౌడర్ డబ్బాలో సగంపోసి మీరుంచుకొని, మిగతాది ఆయన కిచ్చేయండి. అలాగే తలనూనె. ఎలాగూ ఆయనగారు ఆఫీసుకెళ్ళేదాకా మీరు తలదువ్వుకోరుకదా. పోతే, ఇవన్నీ డ్రెస్సింగు టేబిల్ ఉంటే వేరేవేరే అమర్చండి. లేదా ఈ రోజులలో గోడకికొట్టే బ్రాకెట్లు చవగ్గా వస్తున్నాయి. దానిమీద ఆయన వస్తువులన్నీ వేరే అమర్చండి. ఇక అయన మీజోలికి వస్తారేమో చూడండి.

• • •

మా మావయ్య ఒకాయన వున్నాడు. ఆయనగారు స్నానంచేసి వచ్చి "బనీను" అంటాడు చేతులు రెండూ పక్షిరెక్కలల్లే పెట్టి. ఆ బనీను కావ్యంటే నడిచి, లేక

స్వగతం

ఎగిరివచ్చి ఆయన చేతులో పడాల్సిందే. లేకపోతే నానాగందరగోళం అయిపోతుందా రోజు. స్థూలకాయమేమో కిందనున్నా వంగి తీసుకోలేడు పాపం. ఇలాంటివాళ్ళకల్లా ఒకటేమందు. ఎదురుగా ఓస్టాండుకొట్టి దాని మీద అన్నిబట్టలూ పడేస్తే సరి. అడగరు. అడిగితే "అదిగో స్టాండుమీద యెదురుగ్గా ఉంది" అనేయొచ్చును.

మనలో మనమాట. మగాళ్ళు చాలా గడుసువాళ్ళు కారుస్మండీ! ఊరికే నే వాళ్ళకేదో పవరుందను కుంటారుపాపం. కావలిస్తే మాపక్కింటి పిన్నిగారిని చూడండి. అయన ఆవిడమీద లెక్కలేనంత అథార్టీ చెలాయిస్తాడు. ఇలాగ అలాగ అంటూ సాధిస్తాడు. కానీ ఆవిడ యివేమీ పట్టించుకోదు. పైగా ఆయనలా అంటున్నప్పుడుఏదోసందర్భం చేసుకొని "మీరు చాలా మంచివారండీ అందరిలా కాదు" అనేస్తుందావిడ. దాంతో, సరి ఆయన కోపం.



అవునుమరి. పొగడ్తకు లొంగని వారుంటారా? వరమరహస్యం చెబుతాను. ఎవరికీ చెప్పకండేం? "పతిదేవుడు" అని ఎంతు

కన్నారు? 'భర్తను దేవుడిలా పూజించండి' అని ఎందుకన్నారనుకున్నారు? దేవుడినేమని పూజిస్తారు మీరు? 'నువ్వింతవాడివి, అంతవాడివి, వీడినిరక్షించావు, వాడిని శిక్షించావు' అంటూ ఆకాశానికెత్తేస్తూనేకద! అలాగే మీవారినికూడా శాస్త్ర పొగడ్తలపాలు ఎక్కువచేసి చూడండి. దేవుడు వరాలిస్తాడో లేదోకానీ ఈయనగారుమాత్రం 'ఐస్' అవక తప్పదు.

"పుల్లమ్మగారి భర్త అలాటి చీర కొన్నాడు. ఎల్లమ్మగారి ఆయన ఆ జాకెట్ పీస్ కొన్నాడు" అంటూ చాటుమాటు దండయాత్ర మొదలెట్టకండి. ప్రమాదం. ఉన్నదున్నట్టు అనేయటమే ఆడ లక్షణం. "ఆచీర బావుంది. కొనుక్కోవాలి" అనండి. వీలయితే యీసారి కొనుక్కో అంటారు. లేదా ఎప్పుడో తనేకొని తెచ్చేస్తారు. అలాగని ప్రతిసారి చీరలు కావాలనో, ఇంకేదో కావాలనో వేధించడం కూడా మంచి అలవాటుకాదు.

• • •

ఇలా అప్పుడప్పుడు చేసి చూడండి. ఫలితాలెంత బావుంటాయో మీకే తెలుస్తుంది. ఆయన పుట్టినరోజునాడు మీరే ఆయనకే దేనా కొనివ్వండి. చక్కటి బాల్‌పెన్ కానీ, లేక అందమైన పేపర్ వెయిట్ కానీ, సిగరెట్లు త్రాగేవారికి సిగరెట్ కేస్ — ఇదేదీ కాకపోతే, నాజూకైన నెక్‌టైపిన్ ప్రెజెంట్ చేస్తే సరి. డబ్బో అంటారా? మీరు మరీను, ఉద్యోగం చేసేవారయితే బాధలేదు. లేదూ, మీవాళ్ళిచ్చిందానితో, అదీకాకపోతే, ఓనెల ముందునుంచీ తంటాలుపడి, సేవ్ చెయ్యండి ఇలాటి చిన్నవిషయాలే యెంతో ఆనందాన్నిస్తాయి.

'ఆడవాళ్ళు అబలలుకారు', అంటూ గంభీరమైన ఉపన్యాసాలివ్వకండి. ఉపన్యాసాలవల్ల సత్ఫలితాలు రావని మన నాయకుల ధర్మమా అని మనకందరికీ తెలిసిందే. అంచేత మాట పారేసుకోక చేతలవల్లే చూపించండి.



"సుశీ—"
"ఏమిటి మోహన్"
"నన్ను...."
"ఊఁ....నిన్ను"
"నన్ను, నన్ను – పెళ్ళి చేసుకొంటావా?"
"ఊఁ...."
"............"
"మాట్లాడవేం మోహన్"
"ఏం లేదు సుశీ ఇప్పటికే అధిక ప్రసంగం చేశా."

ఇంకో ముఖ్యవిషయం. ప్రతి పనిలోనూ మన జోక్యం ఉండకూడదు. అసలు కల్పించుకోకండి. చాలామంది అదికావాలా, యిది కావాలా? నన్నడగలేకపోయారా? అంటూంటారు. అభిమానానికల్లా మూలం ఆధారపడేట్టు చేయటంకాదు. అంతవరకూ హాస్టల్సులోనూ, రూమ్సులో ఉన్న మగాళ్ళు ఆడవాళ్ళు రాగానే ఏదీ చేసుకోడం రానివాళ్ళలా తయారవటం మనమూలాన్నేకదా మరి!

• • •



మా మిత్రురాలు ఈ రోజుల్లోకూడా "మీ పాద దాసి" అంటూ ఉత్తరాలు రాస్తుందట. భార్య అంటే భరింపబడేది. ఆ బరువు మోసేవాడికే తెలుస్తుందిఅని అనిపించేట్టు చేసేవి ఈ విధమైన రాతలు, మాటలేనండీ.

అంతవరకూ పెళ్లో అంటూ వాపోయే వారు అది కాంగానే అంతరిక్షానికెక్కారంటే కారకులం మనమేకదా.

ఎప్పుడూ "మహాప్రభో సంసారసాగరం ఈదలేక ఛస్తున్నా" అంటూఉంటే మనకీ, చూసేవాళ్ళకీకూడా బాగుండదు. అవలీలగా హనుమంతుడు వారధి దాటేస్తున్నట్టు కనపడ్డం నేర్చుకోవాలి.

• • •

అవును మరి. దేశానికి ప్రధానమంత్రి లాంటిది యింటికి గృహిణి. అన్నిటినీ చక్కగా మలచుకోటంలోనే ఉంది ప్రజ్ఞ. అప్పుడే "గృహమేకదా స్వర్గసీమా" అంటూ మీ రొక్కరే కాక మీవారితోసహా డ్యూయెట్ పాడొచ్చు. □□□



నవ్వింది జాబిల్లి

మనస్సు కోతిలాంటిదేనంటే ఒప్పుకోకతప్పదు. కుదురుగా కూర్చున్నట్టే కూర్చుని అంతలోనే త్రుళ్ళి త్రుళ్ళిపడుతుంది. పక పకా నవ్వుతూనే బావురుమని ఏడుస్తుంది.

అది కల్గించే అనుభూతులు ఎప్పటికప్పడే విచిత్రంగా వుంటాయి.

హేమలత అలాగే ఓచిత్రమైన అనుభవంలో చిక్కుకొంది.

"నువ్వీమధ్య చాలా మారిపోతున్నావు హేమా !"—అన్నాడు శేఖర్ మరోసారి.

భార్యమీద తన అభిప్రాయం తరుచూ వెలిబుచ్చుతూనే వున్నాడు.

భర్త అలా అన్నప్పుడల్లా త్రుళ్ళిపడి తనని తను తమాయించుకోటానికి ప్రయత్నిస్తూ నవ్వేస్తుంది హేమలత. "నేనా ? మారిపోతున్నానా ? ఇది మరీబావుంది." అంటుంది అతి నిర్లక్ష్యంగా.

"చూడు. నీ నవ్వులోకూడా మునుపటి కాంతిలేదు."

"ఊఁ ఏం మారిపోయానో చెప్పండి చూదాం."

"అదే అర్థంకాకుండా వుంది. ఎటూ ఆలోచించలేకపోతున్నాను."

"నువ్వు నువ్వుగా మాత్రంలేవు. అంత వరకూ చెప్పగలను."

ఇక శేఖరం కళ్ళలోకి సూటిగాచూడలేక హేమలత చూపులు దించేసుకుంది.

"అంతా మీ భ్రమ. నేనేమీ మారలేదు. ఎప్పటిలాగే వున్నాను."

"అంతేనంటావా?" రెట్టించిన శేఖరాన్ని.

"అంతగాక ఇంకేంత ?" అంటూ వది లించుకోవాలని ప్రయత్నించింది.

"కాదు. కాదు. అంతకాదు, ఎంతో వుంది ..ఎంతోవుంది." అంటూ ఎవరో కసికొద్దీ తనగుట్టు బయటపెట్టేస్తున్నట్టు దిక్కులు చూసింది. "అంతా మీభ్రమ. నేనేమీ మారలేదు."—అని శేఖరాన్ని మభ్యపెట్టగలదేగానీ క్ష ణ కా లం కూడా మౌనం వహించని తన మనస్సునెలా మూగపరచగలదు ? తను ఎంతమారిందో, ఎందుకుమారిందో తనకితెలుసు. తనని చూసి ఎవరో భ్రమపడుతున్నారని తనే భ్రమ పడుతోందేమో ! తన కల్పనలన్నీ కట్టిపెట్టి అంతరాత్మముందు తలదించక తప్పదు.

ఏమీ చెయ్యలేనిదానిలా నిట్టూర్చింది హేమలత.

శేఖరం అడిగిన ప్రశ్నలు ఎప్పుడూ తనని వెన్నాడుతూనే వున్నాయి.

"నువ్వెందుకు మారిపోయావు?—"ఖర్మ కాకపోతే తనేం చెప్పగలదు. జరిగిందంతా

ముప్పాళ రంగనాయకమ్మ

కాలప్రవాహంమీదికి గెంటివేసి నిర్దోషిగా తనకి తప్పించుకోవాలనిపిస్తోంది. కొన్ని కొన్ని క్షణాలు చాలా పెద్దగా పరిణమిస్తాయి. వాటి ప్రభావం గుడ్డిగా ఎక్కడెక్కడికో ఈడ్చుకుపోతుంది.

కాకపోతే ఏమిటి? తనకెందుకింత చాంచల్యం? తనలో ఎందుకిటువంటి బలహీనత? మంచిచెడ్డలు తనకేం తెలీవని? లోకజ్ఞానంమాత్రం తనకేం తక్కువని?

అప్పటికి జీవితంలో వేలాదిమంది మగవాళ్ళని చూసింది. కాని....కాని,...అంతటి నవమన్మథుణ్ణి ఎన్నడూ చూడలేదు. నిజమే. అయితేమాత్రం ఎందుకింత మార్పు తనలో? ఎప్పటికైనా అతన్ని అందుకో గలదా?....భ్రమ!...బాధగా కణతలు నొక్కుకుంది హేమలత. అతని ఆలోచన వచ్చినంతమాత్రానేశరస్సుభారమైపోతుంది. శరీరం వశం తప్పుతుంది. మనస్సంతా కలత బారిపోతుంది.

ఎంతవద్దనుకున్నా....ఎంత తుడిచివేసుకున్నా....ఆ జగన్మోహన విగ్రహం ఎదుట ప్రత్యక్షమౌతూనేవుంది. ఆ సౌందర్యమూర్తి క్షణక్షణం తనమతి పోగొట్టి పిచ్చిదాన్ని చేస్తోనేవున్నాడు. ఇకనేం చెయ్యగలదు తను?

ఆరోజు....సరిగ్గా వారంరోజులక్రిందట శేఖరూ, తనూ ఎంతో సరదాగా సినిమా చూస్తూ కూర్చున్నారు థియేటర్‌లో. ఆశించినదానికన్నా అమోఘంగా నడుస్తోన్న సినిమాని వుత్సాహంగాచూస్తూ - నెమ్మదిగా కబుర్లు చెప్పుకుంటూ....అప్పుడప్పుడూ విమర్శించుకొంటూ .... తెలీని విధంగా కాలం గడిపేస్తోంటే వెండితెరమీద - "విశ్రాంతి." మెరిసింది. వెను వెంటనే హాలంతా దీపాలు వెలిగి పట్టపగలయింది.

"బైటికి వెళ్దాం. వస్తావా హేమా?" అన్నాడు శేఖర్ లేస్తూ.

"నేను రానులెండి." అంది తను బద్ధకంగా.

"పోనీ నీకేమైనా కావాలా?"

"ఏం తెస్తారేమిటి?" అంటూ నవ్వింది తను.

"బిళ్ళలో....బిస్కత్తులో...."

"బఠాసీలుకూడా....చాలుగాని వెళ్ళిరండి. నేనేం పాపాయినా?"

"అహా! ఆరిందావిలే...." అనేసి వెళ్ళిపోయాడు శేఖర్! ..శేఖర్ తనని కూడా రమ్మని బైటికితీసుకుపోతే ఎంతబావుండేది? తనకీ క్షోభ తప్పిపోయేదికదూ?—హేమ ఆలోచనలు క్షణకాలం స్తంభించిపోయాయి. ఆపైన జరిగింది నెమరువేసుకోవటానికి ధైర్యం చాలటంలేదు. ఏదో జంకు పుట్టుకొస్తోంది—పదే పదే ఆ ఘట్టాన్ని తిరగతవ్వుకుని....ఆ అనుభూతుల్ని మననం చేసుకుని ఏంచెయ్యగలదు? అదొక దురదృష్టపు సంఘటన అనుకుని మర్చిపోటానికి ప్రయత్నించాలేగానీ ఇలా గుర్తుతెచ్చుకుంటూ బాధపడుతూ కూర్చుంటే నిజంగా తను పిచ్చిదైపోదూ?

మనస్సుని బంధించుకోవాలనీ....ఆపాడు స్మృతిని తుడిచివేసుకోవాలనీ - - హేమయెంత ప్రయత్నించిందో అంత విఫలురాలైంది - వివశురాలై నిట్టూర్చింది. అప్రయత్నంగానే ఆ సంఘటన ఆమె మెదడులో మెదల నారంభించింది.

శేఖర్ బయటికి వెళ్ళగానే హేమ బద్ధకంగా వేళ్ళు విరుచుకుంటూ తల తిప్పి ఓసారి నాలుగువేపులా పరిశీలించబోయింది కుతూహలంగా.

....తళుక్కున మెరుపు మెరిసింది .. ఒక్కక్షణం.

ఆమె గుండెలు అమిత వేగంతో కొట్టుకున్నాయి - మరోక్షణం.

ఆమె చూపులు ఎటూ కదలకుండా ఆ మూర్తిమీద కేంద్రీకరించుకున్నాయి - అతను బైటనుంచి వచ్చి యధాప్రకారం తన సీట్లో కూర్చుని రుమాలుతో నుదురు ఒత్తుకున్నాడు. సిగరెట్ తీసి వెలిగించుకుని వేళ్ళమధ్య నలుపుతూ కుర్చీ వెనక్కివాలి గిర్రున తిరుగుతూన్న పంకాలకేసి చూస్తూ నిర్లిప్తంగా కూర్చున్నాడు గ్రీకు శిల్పంలా.

తనని తను మర్చిపోయింది హేమలత. తన వునికిని పూర్తిగా విస్మరించింది. ఏకాంతంలో వున్నంత చొరవగా దీక్షగా తదేకంగా అతన్ని చూస్తూవుండిపోయింది - ఆ సోయగాన్ని కాదనుకుని కళ్ళు మళ్ళించుకోవటం ఆమెవశంకాలేదు. చటుక్కున అతను చూసినప్పుడైనా తల తిప్పుకోవటం ఆమెకు శక్తికి మించిన పనైంది.

"మన్మధుడు!"....అస్పష్టంగా....తనకే విన్పించనంత రహస్యంగా పెదవులు విడకుండా ఉచ్చరించుకొంది.

భుజంమీద చెయ్యిపడితే ఉలిక్కిపడి తల తిప్పింది.

"బఠాసీలు దొరకలేదు హేమా!" అంటూ నవ్వి గుప్పెడు చాక్‌లెట్లు చేతిలో పోశాడు శేఖర్.



"నిన్న సాయంత్రం నీ పక్కన ఆ చైనావాడెవడోయ్?"

"చైనావాడు కాదయ్యా, మా బావ మరిది వెంకట్రావే. బస్సుకోసం పరిగెడుతూ ఈలోగా ఓ అమ్మాయిని చూసి వెళ్ళివెళ్ళిగోడకిగుద్దుకున్నాట్ట."

వాటినలా గేట్లోకి విసిరికొడదామన్నంత కోపం వచ్చింది హేమలతకు. పైకి కన్పించకుండా చిరాకుగా హేండ్‌బాగ్ తెరిచి చాక్‌లెట్లన్నీ అందులోపోసింది.

"తినకుండా దాచుకుంటావా?"

"తింటానులెండి తర్వాత." అయిష్టంగా మాట్లాడింది. మధురమైన కలని చెరిపివేసినట్టు అర్థంగాని బాధకు లోనైంది హేమ. నిస్సహాయంగా బుగ్గన చెయ్యి ఆనించుకుని దీర్ఘంగా తెరకేసిచూస్తూ కూర్చుంది. "నిశ్శబ్దం" అని హెచ్చరిస్తూ రెండు బంగారు పక్షులు మంతనాలాడుకుంటున్నాయి తెరమీద. దీపాలన్నీ ఆరిపోయి థియేటరంతా చిమ్మ చీకటి అలుముకుంది.

చటుక్కున తలతిప్పి ఎడంవేపు వారగా చూసింది హేమలత.

అతని సౌందర్యకాంతి ఆ చీకటినికూడా చీల్చుకొంటూవచ్చి ఆమెకళ్ళకు కట్టింది.

మరోకసారి విస్మయంతో చకితురాలైంది హేమ. మగవాళ్ళలో ఇంతటి అందగా ళ్ళున్నారన్న సంగతి వూహకుకూడా అందనిది. తను కళ్ళారా చూసివుండకపోతే ఎవ్వరెన్నివిధాల చెప్పినా నమ్మరానిది.

"ఎటు చూస్తున్నావ్ హేమా ? పిక్చర్ చూడవేం ?" హెచ్చరించాడు శేఖర్.

"....చూస్తూనే వున్నాను." నెమ్మదిగా అని తెరకేసి మొహం తిప్పుకొంది హేమ- ఏమీ కన్పించటంలేదు కళ్ళకి. అంతా తెల్లగా పెద్దమచ్చలా అలుక్కుపోయింది. రెండు నిముషాలు రెప్ప వెయ్యకుండా చూస్తూ కూర్చుంది. ఆకళ్ళు ఒక్క ఆ మన్మధుని సోయగాన్ని తప్పితే మరేమీ చూడలేవు. గుడ్డివై కలకాలం గాఢాంధకారం లోనైనా తట్టుకోగలవు గానీ - ఆమూర్తిని విసర్జించి మరో వస్తువుని గ్రహించలేవు.

హేమలత మనస్సంతా గందరగోళమై పోయింది.

అతన్ని....ఎంతసేపు .... ఎంతసేపు.... చూసినా తనివి తీరటంలేదు. ఊరట కల్గటం లేదు. ఆ బొమ్మలకేసి చూడాలన్న వుత్సాహం ఆసక్తి పూర్తిగా కోల్పోయింది.

ఎవరో కీ యిచ్చి విడిచినట్టుగా హేమ లత తల నెమ్మదిగా ఎడంవేపుకు తిరిగి పోయింది. రహస్యంగా చూపులు.... ఆతనికోసం వెతుక్కున్నాయి.

అతను ముందుకు వంగి ఆసక్తిగా చూస్తున్నాడు తెరకేసి. కొంచెం ముందు వరసకి దగ్గిరయ్యాడు. ఒక్కసారిగా అతని వేపునుంచి ఏదో సెంటువాసన గులాబిరేకలు గుప్పెళ్ళతో విసిరినట్టు సున్నితంగా వీచింది.

మైమరచి మరబొమ్మే అయింది హేమ లత.

అతను....ఒక్కసారి తనకేసి చూడ కూడదూ ?....ఒక్కసారి....అకళ్ల ఎంతటి సౌందర్యగోళాలో....! ఆ కళ్ళలోకి తొంగి చూస్తే ఎటువంటి సుందరలోకాలు కన్పడ తాయో ! ...అతను ఒక్కసారి మాట్లాడ రాదూ ? అకంఠం విప్పి మాట్లాడితేనెమళ్ల నాట్యం చేయవూ ?

అతడు....నిజంగా మానవుడా ? రూపు సూర్చి దిగివచ్చిన మన్మధుడా ? నలకూబ రుడా ?....

పకపకలతో థియేటరంతా మార్మోగింది.

కంగారుపడి తలతిప్పేసుకుంది హేమ లత - ప్రేక్షకులంతా కడుపులు చెక్క లయ్యేలా నవ్వుతున్నారు. నవ్వలేక అవ సోపాలు పడుతున్నారు. పిక్చర్‌లో యేదో జరిగింది. తను చూడలేదు. శేఖర్ తన చేయినొక్కుతూ నవ్వుతోంచే నెమ్మదిగా విడిపించుకుని ఒడిలో దాచుకుంది.

అందరితో కలిసి నవ్వుతున్నాడు.... అతనుకూడా హాయిగా. ఆ నవ్వు యెంత సమ్మోహనకరంగా వుందనీ! మధురగానం వంటి ఆ నవ్వువింటూ - శ్రావ్యమైన ఆ రాగం వింటూ స్పృహలు కోల్పోవచ్చును. మేఘాలలో తేలిపోవచ్చును.

"ఎందుకు హేమా ! అంత పరధ్యానంగా వున్నావు ? ఛా ! నువ్వు సరిగా పిక్చర్ షాలో అవటంలేదు." కొంచెం విసుక్కున్నాడు శేఖర్.

"అబ్బ ! ఏమిటో తలనొప్పిగావుంది." బాధగా కణతలు నొక్కుకుంది హేమ.

"ఆదేం ? ఇంతవరకూ బాగానే వున్నావుగా ?"

"..........."

"బాగా నొప్పిగావుందా ? పోనీ వెళ్ళి పోదామా ?"

"అహ ! వద్దు చూస్తూనే వున్నాగా."— తప్పనిసరిగా పిక్చర్ చూస్తూకూర్చుంది. తను పిక్చర్‌చూస్తూనే వున్నట్టు రుజూ చేసుకోటానికి మధ్య మధ్య అడ్డదిడ్డంగా విమర్శలుకూడా చేసింది. మనస్సులాగు తోన్నా మళ్ళీ మళ్ళీ ఎడంవైపు తలతిప్పి వారగా వెనక్కి చూడటానికి ధైర్యం చాల లేదు—అందాన్నిచూసి ఆనందించే అదృష్టం మాత్రం ఎంతటి వాళ్ళకి! ఛ ! పాడుగోల.

స్థాణువులా కూర్చున్న హేమలత పిక్చర్‌కాగానే సిర్ఘివంగాలేచి నిలబడింది. మారాం చేస్తూన్న మనస్సుని మందలించే శక్తిలేక ఒక్కసారి సాహసంచేసి వెనక్కి చూస్తే....లేడు. కన్పించలేదతను. ఎంత తొందరగా వెళ్ళిపోయాడో! ఆ పున్నమి చంద్రుడికోసం ఏ భాగ్యశాలిని నిరీక్షిస్తూ వుందో !— హేమచూపులు వెర్రిగా ఖాళీ థియేటరంతా పరుగులెత్తాయి.

ఇంటికి వచ్చేవరకూ మాటామంతీ లేకుండా నడిచింది శేఖరంవెంట. తల నొప్పితో బాధపడుతోన్న భార్యని మాట లతో విసిగించదల్చుకోలేదు శేఖర్. మౌనంగానే శేఖర్‌కి అన్నం వడ్డించి తనూ వడ్డించుకుంది-వేళ్ళుపెట్టి కెలకటం తప్పితే ఒక్కముద్దకూడా ఎత్తి నోట పెట్టుకోబుద్ధి కాలేదు. గ్లాసు అందుకుని నీళ్ళుతాగబోతే చటుక్కున ప్రత్యక్షమైంది....అతని ప్రతి బింబం ! చందమామని పోలిన ఆ ముఖార విందం !- కదలని నీళ్ళలో నిలిచి నవ్వు తోన్న ఆ చంద్రబింబాన్ని చూస్తూ కూర్చుంది హేమ.

"ఏమిటలా చూస్తావ్ ? నీళ్ళలో నలక లేమైనా వున్నాయా ?"

"అబ్బే ! ఏంలేవు. వూరికే చూస్తు న్నాను."

"పోనీ అంత అనుమానమెందుకూ ? పారబోసి మళ్లా తెచ్చుకోరాదూ ?"

గ్లాసు ఎత్తిపట్టుకుని నీళ్ళన్నీ తాగేసింది- "ఏమిటో ఆకలేలేదు." అంటూ పళ్ళెం వదిలి లేచిపోయింది.

"నీకు పిక్చర్ ఎలావుంది హేమా ?" పక్కమీద ఒత్తిగిలుతూ అడిగాడు శేఖర్. హేమలతకేమీ మాట్లాడాలనిపించలేదు. ముక్తసరిగా అంది :

● పత్రికా సంపాదకునివద్దకు ఒక యువ రచయిత కథ పట్టు కొచ్చాడు.

''మేము మంచిపేరున్నవాళ్ళవే తప్ప వేసుకో''మన్నాడు సంపాదకుడు.

''నాపేరు శశికాంత సుధామోహన్. ఏం, బాగాలేదా ?'' అని అడి గాడు రచయిత.

"పిక్చర్ కేం? బాగానేవుంది."

"ఏం బావుందో ...నీకేం నచ్చిందో.... చెప్పూ."

కొంచెం విసుగుదల కనపరిచింది హేమలత. "తర్వాత మాట్లాడుకోవచ్చు. పడుకుందురూ! తలనొప్పితో నేను సతమతమౌతోంటే...."

"ఇంకా తలనొప్పి తగ్గనేలేదూ? నిజంగా? మరైతే చెప్పవేం? కొంచెం అమృతాంజనం రాసేవాణ్ణిగా?" — లేవబోతూన్న శేఖర్‌ని వారించింది.

"—నాకిప్పుడే మందులూ అక్కర్లేదు. కాస్త ప్రశాంతంగా నిద్రపోనివ్వండి. అదే తగ్గుతుంది."

"ఎందుకు హేమా నామీదంతకోపం? నేనేం చేశాననీ?" భయపడ్డకుర్రాడిలా బిక్కమొహంవేసి హేమ గుండెలమీదతల ఆన్చుకోబోయాడు శేఖర్.

హేమ నిర్లక్ష్యంగా పక్కకి జరిగిపడుకుంది. "నాకేం కోపంరాలేదు. బాగా లేదని చెప్పానుగదా? కాస్త విశ్రాంతిగా పడుకోనివ్వండి."

"నీయిష్టం హేమా! నీ ఆరోగ్యంకన్నా యెక్కువేమిటి?"— శేఖర్ హేమకి కొంచెం దగ్గిరిగా జరిగి నడుంచుట్టూ చెయ్యివేసి తృప్తిగా కళ్ళు మూసుకుపడుకున్నాడు. ఆటలాడి అలిసిపోయినపాపడిలా నిద్రలోకి జారిపోయాడు.

నడుంమీదనుంచి భర్త చేయి తీసివేసి లేచి కూర్చుంది హేమలత. బలవంతంగా కళ్ళు మూసుకున్నా నిద్ర రావటంలేదు. అతను.... అతను ....వెంటాడుతున్నాడు తనని. కాదనుకుని తోసివెయ్యటంచేతకావటంలేదు తనకి. కళ్ళుతెరచినా మూసినా ఒకే అంధకారంగా వుంది.

ఏటిలోంచి తీసి ఒడ్డున వేసిన చేపలా గిలగిలా కొట్టుకుంది మనస్సు. పాల నురగలాంటి....ఆ సౌందర్యం – మల్లె వాసనలాంటి ఆ ఆకర్షణ....ఆహా! ఏభాగ్యశాలిని సొత్తో....! ఏ పుణ్యవతి వరమో!

నిస్పృహగా నిట్టూర్చింది హేమ! వెచ్చగా కన్నీరు జారింది చెంపలమీదుగా. నిశ్శబ్దంగా తుడుచుకుని తలగడమీదికి వాలిపోయింది.

దుఃఖపూరితమైన రాత్రి అంతా స్వప్నలోకాలలోనే విహరించింది హేమలత అంతరంగం.

"కలకాదుకదా?" అంటూ తర్కించుకొంది హేమలత మర్నాటి వుదయం. "ఆహా! ఎంత చిత్రమైనకల! ఎంత మధురమైనకల! కాని....కాని...."

"రాత్రి నిద్రపోలేదాఏమిటి? కళ్ళలా ఎర్రగావున్నాయేం?" అన్నాడు శేఖర్ హేమకళ్ళలోకి చూస్తూ.

చటుక్కున తలదించేసుకుంది హేమ— "ఎందుకు నిద్రపోలేదూ? బాగానే నిద్రపోయాను" అంది పైకి చూడకుండా.

"తలనొప్పి తగ్గిపోయిందా?"

"ఆఁ తగ్గింది."—మాటలు పెంచాలనీ, భర్తతో మునుపటిలా ప్రవర్తించాలనీ అనిపించలేదు హేమలతకి - నెమ్మదిగా తప్పుకుని వంటింట్లోకి దారితీసింది.

"హేమా! ఒక్కసారిలా వస్తావూ? కొంచెం తలదువ్వి వెళ్లు."

అప్రయత్నంగా మొహంచిట్లించుకుంది హేమలత—"నాకు ఖాళీలేదు. ఎసరు మరుగుతోంది. బియ్యం ఏరుకుంటున్నాను."

"మరగనిద్దూ!,ఒక్కసారివచ్చి వెళ్ళవ్! పావిడి తీసుకుంటే వచ్చిబావటంలేదు నాకు."

నిత్యం. అలా భర్త తలకి నూనెరాసి పావడితీసి చెంపలు దువ్వటం హేమకి అలవాటే. తను పనిలో వున్నప్పుడు - అడ్డదిడ్డంగా దువ్వుకుని యిన్ని వెంట్రుకలు మొహంమీదికి పడేసుకుని దగ్గిరికొస్తాడు శేఖర్! తను నవ్వి - "చేతకానట్టు ఇదో వేషం - బావుందికదూ!" అంటూ కసిరి క్రాపు సరిచేస్తుంది.

తప్పదుమరి. అయిష్టంగానే లేచి వెళ్ళి దువ్వెన అందుకొంది హేమ. నిటారుగా సూదుల్లా పొడుచుకొస్తున్న ఆ వెంట్రుకల మీద చెయివేసి నిమరటానికి హఠంచేసింది మనస్సు. - మెత్తని రబ్బరులా - నల్లగా నిగనిగలాడే....అతని నొక్కులజుత్తు అలలుగా కళ్ళముందు కదిలింది - గబగబా చెంపలు దువ్వేసి దువ్వెన టేబుల్‌మీదికి విసిరేసింది.

"ఆగవోయ్! ఏవిటా కంగారు?"

"ఎందుకూ?"

"ముందు వెనక్కిరా మరి."

"అబ్బ! చెప్పరాదూ?" పైటకొంగు వదిలించుకోటానికి ప్రయత్నించింది.

"ఏమిటో ఆ చిరాకు ... కాస్త షర్టు అందించి వెళ్ళు."

"బాగానేవుంది మీ సరసం. అవతల నాకు పనుందని చెప్పటం లేదూ?"



"అరె! నిన్న అచ్చం నీలాంటి మనిషినే చూశానుమా!"

"కొంపతీసి నా బాకీ అయిదు రూపాయలూ ఆయన తీర్చెయ్యలేదు గదా."

"ఏమిటబ్బా అంతరాచకార్యం? నీపని నాకుతెలుసులే,నీస్నానానికేగా నీళ్ళుమరుగుతున్నాయి. అబద్ధాలాడితే....శిక్షేమిటో తెలుసా?"

"చాలుగాని ముందీషర్టు అందుకోండి. నేను వెళ్ళాలి."

"అదేంకుదరదు. నేను గుమ్మం దాటే వరకూ నువ్విక్కడ వుండాల్సిందే!" శేఖర్ షర్టుతొడుక్కుని గుండీలు పెట్టుకుంటూంటే వుండబట్టలేక అంది—"చేతులలా పొడుగ్గా వదిలేసుకుంటే ఏం బావుంటుందీ? మడతలు పెట్టుకోరాదూ?"

"సినిమా హీరోని చేసేద్దామనుకుంటున్నావా నన్ను? అవశ్యం. రాణీగారి అభిరుచికన్నా ఈ దీనుడు వాంఛించదగినదేముంది?" చేతులు పొడుపుగా మడతలు పెట్టుకుని ఠీవిగా నిలబడ్డాడు శేఖర్— "ఎలావుంది? బావుందా?"

ఏమీనచ్చలేదు హేమకి.... ....దుస్తుల ముస్తాబులో....అసలతనికి సాటిఎవరు?

అతనిలోని రాజసం....దర్జా....ఎంతటివాళ్లకి? "మీకంత బావున్నట్టులేదు. పోనీ అలవాటైతేసరి." అంది క్లుప్తంగా. భర్త మొహంలోకి క్షణకాలంచూస్తే తన కళ్ళనావరించిన పొరలేవో పల్చబడుతున్నట్టు అన్పించింది-శేఖర్‌కళ్ళలోని ఆ పవిత్రత....పసితనం ... హేమని తలదించుకునేలా చేశాయి. తను ఘోరమైన తప్పుచెయ్యటం లేదూ?

దారితప్పి ప్రయాణించటం లేదూ? తనని ప్రాణసమానంగా ప్రేమిస్తోన్న భర్తని యింతగా అసహ్యించుకునే యీ దరిద్రపు రోజెలా దాపరించింది? శేఖర్ అగ్నిసాక్షిగా తన మెడలో తాళి కట్టినవాడు! తనతో నిండు జీవితాన్ని పంచుకున్నవాడు! మనోవాక్కాయ కర్మలా తన సాహచర్యాన్ని కోరుతూన్నవాడు! నిష్కల్మషంగా అర్ధాంగిని విశ్వసించి ఆరాధిస్తూన్నవాడు! శేఖర్ ఏమిటో తనకి క్షుణ్ణంగా తెలుసు — అతని సన్నిధిలో యెన్నడూ తను నిట్టూర్చలేదు - ఒక్క కన్నీటి బొట్టయినా చిందించలేదు. శేఖర్ వంటి భర్త యెంతో అదృష్టవంతులకుగానీ లభించదనీ - శేఖర్‌ని భర్తగా తను ఒక్కతే పొందగలిగిందనీ - మురిసిపోయిన సమయాలు-గర్వించిన క్షణాలూ యెన్నెన్నో.... వున్నాయి - వేటినీ తను మర్చిపోలేదు.

కాని ...శేఖర్ మన్మధుడుకాడు - అందగాడు కూడా కాడు. పెళ్ళిపీటలమీద తామిద్దరినీ పక్కపక్కగా చూసిన అమ్మలక్కలు బహిరంగంగానే చెవులు కొరుక్కున్నారు—" కాకిముక్కుకి దొండపండు కట్టినట్టేవుంది - పెళ్ళికొడుకు ...ప్చ్! ఏం బావున్నాడనీ? నల్లగా....సన్నగా ... గెడకర్రలా....అందమా? చందమా? మన హేమకి తగినవాడు కాదమ్మా!" అంటూ సానుభూతి కురిపించారు. తనకెంతో దిగులు వేసింది. అవమానంతో తల వంగిపోయింది. తనభర్త తనకి తగినవాడుకాదని అంతా అనుకుంటూంటే తనెలా భరించగలదు?

అంతా తను అందమైందే నంటారు. "బంతిపువ్వులా మెరిసే ఒళ్లూ - చంద్రబింబంలా చక్కని ముఖం-బారెడు తలకట్టు-తీర్చిదిద్దిన బొమ్మలావున్న మా హేమమ్మకేం లోటే? శ్రీరామచంద్రుడిలాటి మొగుడొస్తాడు." అంటూండేది బామ్మ-ఆ బామ్మే పెళ్ళిలో తను చిన్నబుచ్చుకోవటం గ్రహించి కళ్ళనీళ్ళు తెచ్చుకుంది-చెవులు కొరుక్కుంటూన్న వాళ్ళందర్నీ కోపం తెచ్చుకు కేకలేసింది- "అందం కొరుక్కుతింటామా ఏమిటి? గుణం వుండాలి నూరేళ్ళు బ్రతికే బ్రతుకు-మనస్సులు కలియాలిగానీ. సంసారాలు చేసుకునేవాళ్ళకి అంతకన్నా మరేవీ అక్కర్లేదు. కుర్రాడు బుద్ధిమంతుడే. ఏం? కన్నులేదా? కాలు లేదా? ఈసారి ఎవరైనా నోరెత్తి వాగండి-చెప్తాను" అంటూ అందర్నీ తిట్టిపోసి తనని బుజ్జగించింది.

అప్పట్లో బామ్మ మాటలెంతో ఓదార్పు కల్గించాయి తనకి. రాగారాగా అవి ఎంత నిజాలోకూడా అర్థమయ్యాయి. తనూ శేఖరూ సన్నిహితం కావటానికి అందాల వంతెనే అక్కర్లేకపోయింది - శేఖర్ ఎందుకు అందగాడుకాడు? అతని కన్నుల్లో పవిత్రతవుంది అతని మొహంలో మంచితనంవుంది. అతని శరీరమంతా అమృతం

నిండింది - అతని హృదయం నిండా సౌందర్యం దాక్కుంది—అతని అనురాగం తనకి సేదతీర్చింది - శేఖర్‌గాక యింకెవరున్నారు అందగాళ్ళు?—"దేవుడు నాకిచ్చిన వరానివి నువ్వు, కదూ?" అంది ఎన్నోసార్లు శేఖర్‌ని హృదయానికి హత్తుకుంటూ.

హేమ భారంగా బాధగా తలపట్టుకు కూర్చుండి పోయింది. అలాంటి తన శేఖర్ అసహ్యించుకునే రోజు దాపరిస్తుందని కలలోనైనా అనుకుందా? తనలో....ఈ చాపల్యం ఎక్కడిది? ఇన్నాళ్ళూ ఎలా మరుగునదాక్కుంది? తను ఇంత అతి సామాన్యమైన ఆడదేనా?

తన చరిత్ర ఎంత వున్నతమైనది! తన పుట్టినిల్లు ఎంత పవిత్రమైనది! పట్టుమని పదిసంవత్సరాలైనా నిండని వయస్సులో వైధవ్యం ప్రాప్తించింది తన మేనత్తకు. వీరేశలింగం పంతులుగారి రోజులలో పునర్వివాహం చేయాలని ప్రయత్నిస్తే సంఘసంస్కారులనందర్నీ తిరస్కరించిందావిడ. ఆనాటినుంచీ ఆహార వ్యవహారాలలో కఠోర నియమాలు పాటిస్తూ - పరోపకారమే పరమావధిగా భావించి - సుఖదుఃఖాలకు అతీతురాలై జీవిస్తూన్న మేనత్తని చూస్తే చేతులు జోడించాలనిపిస్తుంది ఎవరికైనా.

తన పినతల్లి మాత్రం? కార్తీక స్నానానికి చిమ్మచీకటిలో చెరువుకెళుతుంటే ఏ పాపిష్ఠివాడో చెయ్యిపట్టిలాగాడని అవమానం భరించలేక ఆత్మహత్యచేసుకుని అభిమానం కాపాడుకుంది.

కాని....తనను చూసుకుంటే తనకే ఆశ్చర్యం వేస్తోంది హేమలతకు మహాపతివ్రతలకు జన్మస్థానమైన భారతభూమి మీద పుట్టి పెరుగుతూన్న తనలో యింత చిత్రమైన వూహలు యెందుకు రేగుతున్నాయి? తన పుట్టినింటి శీలవతులపవిత్రరక్తం తనలో ప్రవహించటంలేదా?

భారత నారీత్వం - పుట్టి పెరిగిన సంస్కృతీ - పురాణాలలో నీతిబోధలూ - కట్టుకున్న భర్తమీది అనురాగం - ఇవన్నీ ఒక్కసారిగా నిష్ప్రయోజనమైపోయాయా?-హాయిగా శాంతిగా భర్తనీడన సంసారం చేసుకునే భారతస్త్రీలో యింతటి క్షణికావేశం దాగివుంటుందా? పరపురుషుడి అందానికి వశ్యురాలై వివేకం మరిచి

మధ్యప్రదేశ్

రాత్రి బాగా పొద్దుపోయాక ఒక పానకాలరావు రోడ్డు పక్కగా పాకుతూ పోతున్నాడు. పోలీసువాడు అతన్ని ఆపి "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

"హేం లేదు బ్రొదర్! హైదురూపాయలనోటు కోషం వెదుకుటున్నా"

"ఎంతసేపైంది నోటుపోయి?"

"పోయిందని ఎవడన్నాడు; వెదుకుటున్నానంతే."

దానోహం చేసే వివశత్వం అవహిస్తుందా ? ఏమో ! ఎలా కాదనటం ? తనలో ప్రస్తుతం ఏం జరగటంలేదనీ .... ?

"ఆడదాని మనస్సుకూడా చలిస్తుంది సుమా !" అంటే మరెప్పుడైనా అయితే హాస్యాస్పదంగా భావించేదే హేమలత. ఇప్పుడు....ఇప్పుడు....తనమనస్సు చలించ లేదూ ? తనలో కోరికలు రేకెత్తలేదూ ?- మనస్సూ తనువూ ఒక్కలా జ్వలించి పోవటంలేదూ ?....ఈ అసంతృప్తి అగ్ని సెగలు....ఈ తీరని దాహపుమంటలు.... పెరిగి పెరిగి....వృధృతంగా పెరిగి....తనని సమూలంగా దహించి వేయవూ ? తనవుని కిని వేళ్ళంటా కదిల్చివెయ్యవూ ?

తెరలు తెరలుగా దుఃఖం ముంచు కొచ్చింది హేమలతకు. తెగిన గాలిపటంలా యథేచ్ఛగా కొట్టుకున్న మనస్సు యథా స్థానంలోకి వచ్చి వాలింది. రేగిన తేనె పట్టులా అలుముకున్న ఆలోచనలు తేలి తేలి గాలిలో కలిసిపోయాయి - తనను తను విమర్శించుకోవాలో. సమర్ధించుకోవాలో తెలీని స్థితిలో అల్లాడిపోయింది-తన వూహ లేమిటో అతీతంగా వున్నాయి. తన గమ్య మేమిటో అయోమయమైపోయింది. తనని తను నిర్బంధించుకోవాలా ? స్వేచ్ఛగా కట్లు తెంచుకోవాలా ? ఏం చెయ్యాలి ?.... అసలు తనేమిటి ? ఏమౌతోంది ?.... అర్థంకాకుండాపోయింది.

● ● ●

వెన్నెల చల్లగా లోకాన్ని పాలిస్తోంది. ఎంతోసేపటినుంచి అలా వెన్నెల చల్లద నంలో కూర్చున్నా శరీరం శాంతించటం లేదు హేమకి. మంద మందంగా పిల్లగాలులు ఒళ్ళంతా నిమిరి బుజ్జగిస్తోన్నా వూరట కల్గటంలేదు. నోరువిప్పి మాట్లాడాలంటే మనస్కరించటంలేదు - ఊహాలోకాల్లో విహరించాలంటే ధైర్యం చాలటంలేదు - నరకం అంటే వేరే యింకెక్కడుంటుంది ?- తన సంతోషమే స్వర్గం - తన దుఃఖమే నరకం.

"హేమా !"

విన్పించనేలేదా పిలుపు.

చటుక్కున కళ్ళమీద చేతుల మూతలు పడటంతో త్రుళ్ళిపడింది హేమ. అంత లోనే కోపంతెచ్చుకుని-"అబ్బ ! చేతులు తీయండి. ఏవిటా అర్థంలేని సరసం ? నేనేదో పరధ్యాన్నంగా కూర్చుంటే హఠాత్తుగా వచ్చి కళ్ళుమయ్యటం ఏమిటి ?" విసుగ్గా శేఖర్ చేతులు తోసివేసి లేచింది.

శేఖర్ మోటుగానే ఆమెని బంధించి బలవంతంగా బుగ్గమీదముద్దుపెట్టుకున్నాడు. "ఎన్నాళ్ళిలా పరాకులు చిత్తగిస్తావ్ ?"

కోపంతో మాట్లాడ దల్చుకోలేదు హేమ.

"ఇవ్వాళనీకోచిత్రమైన సంగతిచెప్తాను"

వినాలన్న కుతూహలమేం కలగలేదు హేమకి.

"పూర్తిగా వినకుండా నువ్వు కోపం తెచ్చుకోకు సుమీ !"

చిరాగ్గా అంది హేమ. - "కోపం.... అస్తమానూ ఎందుకొస్తుంది నాకు ?"

"ఇదిగో ఇప్పుడు వచ్చిందిగామరి ?- అయితే చెప్పేదా ? ఎప్పుడెప్పుడు యింటికి వచ్చి నీతో చెప్పేస్తానా అని...."

"ఏవిటో అంత గొప్పసంగతి—!"

"ఇవ్వాళో చిత్రమైన అనుభవం అయింది నాకు."

హేమ విసుగ్గా రెండడుగులువేసి పిట్ట గోడకి ఆనుకుని నించుంది.

"చిత్రం - విచిత్రం - అనుకుంటూ కూర్చోకపోతే చెప్పరాదూ ?"

"విను మరి - నేను మామూలుగా వచ్చే స్తోంటే ఓ అమ్మాయి ఆపేసింది నన్ను."- హేమ వెనగ్గా వెళ్ళి నుంచున్నాడు శేఖర్.

చిత్రంగా చూసింది హేమ.

"ఆశ్చర్యంగా వుందికదూ ? నేనూ అలాగే కొంచెం ఆశ్చర్యపోయాననుకో."

"అమ్మాయి మిమ్మల్ని ఆపటం ఏమిటి? అసలెవరావిడ ? ఎక్కడాపింది ?" ఏమంత కుతూహలం లేకపోయినా సామాన్యంగా అడిగింది హేమ.

హేమ మొహంలోకి చూస్తూ అన్నాడు శేఖర్—"రోజూలాగే నేను సైకిల్ మీద వచ్చేస్తున్నాను హేమా ! రైలుగేటు దాటిన తర్వాత చిన్నవంతెన వుంటుంది చూశావా ? అదికూడా దాటాను. రోడ్డు వారగా ఓ అమ్మాయి నిలబడి వుంది - ఎవరోలే అను కొంటూ నాదారిన నేను రాబోయాను. - చటుక్కున ఆమె సైకిల్ కి అడ్డువచ్చేసింది. చెయ్యి జాపింది. సడన్ బ్రేకువేసి ఆగాను. ఓ అడుగుముందుకు త్రుళ్ళిపడి నిలదొక్కు కున్నాను. ఒక్కసారి ఏదో సెంటువాసన గుబాళించింది. నాకేదో అర్థంలేని అను మానం కలిగింది. మామూలుగా ఆవిడకేసి చూశాను. ఏమీ మాట్లాడటంలేదు. కాస్సేపు నేలమీదికి - కాస్సేపు నామీదికి కళ్ళు తిప్పి తిప్పి చూస్తూ నించుంది. నాకేం చెయ్యాలో అర్థంకాలేదు. అయోమయంలో పడ్డట్టే అని పించింది.



"ఇదిగో అబ్బాయ్ ! ఆ మామిడి చెట్టుమీంచి దిగొస్తావా ? వెళ్ళి మీ నాన్నగారితో చెప్పనా ?"

"ఆయన నా పై కొమ్మమీదే వున్నాడు. ఇప్పుడే చెప్పు."

"మీరు....మీరు....నన్ను పిల్చారాండి ?" అన్నా ననుకుంటా. ఎలా వల్కరించానో సరిగ్గా గుర్తులేదుగానీ తడబడ్డానని మాత్రం చెప్పగలను.

జవాబేమీ చెప్పకుండా తలఎత్తి సూటిగా చూస్తూ అదోరకంగా నవ్వింది.

"ఆ అమ్మాయి వేశ్యా ఏవిటి ?" అంది హేమ వుండబట్టలేక.

"ఆఁ ఆఁ అటువంటి వృత్తిచేసుకునేదే" అన్నాడు శేఖర్.

హేమకి కుతూహలం పుట్టుకొచ్చింది- "ఆఁ అయితే అప్పు దేమైంది ? మీరు మళ్లా ఏమన్నారు ?"

"ఏమన్నానా ? వినుమరి - అవిడేం జవాబుచెప్పకుండా నవ్వుతోంటే నాకు కాస్త చిరాకువేసింది. ఆవిడ వేశ్యలాంటిదేమో నన్న అనుమానమైతే కలుగుతోందిగానీ ఏమో - ఎలా నమ్మటం ? నేనే పొరపడు

తున్నానేమో ! అంత తొందరగా అపార్థం చేసుకోవటం తప్పుకదూ ? అనుకుని కొంచెం బింకంగానే అడిగాను - చెప్పండి - నాతో ఏమైనా పనివుండి పిలిచారా ?" అలా రెట్టించటంతో ఆ అమ్మాయి మరోసారి మొహమంతా చూసి చటుక్కున తల దించేసుకుంది - "నిజంగా మీకు తెలీకే అడుగుతున్నారా ?"

నాకు మతే పోయిందనుకో, తన వుద్దేశ్య మేమిటో తేల్చి చెప్పదు. నన్నే అర్థం చేసుకోమన్నట్టు చూస్తుంది. ఆవిడ చెడిపోయిందేనని నిర్ణయించుకుందామా అంటే మనస్సు ఒప్పటంలేదు - ఒకసారి చుట్టుపక్కల చూశాను. పుచ్చపువ్వులాంటి వెన్నెల్లో అలా మేమిద్దరం రోడ్డువారకి నిలబడి మాట్లాడుకోవటం నాకే ఏమిటో వెగటనిపించింది - ఉన్నట్టుండి సైకిల్ మీద చెయ్యి వేస్తూ అంది.

"అదిగో అటుపక్కగా యిల్లు వుంది. రండి వెళ్దాం."

ఆ చొరవకి నేను నిర్ఘాంతపోయాను. అంతా అర్ధమైపోయింది. తల అడ్డంగా తిప్పుతూ - "క్షమించండి. నేను యింటికి వెళ్లాలి." అనేశాను అప్రయత్నంగా. సైకిల్ నడిపించుకురాబోయాను. గట్టిగా పట్టుకుంది హేండిల్ బార్ ని —

"నన్ను అపార్థం చేసుకోకండి. నేను అందరిలాంటిదాన్ని కాదు. మీరేం భయపడకండి." అంది దీనంగా చూస్తూ - నాకేమనాలో అర్థంకాలేదు. పిచ్చివాడిలా చూస్తూ నించున్నాను.

"నన్ను నమ్మండి. మీ ఆరోగ్యమేమీ పాడుకాదు. నేను బొత్తిగా అంతచెడ్డదాన్ని కాదు." ఆమె కంఠస్వరం వణకటం నాకు స్పష్టంగా తెలిసింది. నేను ధైర్యం చేసి అన్నాను - "మీగురించి నేను చెడ్డగా భావించటం లేదులెండి....కాని....కాని.... ఇలాంటి అలవాటు నాకెప్పుడూ లేదు."

నమ్మలేనట్టు చూసింది - అంతలోనే ముఖకవళికలు మరోరకంగా మార్చుకుందిగా "అవును. మిమ్మల్ని చూస్తూనే నలా అనుకున్నాను. అయినా నా అవసరం కోసం పిలిచాను."

"అవసరమా ? ఏమిటది ?"

నిరాశతో వూగిసలాడుతున్నట్టునవ్వింది - "మా బాధలు మీకెందుకులెండి. దయవుంచి ఒక్కసారి మాయింటికి వచ్చివెళ్తే.... సంతోషిస్తాను." ఆమె మాటల్లో మోసం, నటన....లాంటివేమీ వున్నట్టనిపించలేదు. నిజంగా ఎంతో అభిమానవతిలాగే గోచరించింది. ఒకవేపున జాలికలిగినా మొండికేసి అన్నాను - "నేను ముందేచెప్పాను. ఇలాంటి అలవాటు నాకు లేనూ లేదు. ఇష్టమూలేదు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇంటికి వెళ్ళాలి."

"మీ భార్యగారు ఎదురుచూస్తూ వుంటారా ?" నవ్వింది.

"తప్పకుండాను. నేను యింటిగడప ఎక్కేవరకూ బిక్కుబిక్కుమంటూ కూర్చుని వుంటుంది."

"అదృష్టవంతులు" గొణుక్కుంది - అంతలోనే తలెత్తి అడిగింది - "ఆవిడ చాలా అందంగా వుంటారా ?"

"చూడండమ్మా ! అలాంటి విషయాలన్నీ ముచ్చటించుకునే సమయంకాదు ఇది....మీయింటికి మాత్రం నేను రాలేనని చెప్పటానికి విచారిస్తున్నాను. ఇందాక అవసరమో....ఏదో....అన్నారే....అదేమిటో చెప్తే...నాకు వీలైతే సహాయం చేస్తాను."

అంతలోనే వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించింది నేను గాభరాపడిపోయాను. అనవసరంగా నన్నేం అల్లరిచెయ్యదుగదా అని భయపడ్డాను.

"మీరలా ఏడవకండి - చూడండీ ! ఏమైందనీ ? నేనేం అనలేదే !"

"క్షమించండి. మీరు నన్నేం అనలేదు. మిమ్మల్ని చూసి మీ మాటలు వింటోంటే నా దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. అంతా మీవంటి వుత్తములేవుంటే నావంటి దౌర్భాగ్యులు తయారయ్యేవారే కాదు....సుఖంగా భర్తతో కాపురంచేసుకుంటున్న నన్ను మచ్చిక చేసుకుని మాయమాటలు చెప్పి నమ్మించి తీసుకువచ్చి....ఈనాటి కిలా మోసంచేసిపోయాడో పుణ్యాత్ముడు." మళ్లా ఆపుకోలేకుండా వెక్కివెక్కిఏడ్చింది. కొంచెం తేరుకుని - "మాన మర్యాద లమ్ముకుని ఏడాది పసివాణ్ణి బ్రతికించుకు వస్తున్నాను - నాకు జరిగిన మోసాన్ని క్షమించలేకపోయినా నా బిడ్డని దూరంచేసుకోలేను - అన్నిటికీ చెడిపోయిన నాకు నా పసివాడైనా దక్కుతాడోలేదో - పుట్టెడు జ్వరంలో పడి వున్నాడు. మంచి మందులు వాడే అదృష్టం లేదు. నా పాప.... నా పాప...." మనస్సులో యిముడ్చుకోలేని బాధనంతా ఏడుస్తూ ఏడుస్తూ నాతో వెళ్ళబోసుకుంది. పాపం నాకు ఎంతో జాలివేసింది. ఆమెని సంతోషపెట్టటానికి ఏమైనా చెయ్యగలిగితే బావుండును." అన్పించింది. ఆమె మొహం కేసి చూస్తూ అడిగాను - "చూడండి మీరేం చదువుకోలేదా ?"

ఆమె నిట్టూర్చింది—"అవును. మీలా తెలిసినవారంతా నాదే తప్పంటారు. భర్తకి ద్రోహంచేసి పరాయివాడితో లేచివచ్చిన నాకు వివేకంఏది ? ఎంత చదువుకుంటే మాత్రం ఎందుకు ? కాల్చనా ? దురదృష్టదేవత నెత్తెక్కి అలా ఆడించింది....అంతా నా ఖర్మ....ఖర్మ ..." అంటూ వాపోయింది.

"జరిగిపోయిందానికి బాధపడి ఏం ప్రయోజనం ? పోనీ యింటికివెళ్ళి క్షమాపణ కోరుకుంటే...." నామాటలు నాకే అసందర్భంగా వినిపించాయి. ఆమె విచిత్రంగాచూసింది - "నన్ను ఎగతాళీ చేస్తున్నారా బాబూ ? ఎవరితోనో లేచిపోయి

మేనేజరు హెడ్ గుమాస్తాను పిలిచి "ఇదిగో. కొత్తగా వచ్చిన ఆ గుమాస్తా రోజల్లా ఏం చేస్తూవుంటాడు ఆఫీసులో ?"

"ఈగలు తోలుకుంటూ వుంటాడండి"

"అంతేనా :"

"అప్పుడప్పుడు ఒకటీ అరా ఈగల్ని పట్టుకుంటూ వుంటాడండి."

పిల్లనికని మళ్ళాయింటికివస్తే ఆ ద రి ం చ టానికి ఆయనేం మానవాతీతుడా ? పరువు మర్యాదలులేని అనామకుడా ?....ఆ పుణ్యాత్ముడికి మళ్ళా ఈమొహంచూపించగలనా ? నావల్లకాదు....నావల్లకాదు - ఈ రకంగా కూడా బ్రతుకు గడవకపోతే నా గోదావరి తల్లివుంది, నేనువున్నాను."

"తప్పు, అలాంటి పనెప్పుడూ చెయ్యకండి. మీ అబ్బాయి పెద్దవాడైతే మిమ్మల్ని చూస్తాడు. ఆ ఆశపెట్టుకు బ్రతకాలి—"

నిరాశగా నవ్వింది - "వాడు బ్రతికి నప్పటిమాటకదా నన్ను బ్రతికించటానికి ?"

గుర్తువచ్చి చటుక్కున పర్స్‌తీశాను. ఒక పదిరూపాయల నోటూ కొంత చిల్లరా- "చూడండమ్మా ! ప్రస్తుతానికి యిదే నాదగ్గిరవుంది. అబ్బాయికి వైద్యం చేయించండి." అంటూ యివ్వబోయాను

ఆశ్చర్యంగా చూసింది - "మీరు మా యింటికి రానన్నారుగా ?"

"రాకపోతేనేం ? పసిబిడ్డకోసం నే నిది యిస్తున్నాను. తీసుకోండి. అనుమానం ఎందుకు ?"

"ఒద్దులెండి. అందరూ మీవంటి మగవాళ్ళే అయితే నేను బ్రతకలేనని భయపడాలిగానీ....ప్రస్తుతానికి ఆ బెంగేమీ లేదు. మరో గంటసేపు యిక్కడే నించున్నానంటే రెండో మూడో సంపాదించుకోలేకపోను. ఈ పది రూపాయలూ నా కిచ్చి అపాత్రదానం చేయకండి. మీకు తృప్తివుండదు. నాకు సంతోషమూ వుండదు.

"మీ పరిస్థితులు మీవి. మిమ్మల్ని నేను విమర్శిస్తాననుకోవద్దు. ప్రతీ మనిషీ వున్నంతలో, వున్నతంగా బ్రతకాలనే ఆశిస్తాడు. మీ రింత దిగజారిపోయారనుకుంటే ఇంతకన్నా మరో దారి లేకనేకావచ్చును. మీకేదో నీతి బోధచేయాలనీ మిమ్మల్ని మార్చాలనీ నా వుద్దేశ్యంకాదు. పసివాడు జ్వరంతో వున్నాడన్నారు. వెంటనే యింటికి వెళ్ళి ఏ డాక్టర్‌దగ్గిరికైనా తీసికెళ్ళి మందు వేయించండి. అందుకే ఈ డబ్బు సంతోషంగా యిస్తున్నాను-" అంటూ నోటు ముందుకు చాపాను.

ఆమె ఆవేశంగా చేతులు జోడించింది- "మీరు సాక్షాత్తు దైవస్వరూపులు. మీ భార్య కలకాలం పసుపుకుంకుమలతో వర్థిల్లాలి. చెడిపోయిన ఆడదానితో ఇంత గౌరవంగా- ఇంత అభిమానంగా మాట్లాడే మగవాడిని నే నెన్నడూ చూడలేదు. అన్నగారూ ! ఈ డబ్బు తీసుకుంటాను. మీ చేతి చలవ వల్ల నా బిడ్డ నాకు దక్కుతాడుకూడాను. ఈ దౌర్భాగ్యురాల్ని మర్చిపోకండి- మిమ్మల్ని జీవాలున్నంతకాలం గుర్తువుంచుకుంటాను....మరి వెళ్ళిరండి." ఆమె కంఠం రుద్ధమైంది. నాకుకూడా దుఃఖం ముంచుకు వచ్చినట్లయింది. ఏమీ మాట్లాడలేకపోయాను-"వెళ్తానమ్మా !" అనేసి రెండడుగులు ముందుకు వేసి ఆగి వెనక్కి చూశాను. ఆమె కదల్లేదు. నాకేసే చూస్తూ నించుంది.

"మీ పేరేవిటమ్మా ? అభ్యంతరం లేకపోతే...."

"నా చరిత్ర తెలిసి నా పేరువింటే.... అసహ్యించుకుంటారు .... చెప్పమంటారా ? రుక్మిణి....చూశారా ? ఎంత పవిత్రమైన...."

"పేరులో ఏముంది ? వస్తానమ్మా !" అనేసి సైకిల్ నడిపించుకుని రోడ్డుమీదికి

వచ్చి ఈ జరిగిందంతా నీకు చెప్పాలని ఆఘమేఘాలమీద వచ్చేశాను." శేఖర్ హేమభుజాలు పట్టి కుదుపుతూ అన్నాడు- "విన్నావా ? ఎలా వుంది ?"

ఆలోచనల్లోంచి తేరుకుంటూ అంది హేమ - " విన్నాను. విన్నాను." నాలుగడుగులు నడిచి కొబ్బరి ఆకులు వాలేచోట పిట్టగోడకి ఆనుకుని కూర్చుంది - శేఖర్ ఆమె గడ్డం పట్టుకుని కళ్ళలోకి చూస్తూ అడిగాడు —

"నీకేమైనా కోపం వచ్చిందా నామీద?"

"ఎందుకు ?''

"అలా అంతసేపు ఆవిడతో మాట్లాడానని.''

"కోపం రాలేదుగానీ - మిమ్మల్నికొన్ని విషయా లడగాలనుకుంటున్నాను. మన స్ఫూర్తిగా చెప్తారా ?''

"హేమా ! నామీద నీకెందు కలాంటి అనుమానం వచ్చింది ?''

"అయితే చెప్పండి. మీ రెందుకని ఆమెతో వెళ్ళలేదు ?''

"ఇదేం ప్రశ్న ? నేను ఆమెతోవెళ్ళటం తప్పుకాదా? నీకుతెలీకే అడుగుతున్నావా ?"

"ఏం తప్పు ? ఎందుకు తప్పు ? మీ వుద్దేశ్యం చెప్పండి. తప్పేవిటో ఒప్పేవిటో నాకేం తెలీటంలేదు. మగవాళ్ళు ఏంచేసినా తప్పుకాదటగా ?"

"నిజమే. సంఘం అలాగే అంటుంది. కాని అందులోనాకుధర్మంకన్పించటంలేదు."

"ఎందుకని ?"

"మనస్సు అనేది స్త్రీ పురుషులిద్దరికీ ఒక్కటే. శారీరక సుఖాలు యిద్దరికీ



రోడ్డు రిపేరు జరుగుతున్నచోట ఒకరు : "చూశారా ! ఆ మిషను రోడ్డు నెలా తవ్వేస్తోందో !"

మరొకరు : "అవునుమరి. అదే లేకపోతే వందమంది కూలీలు గునపాలతో తవ్వాల్సి వచ్చేది."

మొదటివాడు: గునపాలులేకపోతే లక్షమంది చెంచాలతో తవ్వాల్సి వచ్చేది !"

కావాలి. కాదంటే అది మన మూర్ఖత్వమే అవుతుంది. అవునంటావా ?"

"ఊఁ"

"అందుకే యుక్తవయస్సు వచ్చేసరికి వివాహం పేరిట ఒకస్త్రీని, మరొక పురుషుణ్ణీ న్యాయ సమ్మతంగా కలపటం జరుగుతుంది. వారిద్దరే ప్రకృతీ పురుషులుగా జీవిస్తూ సృష్టిధర్మాన్ని పెంచాల్సి వుంటుంది. చూడుహేమా ! అందరూ యిలా కొన్ని కట్టుబాట్లకు లోనై బ్రతికితేనే సంఘం మొత్తంగా శాంతి సౌఖ్యాలతో నిండి వుంటుంది."

"కాని ....ఆ స్త్రీ పురుషుడికిగానీ........ పురుషుడు స్త్రీకిగానే యిష్టంకానప్పుడు ?''

"అది వ్యక్తిగతం—అలాంటి పరిస్థితి రాకుండా వివాహానికి ముందే జాగ్రత్త పడాలి."

"పోనీ వివాహం జరిగాకే అలాంటి అయిష్టాలేమైనా సంభవిస్తే....?"

"న్యాయమైన కారణం వుండాలి అప్పుడే వాళ్ళని సమర్ధించటానికిగానీ క్షమించటానికిగానీ అర్హత వుంటుంది - ప్రస్తుతానికి నా విషయమే తీసుకో. నేను రుక్మిణితో వెళ్ళటం తప్పుకాదంటావా? నీవల్ల నేనేమైనా అసంతృప్తి పొందుతున్నానా? సుఖపడలేకపోతున్నానా? ఎందుకని నా నీతిని నేను పోగొట్టుకోవాలి?''

''నీతి మగవాడికి కూడా ముఖ్యమంటారా?''

''ముమ్మాటికీ. మగవాడు నీతిగావుంటే ఆడది చెడిపోయేమార్గం లేదు.''

''అయితే ఒక్కటి చెప్పండి. నీతి శాస్త్రాలు వల్లెవేసుకుని దానికోసమే కోరిక చంపుకుని కట్టుబడ్డారా? లేక....''

''హేమా! ఇంతకాలానికి కూడా నన్ను అర్థంచేసుకోలేక పోయినందుకు విచారిస్తున్నాను. నిన్ను తప్పితే యింత సన్నిహితంగా మరెవ్వరినీ రానివ్వలేను. నామనస్సునిండా నిన్నే ప్రతిష్ఠించుకున్నాను. భగవంతుడు ప్రవేశించటానికి కూడా చోటు లేదు.'' ఆవేశంగా హేమని గుండెలకి అదుముకున్నాడు శేఖర్. హేమ లేవటానికి ప్రయత్నించకుండావాలిపోయి పడుకుంది-''

''ఆ రుక్మిణి అందమైందేనా?''

''అంటే?''

''అంటే తెలీదా? నాకన్నా అందంగా వుందా?''

"చాలా అందంగా వుంది. మిసమిసా మెరిసినట్టు కన్పించింది."

"వెన్నెల్లో అలా కన్పించిందేమో...."

"కాదు. ఈ వెన్నెల్లో వున్న నీశరీరం అంత తెల్లగాలేదు."

"పోనీ జుట్టు నొక్కునొక్కులుగా అందంగావుందా?"

"చెప్తానుండు. అందమంటే యిప్పుడర్థమైందినాకు - నీ అంచనాలప్రకారం రుక్మిణి సౌందర్యరాశి అంటే అతిశయోక్తి కాదు. విశాలమైన కళ్ళు మూగభావాలు ప్రదర్శిస్తోంటే చూడడానికి విచిత్రంగా వుంటుంది. శంఖంవంటి ఆమె నున్నని మెడలో ఒకే ఒక నల్లపూసలదండ. నుదుటి మీదికి పరిగెత్తి గంతులేసే అల్లరిజుత్తుని అదిలించాలని అస్తమానం ప్రయత్నిస్తూనే వుంటుంది. ఆమె అలంకరణలోకూడా ఏదో గాంభీర్యం పుట్టిపడుతుంది. ఆమె చదువుకున్నదికూడాను. సున్నితంగా, వివేకంగా మాట్లాడుతుంది-ఆమెలోవున్న సంస్కారం అన్నివిధాలా ఎదటివ్యక్తిని ఆకర్షించగలదు."

హేమ చంద్రుడిలోకి చూస్తూ అడిగింది హేళనగా-"అంత అందాలరాశి మీ కెందుకని నచ్చలేదు?"

"హేమా! ఎదటివ్యక్తిని అర్థంచేసుకోలేకపోతే అది నీ బలహీనత. ఆమె ఎటువంటిదని నువ్వడిగితే నిర్మొహమాటంగా చెప్పాను. అంతే. నాకు కావల్సింది మాత్రం ఆమె అందచందాలు కావు - రంభ ఎలావుంటుందో చూడకపోయినా రంభను తలపింపజేసేవాళ్ళు నిత్యజీవితంలో తరుచూ తారసపడుతూనేవుంటారు.

"ఒక్కమాట- అడ్డువచ్చాననుకోకండి. అటువంటి సమయాలలో మనస్సు ఎన్నడూ చలించలేదా?"

గర్వంగానవ్వాడు శేఖర్-"ఎన్నడూలేదు. ముందు అలా జరగదని కూడా చెప్పగలను. నామీద నాకు అంతమాత్రం విశ్వాసంవుంది. నన్ను నమ్ము హేమా! నా మనస్సులో హత్తుకున్నచిత్రం అంత తేలికగా చెదిరిపోదు. నన్ను నమ్మినవ్యక్తికి నేనెన్నడూ మోసం చెయ్యలేను. ఒకరకంగా యిది నా బలహీనత కూడాను.''

పవిత్రతతో ప్రకాశిస్తోన్న శేఖర్ కళ్ళలోకి చూడలేక తల దించుకొంది హేమ.

''హేమా! నిజంచెప్పు. ఎంత నవమన్మథమూర్తిని చూస్తేమాత్రం నీ మనస్సు చలిస్తుందా? స్త్రీ హృదయానికున్న పవిత్రత పురుషుడికి లేనే లేదనుకున్నావా?''


భయంతో బిగుసుకుపోయింది హేమ. తన మనస్సు తెలుసుకుని అపహాస్యం చేయడం లేదుకదా! అన్నట్టు జంకుగా చూసింది.

"ఎందుకలా చూస్తావ్? తప్పుగామాట్లాడానా?"

"................"

"మాట్లాడు హేమా! కోపంవచ్చిందా?"

"లేదండీ! నాకేం కోపంరాలేదు." బావురుమని ఏడవాలనిపించింది. తను ఎంత నీచమైందో తెలిస్తే శేఖర్ ఏమౌతాడో! అతని అనురాగానికి ప్రతిఫలం నిజంగా తను యివ్వలేకపోతోందేమో! లేకపోతే మగజన్మఎత్తిన అతడే అంత పవిత్రంగా వుంటుంటే తను....తను....ఇంత చలించిపోవటం ఏమిటి?—



ఒక 'జూ'లో ఏనుగు చచ్చిపోతే అంతా కంటతడిపెట్టారు. ఆ ఏనుగు సంరక్షణభారం ప్రత్యేకంగా చూసే వాడుమాత్రం గుండెలు బాదుకుంటూ గంటపైగా ఏడ్చాడు. వాణ్ణి చాలా సేపు ఓదార్చి "ఎందుకింత ఏడ్చావోయ్" అని అడగ్గా "దాన్ని పాతేసేందుకు గొయ్యితవ్వేది నేనేకదా!" అని మళ్ళీ బావురుమన్నాడు.

"ఎందుకంత మౌనంగాకూర్చున్నావు?"

"అబ్బే! ఏంలేదు. రుక్మిణిగురించి ఆలోచిస్తున్నాను."

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఆమె తప్పేచేసిందికదూ!

"అంతే అనక తప్పదు మరి. వివాహం - భార్యాభర్తల బంధం కేవలం శారీరక సౌఖ్యాలకోసమేకాదు. సామాజికంగా, నైతికంగా కొన్ని బరువులూ బాధ్యతలూ వహించాల్సివుంటుంది - అవసరమైనచోట త్యాగ ధర్మంకూడా నిర్వర్తించాలి-నేను నా యిష్టంవచ్చినట్టూ నువ్వు నీ యిష్టంవచ్చినట్టూ సంచరిస్తే ఇక మనకిబంధం ఎక్కడిది? ఈ మమకారం ఎక్కడిది? నువ్వు నాకోసం

నిరీక్షిస్తూవుంటావని తెలిసినప్పుడే నేను నిన్ను చేరుకోవాలని తహతహలాడగలను. న్యాయసమ్మతంగా మనకు సంతానం కల్గితే సంతోషంగా స్వీకరించగలం—మన సంఘ నియమాలు ఎంత కఠినమైనవో అంత మృదువైనవి కూడాను."

"స్త్రీపట్ల అన్ని విధాలా న్యాయం జరుగుతోందంటారా?"

"లేకపోవచ్చు. క్రమంగా అదికూడా పొందగలం. ఈ నీతినియమాలు-ఈ కట్టుబాట్లూ లేకపోతే "నా" అనేదేమీ మిగలదు. నువ్వు నా ఒక్కడికే భార్యవుకావు. ఇది మన యిద్దరికే యిల్లుకాదు - నీమీద అందరికీ హక్కువుంటుంది. అలాగే నేను నీవంటి వాళ్ళు చాలామందితో సంబంధాలు పెట్టుకోగలను. అప్పుడు ఎవరి స్వార్థం వాళ్ళది. ఒకరి కష్టసుఖాలు ఒకరివికావు. ఒకరి మంచి చెడ్డలు మరొకరివికావు."

"పోనీ ఆర్థికంగా అందరూ సమానత్వాన్ని పొంది ఎవరి స్వార్థం వాళ్ళే చూసుకోవచ్చుగా? ఒకరిమీద ఒకరు ఆధారపడటం దేనికి? అవకాశాలు యిస్తే స్వతంత్రించి బ్రతకలేదూ?

"స్త్రీ పురుష భేదం ఎందుకు? మొత్తంగా ఆలోచిస్తే ధనాన్నీ దర్జానీ—అధికారాన్నీ - హోదానీ-అఖరికి శారీరక సుఖాన్నికూడా మరిపించే శాంతిదాయకమైన అనురాగాన్ని కోరుతుంది అంతరంగం. శరీరంలో జవసత్వాలు వున్నంతవరకే ఈ విచ్చలవిడితనం పనికివస్తుంది. ఆటు తర్వాత అతి ప్రశాంతమైన స్థానం కావాలి విశ్రమించటానికి. అప్పుడది ఎలా సాధ్యం?- రుక్మిణి విషయం చూడు. భర్త దగ్గరేవుంటే ఆవిడ కష్టసుఖాలూ ఆ బిడ్డ బాధత్యలూ అతనే వహించేవాడు. కాని ఆవిడ పుష్మటిపోత్తు. సుఖించటానికే గాని భరించటానికి ఎవ్వరూ ముందుకురాలేరు. ఒకే తప్పు స్త్రీ పురుషులిద్దరూ చేసినా దాని ఫలితం - ఒక్క స్త్రీయే అనుభవిస్తోంది ప్రత్యక్షంగా. స్త్రీ మీద ప్రకృతే పవిత్రమైన బాధ్యత పెట్టింది. దాన్ని అంత పవిత్రంగా నిర్వర్తించాల్సిన అవసరం స్త్రీకి వుంది. తనబిడ్డకు తండ్రి ఎవరో తెలుసుకోలేని స్త్రీ మనోవేదనకన్నా క్షణికమైన శరీర సుఖంలో వున్నతివుందా? అందుకే అన్ని కట్టుబాట్లూ - అన్ని నియమాలూను. చెడిపోవటంలో కూడా సమానత్వం కావాలా స్త్రీకి?''

వింతగా చూసింది హేమలత. ఏదో ధైర్యం తెచ్చుకుని చిత్రంగా అడిగింది - ''నామనస్సు ఎన్నడూ చలించివుండదని మీరనుకుంటున్నారా?''

"మానవుడికి చాంచల్యం అతి సహజం. నీలోనూ ఆ ధర్మంవుంటే వుండవచ్చును. కాని మనం వివేకంగల వ్యక్తులం. ఆలోచించగలగటం మన జన్మహక్కు - పశువులకీ మనకీ తేడావుంది. ఉండాలి. మనస్సు చలించినంత మాత్రాన మన వివేకం ఏమౌతుంది? నీ సుఖదుఃఖాలు అంచనా వేసుకోలేని హీనస్థితిలో నువ్వున్నావని నేను అనుకోను."

హేమ స్థాణువులా కూర్చుండిపోయింది. తనకు ఏదిసుఖం? ఏది దుఃఖం? శాశ్వతమైన శాంతిమార్గమా? క్షణికమైన శరీర సౌఖ్యమా? ఏది?....ఏది?....తటుక్కున మోకాళ్ళలో తలదాచుకుంది.

"హేమా! ఏమిటి? ఏమైంది?" ఆతృత పడ్డాడు శేఖర్.

హేమ వెక్కి వెక్కి ఏడుస్తూ అతని హృదయంమీద వాలిపోయింది.

"ఏమైంది హేమా ఏడవకు. ఏడవకు. ఈ ఒక్కరోజు నాతోసరదాగా మాట్లాడుతూ కూర్చున్నావు. వారం రోజులనుంచీ—"

"నన్ను క్షమించరూ నన్ను నన్ను...." మాటలు పెగలలేదు. శేఖర్ గుండెలమీద చేత్తో రాస్తూ అతని బుజంమీద తల ఆన్చుకుంది హేమ.

"ఏమిటో నాకుచెప్పు హేమా! నేను వుండగా నువ్వు ఒక్కదానివే బాధపడవచ్చునా? నీ కష్టం నన్నూ పంచుకోనీయవూ?'' హేమకళ్ళు ఒత్తి చెంపలు తుడిచి బుజ్జగించాడు శేఖర్.

దుఃఖావేగం తగ్గి కొంత ఉపశమించింది హేమ—"వారంరోజుల క్రిందట నాకో పాడుకల....పీడకల వచ్చింది."

"పీడకలా? ఏమనీ?"

"పెద్ద విషపునాగు నా గుండెమీద బలంగా కాటువేసింది - అంతే. ఆ దారుణ విషం నాలో నరనరానా పరిగెత్తి నా శరీరమంతా వికృతమైపోయింది. నా రూపమే మారిపోయింది. నేను సజీవంగానే యమయాతన అనుభవించాను."

"హేమా! ఇంతచిన్న విషయానికి బాధపడాలానువ్వు? జీవితంలో ఒక్క పీడకలేవిటి? ఎన్నో విషాద సంఘటనలు ఎదుర్కోవలసివుంటుంది. ఎంత దారుణమైన పరిస్థితులు సంభవించినా సడలిపోకూడనిది మనోధైర్యం - ఆత్మవిశ్వాసం.అప్పుడు ఏ పీడకల ఏమీచెయ్యలేదు."

ఆ మాటలు హేమ హృదయానికి చాలా వూరట కల్గించాయి. నిజంగా పీడకలే వచ్చింది. కాకపోతే ఏమిటి? తను మారిపోవటం ఏమిటి? తన మనస్సు....చలించటంఏమిటి? అందానికి అవధివుందా? సుఖానికి సరిహద్దువుందా? తనకి వున్నదే పరమావధి! తను పొందగలిగేదే పెన్నిధి.

శేఖర్! నిజంగా....తనపాలిట పెన్నిధి కాదా? తనకు....దేవుడిచ్చిన వరంకాదా? తన శేఖర్‌కన్నా....సౌందర్యమూర్తి మరెవరు? హాయిగా తేలిపోతోన్న మనస్సుతో తలఎత్తి ఆకాశంలోకిచూసింది అరమోడ్పు కన్నులతో....

చిలిపిజాబిల్లి ఫక్కుమని నవ్వింది.

□□□



ఒకావిడకి కళ్ళజోడును సిఫార్సు చేస్తూ చిన్నప్పటినుంచే జోడు పెట్టుకుని వుంటే చూపు యింతపాడై వుండేదికాదని డాక్టరు మందలించాడు. ఆవిడ మొగుడు కళ్ళజోడు కాని బిల్లును వెంటనే మామగారికి పంపించాడు.

[illegible] పంచాంగము

మే

1. గిరులకు పూర్వం యోగులు
పోయేవారు
ఇప్పుడు భోగులు పోతున్నారు
నీలగిరులకు

2. మధ్యాహ్నం నిద్రపోవుట మంచిది
ఒక్కదినం రెండుదినాలుగా తోస్తుంది.

3. మలబారులో కోమలాంగులు
రవికవేయనందువల్ల మూడు ప్రతిఫలాలు
ఒకటి, రవికడబ్బు మిగుల్చు;
తతిమ్మారెండూన్నూ తెలిసినవే.

4. స్త్రీని పేరుపెట్టి పిల్చుట తప్పు. కాని
ముద్దుపేరుపెట్టి పిల్చుట ఒప్పు.

5. పెళ్ళికావలసిన ఆడపిల్లలకు
పరధ్యానముకాదు. వరధ్యానమెక్కువ.

6. కామంలేనిది
పసివానికి. తపసివానికి
మటుకేను.

7. సామాన్యులనే మాన్యులుగా
తలంచు పద్ధతి
డెమాక్రసీ.

8. వెలదియనగా విపరీతముల
విచిత్ర సమ్మేళన :-
ప్రియమును, పరసమును గూర్చు
నెరజాణ.

9. విప్పుటకు వీలుకానిది
ప్రేముడి.

10. నరుల నమరుల కావించునవే
మరులు.

11. ముందుకు పోవటమంటే మనకు
మహాకష్టం.
బస్సులోగాని, బండిలోగాని,
సంఘంలోగాని.

12. వారనారియింటికి, చాలా
రాకపోకలు జరుగుతాయి.

13. గ్రామాలు గరిక ప్రదేశాలేగాని,
నాగరిక ప్రదేశాలుగావు.

[illegible] పంచాంగము

14. ఉత్తమాంగం అనిపేరే కాని.
చాలామందికి ఉత్త అంగంమటుకేను

15. ఈనాడు స్టాకు బ్రోకరువద్దకు.
రేపు పాన్‌బ్రోకరువద్దకు.

16. బిడ్డలందరికీ ఇష్టమగు కూర
క్యూటికూర.

17. చుక్కెదురు కావడం మంచిది
కాదుగాని. చక్కని చుక్కెదురు
కావడం అదృష్టమే.

18. రామరాజ్యం కాదు నేనుకోరేది.
నేనుకోరేది విరామరాజ్యం.

19. మన్ను ఊవారంగుతో గుడికట్టుకొని
మిన్నుగా అయింది.

20. కుంతికి కర్ణుడు కన్నెలోని పాప.

21. ఇంతి నడుము పూజ్యము.

22. చీట్లాడువారి$^{\circ}$. త్రైస్తవులకు
ఏసుదయవుండాలి.

23. రతిశాస్త్రంలో ముద్దు పిల్లవానికి
నోటికి నోరు వస్తుంది.

24. ఎత్తువేయుటలో
పొట్టివాళ్ళే గట్టివాళ్ళు.

25. ఈనాడు సబ్బుకన్నా సున్నగా
జారిపోతూన్నది డబ్బు.

26. మే. జూనామాసాలుసహాధ్యాయినుల్లాగ
సెలవులతో నవ్వినాయి
విద్యార్థికి.

27. సాని పైకి వుంచేది పైసా.

28. ప్రపంచంలో పయికాలు వున్నవానిదే
పయిచేయి.

29. కరగ్రహణానికి ముందు
వేలు కావాలంటాడు. ఈనాటియువకుడు.

30 తీసినా వేసినా బాధ కల్పించునవి
పన్నులు.

31. నీలగిరిలో నూనె. తేనె తప్ప
మిగిలింది ఏది కొవినాకూడా
చాలా నూనె.

స్వరలహరి

స్వరాలరాజు టి. వి. రాజు

శ్రీ టెలివిజన్ (టి. వి.) రాజుగారిని, 'టింగు రంగా' వెంకట్రాజుగారని కూడా అంటూ వుంటాం. ఎందుచేతంటే వీరిని ప్రజా దృష్టిలో పడేసిన ప్రథమ చిత్రం "టింగు రంగా." అదీగాక, ఎలాంటి చిక్కుల్లో చిక్కుకున్నా, ఏమంతైనా చీకాకు చెందకుండా, సాయంత్రం అయేసరికల్లా, గ్లాస్గో జుబ్బా, పంచె ధరించి, వ్రేళ్ళసందున సగం కాలుతున్న సిగరెట్టుఖండాన్ని బలంగా పీల్చి, "టింగురంగా" అని బయలుదేరి, పాండీ బజార్లోనో మరో ప్రదేశంలోనో మిత్రులతో ముచ్చటగా ముచ్చటిస్తూ, తను నవ్వుతూ అందర్నీ నవ్వించడం అనేది, వీరి దైనందిన కార్యక్రమంలో ముఖ్యమైనది.

పూర్ణానుస్వారంలా గుండ్రని ముఖం, ఫ్రెంచికటింగు మీసం, బూరి బుగ్గలూ, భారీ శరీరం, "వ స్త్ర శి ర ం" ఆదిగాగల ప్రత్యేక లక్షణాలు గల వీరిని ఎట్టిగుంపులోనైనా ఇట్టే ఆనవాలు పట్టేయగలరు పరిచయస్తులందరు. నిగనిగలాడే వీరి శిరస్సు పైభాగం పండిన మేధకు నిదర్శనం. వెన్నెల రాత్రుళ్ళలో, ఆకాశంలో పయనించే అందాల చందమామ, వీధినిపోయే వీరి శిరోదర్పణంలో ధగధగ మెరిసే తన ముఖమండలం చూచుకుంటూ మురిసిపోతూ వుంటాడు. రాజుగారు రాజులేగాని, రాజతంత్రం (పొలిటిక్సు) నేర్వనివారు. ఎవరైనా ఏదైనా చ ప్ప ని జోకు చెప్పినా, ఛప్పన నవ్వి, పెద్దగా అభినందించే మొగమాటస్థులు.

హిందూస్తానీ, పాశ్చాత్య సంగీతాలంటే పంచప్రాణాలూను. క ర్నా ట క సంగీతమన్నా, కావలసినంత అభిమానం కలవారే. వీరు మెచ్చేలాగ సంగీతం యిచ్చే బొత్తాహ సంగీత దర్శకులలో ము ఖ్య లు, మనందరికీ కూడా నచ్చే నౌషద్, సి. రామచంద్ర, మదన్‌మోహన్, సలిల్ చౌధురీ, శంకర్ జైకిషన్, సజ్జాద్ హుసేన్ మున్నగువారలే. ఈ పైపేర్లుగల హి ం దీ చి త్రా లు తప్పకుండా చూడడం విరివిగా గల వీరి హాబీలలో ఒక ము ఖ్యా ం గ ం. క్రికెట్

పి. బి. శ్రీనివాస్



సంగీత ప్రదర్శకుడు, సంగీత దర్శకుడు

ఆడడం (ఇతరులు) చూడడం, వినడం మరోహాబీ. చ ద ర ం గ ం ఆట ఆడడం బాగా చేతవును. జీ వి త పు చదరంగంలో మాత్రం పరుల్ని పల్టీకొట్టించే చతరంగపు ఎత్తులు వేయడానికిచ్చగించరు. సుతరామూ సౌమ్యులు. సాధుశీలురు. స్నేహపాత్రులు. ధనంజయ గోత్రులు. గో త్ర ం అనగా జ్ఞాపకం వ చ్చి ం ది-వీరి యింటిపేరు.

ఆంధ్రుల అభిమానపుటాకు కూర అనబడే "ఉద్యానశాకం" (తో ట కూ ర) వీరి గృహనామం.

వీరు 1918 ప్రాంతంలో, రాజమండ్రి తాలూకా తాలూకు రఘుదేవపురంలో తోటకూర వంశాంకురులై అవతరించారు. వీరి తండ్రి శ్రీ సోమరాజుగారు వసుధానాథులు (భూస్వాములు). ఆరేళ్ళ చిరుతప్రాయంలోనే రాజుగారు పితృహీనులైనందువల్ల చదువు సాగక, ఫోర్తుఫారంవరకూ చదివి, ఫుల్‌స్టాప్ పెట్టేశారు విద్యకి. కాని సంగీతజ్ఞానం మట్టుకు దినదినాభివృద్ధిచెందింది. రఘుదేవపురంలోనే శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచారిగారి గురుత్వంలో మూడేళ్ళు నేర్చుకున్న జ్ఞానంతోనే, 1934 సంవత్సరంలో శివరాత్రి తర్వాత పాఠాలు చెప్పడం ప్రారంభించారు అమ్మాయిలకి. ఆ కాలంలోనే వీరికి మంచి నాటకానుభవంకూడా చేకూరింది. కోరుకొండ, రాజమండ్రి ప్రాంతాలలో డ్రామాల్లో వేషాలువేసేవారు. తనకి తనే పాడుకునేవారు. ఆ రోజుల్లో, ఇప్పటిలా "ప్లే బ్యాక్" వుండేదికాదు. కనక పాడగలిగినవాళ్ళే వేషాలువేయగలిగేవారు. వీరు లోహితాస్యుడు, కనకసేనుడు, కబీరు, నారదుడు, కృష్ణుడు వగైరా పవిత్రమైన పాత్రలు ధరించి తరించేవారు. సురభి డ్రామాట్రూపులో హార్మోనీ వాయించేవారు. రెండుమూడేళ్ళు తమిళదేశంలోని రాజపాల్యంలో, అన్నగారైన శ్రీ సత్యనారాయణరాజుగారితో వుంటూ, అక్కడి హైస్కూల్లో అరవడ్రామాల్లో చిరంజీవి మార్కండేయుడుగా జీవించారు.

1934 మొదలు ఏడెనిమిదేళ్ళు, మ్యూజిక్ ట్యూషన్లతోనూ, డ్రామావేషాలతోనూ సాగాయి. అనకాపల్లి, చోడవరం వంటి వూళ్ళల్లో ఆనాటి ప్రఖ్యాత అభినేత్రి శ్రీమతి అంజనీకుమారి (అనగా నేటి అంజలీదేవి) జరిపే నృత్యప్రదర్శనలకూ "మిస్. ప్రేమా బి. ఏ" లాంటి వార్‌ఫండ్ డ్రామాలకూ హార్మోనీవాయిస్తూ సంగీతశాఖలో ఒక ఆకుగా వుండేవారు. గుత్తి వంకాయకూరను ప్రేమతో వండిపెట్టిన శ్రీ బి. వి. నరసింహారావుగారి డ్యాన్సు గ్రూపుతోకూడా రాజుగారు కొన్నాళ్ళు తిరిగారు. ఆదర్శ నాట్యబృందంలోకూడా పాల్గొనేవారు. ఈ సందర్భంలో, ఆంధ్రా ఒరిస్సా పరిసరాలు యావత్తూ పర్యటించగలిగే అపూర్వావకాశం పొందగలిగారు. ఈ నాటక ప్రకరణంముగిసి, సినిమాజీవితం ప్రారంభమైంది 1946 లో.

శోభనాచల స్టూడియోలో హార్మోనిస్టు పోస్టు ఖాళీగావుందని, శ్రీమతి రమాజోషీ వీరిని తంతియిచ్చి పిలిపించారు. తీరా మద్రాసు వచ్చేసరికదివరకే ఆ ఖాళీ భర్తీ అయిపోయిందని తెలిసేసరికి, నిరాశతో వేడి నిట్టూర్పు వదిలారు. కాని కొన్నాళ్ళకే, శ్రీమతి కాంచన్‌గారి మొదటి చిత్రంలో సంగీత దర్శకులైన శ్రీ నాళం నాగేశ్వరరావుగారికి సహాయం చేస్తూ పనిచేశారు. తిరిగి, శ్రీమతి కృష్ణవేణిగారు, ఎమ్. ఆర్. ఎ. ప్రొడక్షన్సు నిర్మించిన "మనదేశం"లో ఆర్గన్ - వాయించడానికి నియుక్తులయారు. తదుపరి అంజలి ఆదినారాయణుల ఆదరాభిమానాలు పొంది, శ్రీ బి. ఏ. సుబ్బారావుగారికి, "పల్లెటూరిపిల్ల"లో శ్రీ ఆదినారాయణరావుగారికి, ఎసోసియేట్‌గాకుదిరి, ఎసిస్ట్‌చేశారు. శ్రీయుతులు ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావుగార్లతో కలిసి వీరారోజుల్లో, మాంబళంలో వ్యాసారావు వీధిలో నివసిస్తూ వుండేవారు. ఈ ముగ్గురిమధ్యా ముచ్చటైన మైత్రి కుదిరింది.

వీరు స్వతంత్రంగా సంగీతదర్శకుడుగా పేరుపొందిన ప్రథమచిత్రం "టింగురంగా" యే. ఇదే చిత్రం తమిళంలో "శ్యామల"గా రూపొందింది. ఈ చిత్రాల ఘనవిజయం వీరిని ఫిలింపొలంలో లోతుగా నాటి నిలబెట్టింది. తదాదిగా లెక్కకందని పెక్కు చిత్రాలకు చక్కని చిక్కని సంగీతం యిచ్చినా టెక్నిక్ తప్ప, టెక్కు, నిక్కు ఎరగని నిగర్వి.

బూజుపట్టిన పాత సంప్రదాయాలకోసమనే ప్రాకులాడుతూ మడిగట్టుక్కూర్చోకుండా, రోజురోజుకీ మారే ప్రజలమోజుని గుర్తించి మనసులోపెట్టుకుని మరీ వరసలు కడుతూ, ప్రజలకు నచ్చిన పణతులనే ప్రత్యేకతతో ప్రయోగిస్తూవుంటారు మన రాజుగారు. ఇదే వీరి విజయరహస్యానికి కీలకం.

ఒకపర్యాయం వీరు కంపోజింగుకని కూర్చుని, ఒక గీతానికి మట్టుకట్టే సమయాన, పక్కనున్న పదిమంది పదిరాగాలు సజెస్ట్‌చేశారు. వాటిలో వీరికి 'ఉదయరవిచంద్రిక' నచ్చింది. సన్నివేశానికి సమంజసంగా వుంటుందని తోచింది. ఆ రాగపు పోకడలో హార్మోనీమెట్లపై వ్రేళ్ళని పయనింపజేస్తూ నాలుగైదు మట్లు కట్టారు. ఆ నాల్గింటిలోనూ ఒకటి అందరికీ నచ్చింది. కాని ఆవరస తయారించే విధానంలో ఒక వింత జరిగింది. ఉదయరవిచంద్రిక రాగంలో "సగమపనిస" అనే స్వరాలే ఆరోహణావరోహణలలో పలుకుతాయి శాస్త్రప్రకారం. వాయించే జోరులో అనుకోకుండా అకస్మాత్తుగా అంగుళీయకపుటంగుళి (ఉంగరం వ్రేలు). ఈ రాగానికి వర్జ్యస్వరమైన దైవతప్రాంతంలో అన్యాయంగా, అన్యాక్రాంతం జరిపింది. మనసు గతుక్కుమంది వీరికి-పక్కనున్న శ్రీ మునిస్వామిగారే మనుకుంటారోనని. రాగాల శుద్ధ ప్రయోగాలలో మాత్రమే నెమ్మికా, నమ్మికాగల మునిస్వామి (వీరి సహాయకులలో నొకరు- మరొకరు ఢోలక్ సత్యం) ఇంచుక ముఖం చిట్లించారు అప్రయత్నంగా. కాని, ఢోలక్ సత్యం తలవూపారు బాగుందని. "రాజుగారు కావాలనే దైవతప్రయోగం చేశా"రని సత్యం పలికారు. కాని రాజుగారు దైవతప్రయోగం దైవికంగా జరిగిందని నిజం చెప్పేసి సత్యం పలుకు సత్యంకాదని ఋజువుచేశారు. కాని దైవికంగా పడిన దైవతం శాస్త్రసమ్మతం కాకపోయినా కర్ణసమ్మతంగనక, దైవతాన్ని పలికినది పలికినట్టుగా వుపయోగించడానికే నిశ్చయించుకున్నామన్నారు శాస్త్రంకోసమనే. దైవతాస్త్రసన్యాసం కావిస్తే. వెనకటి కేదో సామ్యం చెప్పినట్టై కూర్చుంటుందన్న వ్యంగ్యోక్తితో తన నిశ్చయాన్ని బలపరుచుకున్నారు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, సంప్రదాయబద్ధులైపోకుండా, అందగించే స్వరసాంకర్యానికెంతమాత్రం వెనుకంజ వేయకుండా, ముందంజవేసుకుంటూ పోతారు. ఏమైనా "రాజు"గారుకదా! దేనికీ కట్టుబడి వుండడం వీరికి నచ్చదు. ప్రతీ విషయంలోనూ సర్వ స్వాతంత్ర్యాన్నపేక్షిస్తారు. ఇబ్బంది లేనంతవరకూ "స్వభావాలను" అమలుపరుస్తారు.

వచ్చిన కొత్తలో వీరు కొత్తగా కొన్న కారు ఆస్టిన్. మొదటిరోజునే డ్రైవరు

వచ్చినట్టే వచ్చి వెళ్ళిపోయాడు చెప్పకుండానే. తనకున్న మిడిమిడి జ్ఞానంతోనే. వీరు సొంతంగా ధైర్యంచేసి, పక్కనున్న ఇద్దరు అసిస్టెంట్ల పక్కబలంతో, కారు నెలాగో తోలి, కోడంబాకం గేటుదాకా గెంటగలిగారు. అవతల రీ రికార్డింగుకని వాయిద్యగాండ్రు కాచుకుకూచుంటారని, అవసరంగా తోలడంలో, ఫస్టుగేర్ వేయబోయి రివర్సుగేరు (వైస్ వెర్సా)వేసేసరికి, గేటు దగ్గర కొంచెం స్లోపేమో, కారు వెనక్కి - ముందుకీ ఊగిసలాడి ఉయ్యాల ఊపింది వీరిని. వెనకనున్న కార్లడ్రైవర్ల గుండెలు గుభిల్లుమని, ఆత్మసంరక్షణ పరాయణులై, వీరికారు, నేరుగా వెనక్కి సాగి తమ బళ్ళను ఢీకొని వాటిషేపే మార్చేలోపుగా, వీరి కారు ముందుకి నెట్టి ఎలాగో గేటు దాటించారు. కాని, "టాక్సీరాముడు" చిత్రం తాలూకు రీ రికార్డింగు కావడంవల్లనో ఏమో, "టాక్సీ" ఎక్కాల్సిన అవస్థపట్టింది మరికొన్ని గజాలదూరంలో ఆస్టిన్ ఆగిపోయి, ససేమిరా కదలనని భీష్మించుకునే సరికి. మొత్తానికి గంట ఆలస్యంగా చేరుకున్నారు గమ్యస్థానాన్ని.

ఇహ రీ రికార్డింగు వ్యవహారంచూస్తే అంతా అయోమయం. అర్జంటుగా 'రిలీజు' తలపెట్టడంవల్ల వీరికి చివరి మూడురీళ్ళు చూడ్డానికీ, టైమింగూ అదీ నోట్‌చేసుకోడానికీ కుదరనేలేదు. ఏ థియేటరూ (స్టూడియోలో) ఖాళీ లేనందువల్ల డైరెక్టరుగారి హింట్సూ, పాయింట్సూ తీసుకుని, నిరాధారంగా యేదో వూహించుకుని, ఉజ్జాయింపుగా, బిట్స్ కంపోజ్‌చేసి, దైవంమీద భారంపడేసి, రికార్డుచేయించేశారు. తనిచ్చిన బ్యాగ్‌గ్రౌండ్ మ్యూజిక్‌కీ, పిక్చర్లో సన్నివేశాలకీ, సరిగ్గా అతుకుతుందో లేదో అని గుండెలు బితుకు బితుకు మంటూనే వున్నాయి. ఫైనల్‌గా పిక్చర్ చూసేదాకా. చూసినమీదట, "బ్రహ్మాండంగా "మాచ్" అయిందని, అందరూ అనుకుంటున్నారని విని తనకు తనే తన్ను అభినందించుకుని, కాలరెత్తుకున్నారు.

ఇహ వీరి గీతాల్ని నెమరేసుకుందాం. "టింగురంగా"లో "టింగుటింగు టంగు టంగు" అనే హాస్యగీతం నల్లరామ్మూర్తి, కనకం పాడగా పక్కలు చెక్కలయ్యేట్టు నవ్వొస్తుంది. శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తికి ఘంటసాల పాడిన "రాజా మహరాజా" అనే శాస్త్రీయగేయం "హుసేని" రాగంలో తయారైన "హసీన్" (అందమైన) గీతం. ఇదేపాటని అరవంలో కీ॥ శే॥ శ్రీ త్యాగరాజ భాగవతార్ "రాజన్ మహరాజన్" అని జకారానికున్న దీర్ఘాన్ని హ్రస్వీకరించి, సకారపొల్లు తగిలించి పాడారు మనోజ్ఞంగా. "జీవప్రియా హేశ్యామలా" అన్న ఘంటసాల గీతం మిశ్ర తిలంగ్‌లో కూర్చారు "మిశ్రా" (కలకండ) లాగ. "బేలవుగా కనజాలవుగా'' అన్న గీతాన్ని శ్రీ రాజు "భీంప్లాస్" రాగంలో "ఏ"క్లాస్‌గా తయారించగా శ్రీ కంతసాల "బీ" (ఝుమ్మనే తేనెటీగ) క్లాస్‌గా, గానం చేశారు. శ్రోతలెల్లరూ తద్గానమదిరాపానం చేశారు. కైలాసనృత్యానికి శ్రీమతి వసంతకుమారి ఝంఝూటి, హంసానంది, కానడ ఆది అద్భుత రాగాలలో, గళదానంచేశారు. "ఇదియేమి మాయో కదా" అని శ్రీమతి స్వరలక్ష్మి 'తిలక్‌కామోద్' రాగానికి ప్రాణంపోశారు. పై గీతాలకి బలం శ్రీ తాపీ కలంకూడా.

శ్రీ తాతినేని చేతిలో మెరుగంది. అందరూ మెచ్చిన "పిచ్చిపుల్లయ్య" తెచ్చి యిచ్చిన ఖ్యాతిలో కొంత రాజుగారికీకూడా చెందుతుంది. కఠినపదాల వాసనను ఆదుపులో కట్టిపెట్టి, గట్టి భావాలనుసైతం ఒత్తులు లేని మెత్తని పదజాలంతోనే మృదువుగా, ముద్దుగా తెంపకంలో గట్టివారైన శ్రీ అనిసెట్టి కమ్మనిరచన, రాజుగారి రాగాలకతన, సుగంధమబ్బిన సువర్ణమైంది. "బస్తీకి పోయేటి ఓ పల్లెటూరివాడా" అని శ్రీ పుండరీకాక్షయ్యగారిచే భావయుక్తంగా పాడించి, భావి నిర్మాతను, నాటు గాయకులుగా పరిచయంచేసిన ప్రతిష్ఠ రాజుగారిదే. "శోకపు తుపాను చెలరేగిందా ?" అనే, నేపథ్య గీతంలో, శ్రీ ఎం. ఎస్. రామారావుగారి నిజగద్గదస్వరోద్గతాలైన అలల అలజడిలో కల్లోలితమై అల్లలాడింది శ్రోతల హృదయనావ, పెనుతుపానులో పయనించే పడవరీతిగా. శ్రీమతి సుశీలగారి "ఆనందమే జీవితాశా" గీతాన్ని మరాఠీ బాణీలో మలచిన విధాన్ని, స్వర్గీయ శ్రీ హెచ్. యం. రెడ్డిగారు, మీసాలు దువ్వుతూ మెచ్చుకున్నారట. భీంపలాస్‌లో "ఎల్లవేళలందు నీ చల్లని చిరునవ్వుకై"అని శ్రీ ఘంటసాల, శ్రీమతి బాలసర్వతీ కలిసి చిగురింపజేసిన పల్లవి, తరుణీ మధురాధరోల్లసిత దరహాసచంద్రికయై వెల్లివిరిసింది.

ఆకాశవాణిగా, శ్రీ ఘంటసాల అనుమంద్రంలో ఆలపించిన "ఆలపించనా, అనురాగముతో" అనే ప్రేమగీతిక మలయానిలవీచిక. "ఓపంతులుగారూ వినవేమయ్యా పిలిస్తే రావేమయ్యా" అనే యుగళగీతం పితాపురం, కోమలగారలు, శమణారెడ్డి కృష్ణకుమారిగార్లకు గొంతు అరువొసగి, లాస్యంతోకూడిన హాస్యం అందించారు.

"పిచ్చిపుల్లయ్య" పిమ్మట, శ్రీ రాజు ఎన్. ఎ. టి. సంస్థలో పదిలంగా వ్యవస్థ ఏర్పరచుకున్నారు నందమూరు సోదరుల ప్రేమాభిమాన బద్ధులై. తారకరామ త్రివిక్రమరావుగారల ప్రతిష్ఠావర్ధక నిర్మాణమైన "తోడుదొంగలు" చిత్రంలో నాలుగే నాలుగు నాణెమైనగీతాల్లో ఒకటి, నాటకంలో నాట్యసన్నివేశానికని శ్రీమతి కోమల కోమలంగా, పేశలంగా ఆలపించిన తిల్లానా. ఫిలిం ఫీలంలో తన స్థలం బలంగా అచంచలంగా భద్రపరచుకున్న శ్రీ చలం క్లబ్'లో ఆడుతూ పాడుతూ పాడే సందర్భంలో, శ్రీపితాపురం నాగేశ్వరరావు, అనుభవజ్ఞులవలె, అందించిన సందేశం "పేకాట భలే ఆట" పాటవిని, మనం "శభాష్‌బేటా" అనకుండా యెలా వుండగలం ? "ఉన్న తీరునే వున్నది వుంది, పీదన్నది పీకే ముందీ" అనే వైరాగ్యద్యోతకమైన గేయం హృదయం తెలుసుకుని నడుచుకుంటే, అనూహ్యమైన భవతరణోపాయం లభ్యమౌతుంది. ఈ చిత్రంలోని గీతరచనా శైలి పరికిస్తే శ్రీ జూనియర్ సముద్రాల పేరుకి "జూనియర్" అయినా, కవితలో ఆరితేరిన "సీనియర్"గా తోచకమానరు. శ్రీ యోగానంద్ డైరెక్షన్లో, ఎన్. ఎ. టి. వారు నిర్మించిన "జయసింహ"కు అమరిన సంగీతం అజరం, అమరం. "బేగడ" రాగంలో పాలమీగడలా కమ్మగా, శ్రీమతి సుశీల తన కమ్మనికంఠంనుంచి కుమ్మరించిన మోహనగానం వినగా "నడిరేయి గడిచేను" అనేపాట పల్లవి "కల్ల" అనిపిస్తుంది. ఎందుకంటే ఈ పాటవింటుంటే నడిరేయెంతకీ గడవనేగడవదు. తీయని తలపు విడవదు. నిముషంకూడా నడవదు. శ్రీ రాజు శ్రీమతి కె. రాణిచేత "గీతారాయ్ బాణీ"లో మత్తుగా, గమ్మత్తుగా పాడించిన

"కొండమీద కొక్కిరాయీ, కాలు జారి కూలిపోయే" గేయం ఆలపిస్తూ శ్రీమతి అంజలి ప్రదర్శించిన నటన అమోఘం. ఒక వెంకటేశ్వరరావుగారికి (గుమ్మడి), మరో వెంకటేశ్వరరావు (ఘంటసాల)గారు పాడిన "జయజయ శ్రీరామా" అనే భక్తి రసపూరిత భజనగీతం సమ్యగాలాపితం, రసికజన మనోస్థాపితం. ఈ గేయం హిందీలో "మన్నాడే" వినిపించారు. సుభద్రార్జునుల ప్రణయలీలలకు సంగీత వాతావరణం సమకూర్చిన ఘంటసాల, లీలల కంఠస్వర మాధురి ఝురిలో తనిసి సోలినవారికి "ఈనాటి ఈహాయి కలకాదోయి నిజమోయీ" అనిపించడంలో ఆశ్చర్యమేముంటుంది! బాలసరస్వతి కోమలల "మనసైనా చెలిపిలుపు" వినీకూడ "రావేల ఓ చందమామ" అని మరీమరీ బతిమాలించుకుని పిలిపించుకున్నాడంటే-ఆ చందమామ ఎంతటి మందమతియై యుండనోపు! "మదిలోని మధురభావం పలికేను మోహన రాగం" అని ఘంటసాలా, బాలబ్రహ్మరాణీ, కళ్యాణీ మోహనరాగాల సమ్మిశ్రణంకావించి పలవించారు. శ్రీ రేలంగికి పిఠాపురం పాడిన గమ్మత్తయిన స్వరాల కసరత్తులో "నిసగమపా లోకంమోసం పమగరిస" అన్న పల్లవిలోని స్వరాలు వాటి స్వస్థానాలలో వుండకుండా (గాంధారం తప్ప), అన్యస్థానాల్ని ఆక్రమించి గలాటాచేయడం గమనీయమూ, కమనీయమూను.

ఎన్. ఎ. టి. వారి "పాండురంగ మహాత్మ్యం"లో సౌందర్యోపాసకులుగా అభినయ సౌందర్యం వెలయించిన హీరో ఎన్. టి. ఆర్. జోరుగా హుషారుగా వారువంపై అధిష్ఠించి ఆలాపించిన "తరం తరం నిరంతరం నీ అందం" గీతం అనంతానందకరం. 'మోహన'లో శ్రీ ఘంటసాల ఆరంభించి యెలుగెత్తి ఆలాపించిన "హే కృష్ణా, ముకుందా, మురారీ"; అమ్మా నాన్నా, అమ్మాయని పిలిచినా ఆదరించవేమమ్మా (సింధుభైరవిలో) అనే పాటలు వింటే ఒళ్ళు జలదరిస్తుంది.

అంజలిగారికి, శ్రీమతి పి. లీల పాడిన "వన్నెల చిన్నెలనెర, కన్నెలవేటలదొర" గీతానికి కట్టలేం ధర. రీటా నాట్యానికి, లీలగారు పాడిన "కనవేర మునిరాజమౌళీ" అన్న జావళి చవులూరే చక్కెరకేళీ. శ్రీమతి సరోజాదేవికి, జిక్కి.గారాలపించిన "ఆనందమిదేనోయి సఖా" వింటే ఆనందమంటే యేమిటో తెలుస్తుంది.

స్వస్తిశ్రీ వారి "రేచుక్క - పగటిచుక్క"లో "భళిభళి దేవుడా భలేవాడివేనురా" అని బాలకృష్ణ-పద్మనాభాలకు, పిఠాపురం, సత్యం, కలిసి ఏకకంఠాన దేవుడి మహిమను కొనియాడారు. జానకి (షావుకారు) రాము (ఎన్. టి. ఆర్.)లకు, సుశీలా ఘంటసాలలు పాడిన "ఔనాకాదా" అనేపాట హిట్టౌనా, కాదా అన్న సందేహానికి తావేలేని రీతిగా సంగీతీకరించారు శ్రీ రాజా.

'రాజనందిని' చిత్రంలో నగవుల వగయనదగు నగసుత శ్రీమతి గిరిజకు శ్రీమతి సుశీలగారు "నీమీద మనసాయెరా" అనిసింధుభైరవిలో వినిపించిన మధురభావం విని మన్మథుడుకూడా పూవింటినిచేగొని సమరాని కుద్యుక్తుడౌతాడు. అంజలీ రామారావుగారలకు, రాజా జిక్కిగారలు పాడిన "అందాలు చిందుసీమలో వుందాము లే హాయిగా" భాగేశ్వరిలో భాసిల్లిన భావమయ గేయం " చిక్కేవులేరా చక్కని రాజా" అని జిక్కిగారు పాడడం యెంత చక్కగా కుదిరింది! "హాస్యసమ్రాట్టు శ్రీ రేలంగికి

పి. యస్. ఆర్. (శ్రీ పెండ్యాల కాదు. పిఠాపురం నాగేశ్వరరావుగారు) పాడిన "ఎందుకో చెప్పలేను తందాన తాన". ఎందుకో చెప్పలేనుగాని, నే నెన్నటికీమరువజాలను. "రంగేళీ రౌతంటే నీవేరా ధీరా" అని శ్రీమతి జి. వరలక్ష్మి నృత్యానికి సుశీలగారు చేసిన గానదానం, గగనయానం కలిగించే ఆనందం చేకూరుస్తుంది.

ఈ గీతాలన్నీ శ్రీ మల్లాది పదునైన కలం పసందుగా పలికినవే. "ఋష్యశృంగ"లో జానకీ ఘంటసాలలు ఆలపించి వెలిగించిన "అందాలు చిందుదీపం" వెండితెరపై రాజసులోచనా, హరనాథుల ప్రణయపథానికి వెలుగుచూపింది. "టాక్సీరాముడు"లో "మనలోమాట సుమా" అని శ్రీమతి సుశీల శ్రీమతి రాగిణి కొసగిన రాగిణి రసధారావాహిని. రాగిణికే జానకిగారు పాడిన "ఏమిటి కావలె కోరుకో" గీతం వరమైన వరం.

"రేలంగిరిజ"లకు జానకీ పిఠాపురంగారలు పాడిన శ్రీ కొసరాజు రచన "మావయ్యో తిరనాళకుపూడుస్తా" ప్రేక్షక శ్రోతలని పకపకల తికమకలోపడేసి, నవ్వులగనిలో పూడ్చేసింది. అభినయజీవియైన దేవికకు అమరిన సుశీలగారి సోలో "గోపాలబాలా కాపాడవేరా "విని నంతనే వేణుగోపాలుడు మింగుతున్న వెన్నవదిలి, బిరబిర పరుగిడి రావలసినదే!

శ్రీ రాజు సంగీత దర్శకులేకాక, నిర్మాతలుకూడా. ఆనాటి "బాలనాగమ్మ"ను పునరుజ్జీవింపజేసినవారిలో వీరుకూడా భాగస్వాములే. ఈ అభినవ "బాలనాగమ్మ" చిత్రంలో శ్రీమతి రాజసులోచన నాట్యానికి సుశీలగారి "అందము ఆనందం", "నీకేలరా" అనే గీతాలు, మయూరిని నర్తింపజేసే జలదుని చిలకరింపులు, వరుణుని పలకరింపులు, మేదిని పులకరింపులు.

శ్రీ ఘంటసాల రేలంగిగారికి ఆలపించిన "మజామజా మధురసం", "ఇద్దరుపెళ్లాలు వద్దురా శివుడా" అనే రెండు వినోదాత్మకమైన గేయాల్లోనూ, మొదటిది ప్రభుత్వ చట్టానికి (మద్యనిషేధానికి) ప్రతికూలం; రెండవది అనుకూలం (బహు వివాహ బహిష్కారానికి). "స్వయంప్రభ" చిత్రానికి "మగరాయ కతమేమిరా" అనే ఒకే సాహిత్యానికి సంగీతం రెండుబాణీలలో (కర్నాటక, హిందూస్తానీ) నిండు నైపుణితో కాంభోజి, బెహాగ్‌రాగాలలో విడివిడిగా అమర్చి వినిపించారు ఒకదానికొకటి తీసిపోకుండా.

ఇప్పటికి నేను వీరి సంగీతంలో రెండే రెండు చిత్రాలలో పాడాను. అవి రెండూ ఇంకా రిలీజుకాలేదు. "మానార్ ఫిలింస్" "మావూరు" కని స్వర్ణలతగారితో రెండు హాస్యయుగళ గీతాలు పాడాను. ఎలాగున్నాయన్నది ,మీరే నిర్ణయిస్తారుగా రిలీజుకాగానే. సరస్వతీ మూవీస్‌వారి "సింహాచలక్షేత్ర మహాత్మ్యం" చిత్రంలో శ్రీ అయస్కాంతారావుగారికి నేనూ, యదునందన తనూజ (కృష్ణకుమారి)గారికి జానకిగారు కలిసి ఆలపించిన గేయం "రావోయీ, రాజా." ఇది మంచి పకడ్బందీగా కుదిరిందని అనుకుంటున్నారు విన్న వారందరూ.

ప్రస్తుతం శ్రీ రాజా పనిచేస్తున్న కొత్త చిత్రాలు, శేఖర్ ఫిలింస్" గొల్లభామ", డి. వి. యస్. వారి "మంగమ్మ శపథం", రేఖాకళామందిర్‌వారి "బాలరాజు", చక్రధారి వారి "మరపురాని కథ" రోనౌవారి "అమ్మా నాన్నా" వగైరాలు. ఇలా యేటేటా డజన్ల కొలది చిత్రాలకు పనిచేస్తూ, వందలకొలది పాటలు వినిపిస్తూ, వేలకొలది ప్రజలను రంజింపజేస్తూ, లక్షలకొలది డబ్బు గడిస్తూ, సపరివారంగా సుఖించాలని కోరుకుందాం మనమందరం!!! □□□

అతిథి సత్కారం

అతిథి సత్కారం విషయంలో కుందమ్మగారు తన మాటలతో చాలా నేర్పు చూపించి ప్రత్యేకత గడించింది.

వీధిగుమ్మంలో నుంచుని అల్లంత దూరాన్నించే అతిథివాసన పట్టేస్తుంది. వెంటనే దువ్వుకున్న తలరేపేసుకుని, ముఖాన బొట్టు చెరిపేసుకుని, చింకిచాప, ఇత్తడిచెంబూ ఒక మూల జేర్చుకుని, కూర్చుంటుంది. అతిథి కోసం యెదురుచూస్తూ.

మిట్టమధ్యాన్నం - బస్సుదిగి మండు టెండలో చెమటలు కక్కుతూ ఉస్సురస్సురంటూ ఆ చుట్టం, లేక అతిథి రానేవస్తాడు.

వచ్చినవాణ్ణి చూస్తూనే "అయ్యో అన్నయ్యా! (మామయ్యా అనీ, బాబాయి అనీ, తాతయ్యా అనీ, సందర్భశుద్ధిగా పిలుస్తుందనుకోండి) మండు టెండలో వచ్చావు పాపం! పాపిష్టిదాన్ని! ఇవాళే నాకీ ఖర్మపట్టాలా? ఇంకో రెండ్రోజులాగి పట్టకూడదూ? కాళ్ళు కడుక్కుంటానికి నీళ్ళుకూడా యివ్వడానికి వీల్లేదుగదా!' అని అంటుంది.

"ఎబ్బె! ఏం ఫర్వాలేదమ్మా" అంటాడు ఆ అన్నయ్యగారు నీరు గారిపోయి.

"ఎన్నాళ్ళనించో అనుకుంటాను నువ్వొచ్చినపుడు నీ కిష్టంగదా బొబ్బట్లు, ఆవడలు, దబ్బకాయ పులిహోర చేసి పెడ్దామని, భగవంతుడు నాకా అదృష్టం కలిగించలేదు! సర్లే అన్నయ్యా! ఏంచేస్తాం! అదొడ్లో బావిలో నీళ్లు తోడుకుని, కాళ్ళు కడుక్కుంటావో, స్నానమేచేస్తావో, చేసి..." అంటూండగానే ఆ అన్నయ్యగారు రాబోయే ప్రమాదం పసికట్టి, బోల్డు ఇదైపోయి, మొహమాటపడినట్లు నటించి, తన దురదృష్టాన్ని తనలో నిందించుకుని, "ఫర్వాలేదమ్మా! భగవంతుడు చేసినదానికి మనమేం చేస్తాం! అంతా కులాసాయేగదా! వస్తానమ్మా! నేను వచ్చి వెళ్ళానని బావగారితో చెప్పు" అంటూ, మళ్ళీ ఆమె మాటకూడా యెదురు చూడకుండా పరిగెత్తి, ఏ హోటల్లోనో కతికి తిరుగుముఖం పట్టేస్తాడు.

మరోసారి ఆవిడ భోంచేసి రెస్టుతీసుకుంటున్నప్పుడొస్తాడు మరో బాబాయి. "అమ్మాయ్" అని పిలుస్తూ.

ఇటువంటప్పుడు పైనజెప్పిన పథకం వీల్లేదుగా. అందుకనీ.... "ఏం బాబాయ్! కులాసా? ఓర్ని! ఇంత ఎండలో వచ్చినా నీ ముఖం ఇంకా ఎంతో కాంతిగానేవుంది. నీ వాలకంచూస్తే ఎవరైనాచెప్తారు నువ్వు గ్యారంటీగా భోంచేసి బయల్దేరావని. లేకపోతే ఎక్కడైనా ఆ మొహంలో ఒక్కరవ్వ బడలికగాని, నువ్వుగింజంత నిస్సత్తువగాని వుందేమో చూసుకో ఆ అద్దంలో" అంటూ గోడకి తగిలించిన అద్దంవేపు చూపిస్తుంది.

తిక్క మొహంవేస్తాడు బాబాయి.

"ఏమిటి బాబాయి మీ ఇంట్లో కూరలు?" అంటూ ప్రశ్నిస్తుంది పైపెచ్చు.

ఇలాటి మాటలంటుంటే ఎంత బాబాయయితేమాత్రం "లేదమ్మా, నేను భోంచేసి బయల్దేరలేదు" అని చెప్పుకుంటాడా?

లేకపోతే-నిజంగా తన మొహం కుందమ్మ వర్ణించినంత కాంతివంతంగానూ వుందేమో తెలుసుకోడానికి అద్దంచూసుకుంటాడా?

వెంటనే ఆ పినతండ్రి లేక బాబాయి కుందమ్మడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలిగాబట్టి "ఏ ముందమ్మా! దోసకాయ పప్పు, మామిడికాయ పచ్చడి, బెండకాయ ఇగురు, చారు" అంటూ తనకిష్టమైన పదార్థాలు దండకంలా చదివేసి "ఈఊళ్ళో కోర్టుపనిమీదొచ్చాను. మిమ్మల్నందర్నీ ఒక్కసారి చూడాలని బుద్ధిపుట్టింది. చూశాగా వస్తానమ్మా" అంటూ లేచివెళ్ళిపోతాడు.

"వెళ్ళగానే ఉత్తరంరాయి బాబాయి. మర్చిపోకు" అంటూ ఆయన చాలాదూరం వెళ్లాక వీధిగుమ్మంలోనుంచి అరుస్తుంది కుందమ్మ.

ఆయన కివన్నీ వినిపిస్తాయో - అసలే ఆకలిమీదుంటేనూ.

ఇంకోసారి ఆవిడ భోంచేస్తూండగా ఇంకో తాతయ్యగారొస్తారు.

"ఏమే మనవరాలా! కులాసా?" అంటూ.

ఇప్పు డింకో ప్లానువేస్తుంది కుందమ్మ.

"ఏం తాతయ్యా! ఇదేనా రావడం? భోజనాలవేళ వచ్చావుగాని ఏం లాభం? నువ్వు మా ఇంట్లో భోంచెయ్యవుగా!" అంటూ నిష్ఠూరాలాడ్తుంది.

"అదేంలేదే పిచ్చిపిల్లా! తప్పకుండా భోంచేస్తాను" అంటాడు తాతయ్య.

కుందమ్మకు గుండెల్లో చిన్న ఇసుక రేణువుపడినట్లుగా వుంటుంది. అయినా గడుసుపిండంకదూ - "ఆఁ! నువ్వెక్కడ తింటావులే! నీ కన్నీ మడీ ఆచారాలుకావాలాయె! మా ఇంట్లో అవి లేవాయె" అంటుంది.

తాతగారు కాస్త కాలాన్నిబట్టి నడుస్తున్నవారవడంవల్ల "నా మడీ, ఆచారం, అన్నీ ఇదివరకుగాని ఇప్పు డంతంతమాత్రమే! ఏం ఫర్వాలేదు" అంటాడు.

గుండెల్లోవడ్డ ఇసుకరేణువు కొంచెం పెద్దదవుతుంది కుందమ్మకు. అయినా....

"పోనీ అది సర్దుకున్నా మా ఇంట్లో వాడేది వెధవ వేరుశెనగనూనె, నీళ్ళ మజ్జిగాను....మీరైతే మీ ఇంట్లో కమ్మని వెన్నగాచిన నెయ్యి, గడ్డపెరుగు వేసుకు తింటారాయె" అంటుంది.

తాతగారు ఇదీ అలవాటుపడిన వారే!

పి. నాగాంజనేయులు

"అదేమిటమ్మా! అవసరాన్నిబట్టి పోవాలిగానీ, అన్నీ కావాలంటే కుదురుతుందా" అంటాడు.

ఇహ లాభంలేదనుకుంటుంది కుందమ్మ. ఆఖరి ప్రయత్నం నారాయణాస్త్రంలాంటిది. "అదిసరే తాతయ్యా! నీకు పుల్లిపాయ వెల్లుల్లిపాయ, ఇంగువ సుతరామూ గిట్టవాయె! మా ఇంట్లో ప్రతికూరా, ప్రతి పప్పూ, ప్రతిపచ్చడీ అవి లేకుండా వుండవాయె! ఇంకెలా తినగలవు? చెప్పు! పాపం!" అంటుంది.

నారాయణాస్త్రం పనిచేస్తుంది;

అన్నీ సద్దుకుపోవడం నేర్చుకున్న తాతయ్యగారు ఇది మాత్రం సద్దుకోలేకపోయారు.

"అది నిజమేలేవే పిల్లా! పాపం నువ్వు మాత్రం ఏం జేస్తావ్? నేవస్తా!" అంటూ చెప్పులు తొడుక్కుని వీధిలోకి వెళ్ళగానే, కుందమ్మ తలుపుదగ్గర నిలబడి "ఏమిటో తాతయ్యా! మా ఇంట్లో విస్తరెయ్యకుండా వెళ్ళడం నాకేం బాగుండలేదు" అనేసి ఫెడేల్మని తలుపులు మూసేస్తుంది.

ఒకపర్యాయం పొద్దున్నే ఎనిమిది గంటలకు కుందమ్మ తమ్ముడూ, మరదలూ అనుకోకుండా దిగారు.

వాళ్ళను వీధిలో చూస్తూనే "ఏరా తమ్ముడూ కులాసా? మరీ చిక్కిపోయావేరా?" అని పలకరించి, "నీకోసం కలవరించి చచ్చిపోతున్నానే కమలా! వారం రోజుల్నించీ నీమీద ఒకటే కలలు; మూడు రోజుల్నించీ పొయ్యి ఒకటే అరవడం - నిన్న పొద్దుట్నించీ యిదిగో ఇప్పటివరకూ కాకి అరుస్తూనే వుంది. "ఏదీ?" అంటూ లేని కాకికోసం వెదికి "మీరు రాగానే వెళ్ళిపోయినట్టుంది! .... వెంకటేశ్వరస్వామికి వెయ్యి నమస్కారాలు చేశానే! 'భగవంతుడా! మా కమలవస్తే దాగున్ను! దాన్ని నాయింటికి తీసుకురా తండ్రీ' అని. నిజంగా స్వామి నా మొరాలకించాడనుకో!" అంది

పాపం! అపిచ్చి మరదలు అమాటలకు ఉబ్బిపోయి జాకెట్టు చిరగ్గొట్టేసుకుంది.

"పోమ్మా! దొడ్లోకి పోయి కాళ్ళు కడుక్కురా! మాట్లాడదాం" అని కుందమ్మ కమలను దొడ్లోకి పంపింది.

మరదలు తిరిగిరాగానే "కమలా! రెండు నెల్లయింది నేను సరిగా భోంచేసి. జిహ్వ చచ్చిపోయిందనుకో! ఎన్నిసార్లో ప్రయత్నించా....వంకాయగుత్తికూరా, ఉల్లిపాయ కారం, చారూ చేద్దామని ఉహూ! నువ్వు చేసినట్టుకుదరందే! ఇహ మళ్ళీ అవినువ్వు చెయ్యాలిసిందే! నేను తినాలిసిందే! నీవెల్లా గయినా వంటలో పైచెయ్యేనే" అంటూ అసలు విషయం బయటపెట్టింది

మనసులో ఏమనుకుందో యేమోగాని, పాపమా మరదలు చచ్చినట్టు చెయ్యిచేసుకుని, ఆపూట కొవంటలు తగలేసి ఆరాత్రి బండికే మొగుడితో తిరుగుప్రయాణం చేసింది. ☐☐☐



చిత్రరథుని చైత్రయాత్ర

అమరశిల్పి జక్కన్న

శిల్పికి శిలకు గల రాగానుబంధం ఉత్తమ కళాస్థాయిలో నిరూపించిన చిత్రం "అమరశిల్పి జక్కన్న".

గేవాకలర్ ఘట్టం పిమ్మట, విక్రమ్ ప్రొడక్షన్స్ జక్కన్నతో ఈస్ట్‌మన్ కలర్ దశకు అంకురార్పణచేశారు. అక్కినేని నాగేశ్వరరావు నాయకుడుగా ఆరంభమైన ఈ వర్ణశోభ స్థిరపడేటట్టున్నది.

జక్కన్న చిత్రం ఒక మహాశిల్పి జీవిత చరిత్రను చూపడమేకాక భారతీయ సాహితీ సంస్కృతీ సంప్రదాయాలను వీలైనంత వాస్తవికంగా నిరూపించింది. శిల్పికి సమాజానికి, శిల్పికి సంస్థానాధీశులకు, శిల్పకళకు దైవశక్తికి, వీటన్నింటికి మించి శిల్పిజీవితలక్ష్యానికి వున్న బంధాలూ, అనుబంధాలూ కావ్యస్థాయిలో నిరూపించి "సినిమా" ఈ రోజుల్లోనూ దృశ్యకావ్యమని బి. ఎన్. రంగా బృందం నిరూపించింది.

ఈనాటి బెంగుళూరుకు 160 మైళ్ళ దూరంలోవున్న బేలూరు, హాలేబీడులలోని దేవాలయాలు 1050 నాటివి. హోయిసల సామ్రాట్టు విష్ణువర్ధనుడు బేలూరులో చెన్నకేశవస్వామి ఆలయం కట్టించాడు. ఆలయశిల్పి జక్కన్న. ఆ అమరశిల్పి జీవితం కళాగాధే ఈ అద్వితీయ వర్ణ సుందర చిత్రం.

అంధుడైన మల్లన్న (నాగయ్య) హస్తస్పర్శతోనే శిల్ప సౌందర్యం పరీక్షించగల శిల్పి. కుమారుడు జక్కన్న (నాగేశ్వరరావు) మంజరి (బి. సరోజాదేవి) అనే నాట్యకత్తె కన్నుల గడసరి కవ్వింపులతో, ఊరించే వయ్యారి వంపులతో తన ఉలిని, ఊహలను పరుగులెత్తించి కఠిన పాషాణాలను కమనీయ కళామూర్తులుగా మార్చాడు; గుండెలు లేని బండలకు గుండెలేకాదు పంచప్రాణాలు యిచ్చి, రూపసృష్టితో కళాబ్రహ్మ అయినాడు.

మంజరిని పరిణయమాడి, మండల ప్రభువు గోపదేవు (ఉదయకుమార్) అసూయకు ఆహుతై, అర్ధాంగిని అనుమానించి, అర్ధోన్మత్తుడై రామానుజాచారి (ధూళిపాళ) ప్రబోధాలవల్ల తిరిగి విజ్ఞాని అయి సమాజం, కళ, దేశం, దైవంపట్ల తన కర్తవ్యం తెలుసుకుంటాడు. రామానుజాచారి శిష్యుడైన హోయిసల సామ్రాట్టు విష్ణువర్ధనుడు (జూనియర్ సుబ్బారావు)

బేలూరులో చెన్నకేశవాలయ నిర్మాణం తలపెట్టి వేరొక పేరులోవున్న జక్కన్నను ఆలయ ప్రధాన శిల్పాచార్యులుగా నియోగించాడు.

జక్కన్న కుమారుడు డంకన్న (హరనాధ్) మల్లన్నవద్దే శిల్పవిద్య నభ్యసించి జక్కనాచార్యుని అన్వేషణకు బయలుదేరుతాడు. జక్కన్న తన తండ్రి అని తెలియని స్థితిలో ఆయన పెరుగుతాడు.

మంజరి అనేక కష్టాలపాలై తుదకు నిజం తెలుసుకొన్న భర్తచెంతకు చేరుతుంది. కాని శిల్పసృష్టినుంచి ఆయన ధ్యానమళ్ళించరాదనే సల్లక్ష్యంతో చాటునవుండి పతిసేవచేస్తుంది.

జక్కన్న చెక్కిన చెన్నకేశవస్వామి విగ్రహంలో దోషం వున్నదని డంకన్న సవాలుచేస్తాడు. పందెం దోషం రుజువైతే జక్కన్న దక్షిణహస్త ఖండన. డంకన్న పందెం గెలిచాడు. జక్కన్న చెయ్యి త్రెంచుకొన్నాడు. డంకన్న తండ్రిని, తాతను మించిన శిల్పి. భార్యా బిడ్డలు జక్కన్న దరిచేరుతారు. మొండిచేతితోనే జక్కనాచార్యుడు స్వామి విగ్రహం తయారుచేస్తాడు. స్వామి కరుణించి హస్తదానం చేస్తాడు.

ఇదీ "అమరశిల్పి జక్కన్న" కథ.

వర్ణచిత్రం కాబట్టి ముందు రంగుల సంగతి. వర్ణచిత్రాలలో నటీనటులు ఎర్ర కళ్ళతో, స్వేదబిందువులతో కన్పించడం కద్దు. ఇటువంటి ఎబ్బెట్టులేవీ ఇందులో లేవు. సెట్స్‌కు లేతరంగులు మనోహరంగా వున్నాయి. ముఖ్యంగా గులాబీ, పసుపు నేత్ర పర్వంగా వున్నాయి. భారీ సెట్లు, బ్రహ్మాండమైన సెట్లుకాక అలంకారయుతమైన నిరాడంబరమైన (సింపిల్ అండ్ ఆర్టిస్టిక్) సెట్లు ఉపయోగించడం ఈ చిత్రంలో ఒక విశిష్టత. తక్కువ వ్యయంపై ఎక్కువ కళాకాంతులు ఎలా తేవచ్చునో కళాదర్శకుడు ఏ. కె. శేఖర్, సెట్ నిర్మాత వి. ఎస్. నటరాజన్ నిరూపించారు. ఛాయాగ్రహణ దర్శకుడు బి. ఎస్. రంగాయే.

దర్శకత్వం ; పెక్కుచోట్ల పరవళ్ళు త్రొక్కింది. గోపదేవునిముందు మంజరినృత్యం చేస్తూ గోపాలుని పైపాట పాడినప్పుడు ఆమె ముందు గోపాలుని తెరమీదచూపడం. ఆ పాటను మాత్రం విన్న జక్కన్న గోపదేవునే ఆమె మనసున వుంచుకొన్నదనుకొనడం దర్శక రచయితల భావబలానికి నిదర్శనం. ఆలయ శిల్పాలను కలిపి కూర్చినపాటలోకూడా వారిరువురి ప్రతిభ ద్యోతకమౌతుంది.

వసంతమంటపంలో మంజరి భంగిమలు, వాయువేగ నృత్యంయొక్క చిత్రీకరణ రంగా ప్రజ్ఞకు గీటురాయి.

ఔట్‌డోర్‌ను బాగా ఉపయోగించి, సంగీత సాహిత్యాది విషయాలలో అలనాటి భారత ఔన్నత్యాన్ని నిరూపించడానికి నిర్మాత చూపిన శ్రద్ధ ప్రశంసనీయం.

శిల్పి చిత్రమైనందుకు శిలచ్ఛేదన ధ్వనులను నేపథ్యానికి రాజేశ్వరరావు చక్కగా వినియోగించారు. "అందాలరాణీ, అలివీలవేణీ" "నిలువుమా నిలువుమా నీలవేణీ" "ఏదోఏదోగిలిగింత ఏమిటీవింత" మొదలైన పాటలకు రాజేశ్వరరావు కూర్చిన సంగీతం మధురాతిమధురం.

చిత్రంలోని ఇతర సాంకేతికాంశాలు కూడా ఉన్నతస్థాయిలోవున్నాయి.



"మైరావణ"లో మైరావణుడుగా ధూళిపాళ, చంద్రసేనగా కృష్ణకుమారి.

కథలో మొదటిభాగాలను కవి సముద్రాల ఊహించని మెలికలతో బిగువుతో నడిపారు. చివరిభాగాలూ అంతే. సముద్రాల కలమే "జక్కన్న" అందానికి, హుందాకు దోహదమైనది.

భారత సంస్కృతి, కళా సంపదలను తెలియపరచే కథలంటే తనకెంతో మక్కువ అన్నారు నాగేశ్వరరావు. ఆయన నటనలోనూ అది కన్పించింది. ప్రేమికుడుగా, సాహసిగా, తుంటరిగా, వ్యథితుడుగా శిల్పిగా, దీక్షాపరుడుగా ఆయన చక్కగా నటించారు. నాగయ్య కంఠం, ఆవేదన సన్నివేశానికి నూతనోత్తేజమిచ్చినవి. హరనాధ్ చూడముచ్చటగా వున్నాడు.

చివరన వ్రాసేది సరోజగురించి. గజ్జెల రవళితో ఉత్తేజపరచే నర్తకిగా, భార్యగా, మాతగా సమప్రజ్ఞను ప్రదర్శించిన సరోజ చిత్రానికే రోజ (గులాబి పువ్వు).

నవగ్రహ పూజామహిమ

గ్రహాల అనుగ్రహం ఆశించక ఆగ్రహానికి గురై రాజ్యమూ, రమణి, కాళ్ళు చేతులు కూడా పోగొట్టుకొని, శిశుహంతకుడని ఈసడించబడడంతో వివేకోదయమై నవగ్రహపూజా మహిమతో అష్టకష్టాలుదాటి సుఖశాంతులు, సౌభాగ్యం పొందిన సత్యపాల మహారాజు (కాంతారావు) కథ "నవగ్రహ పూజామహిమ."

దర్శక నిర్మాత విఠలాచార్య నాలుగు నెలల్లో. సినిమా పరిభాషలో అయితే 'సాధారణ తారాగణంతో' తీసిన ఈచిత్రంలో వేగము. కాంతారావు. రాజనాల, వాణిశ్రీ. వాసంతి నటన విశిష్టాంశాలు.

ఏదో జానపదంగా కాక ఈశ్వరుడు. రావణాసురుడు కూడా గ్రహవక్రీకరణవల్ల పొందిన కీడులను కథాకాలం వారికి, యీ కాలంవారికి చెప్పి ఒప్పించడంలో విఠల్ ప్రొడక్షన్స్‌వారు కృతకృత్యులైనారు. కో డైరక్టర్ ఎస్. డి. లాల్. సంభాషణలు జి. కృష్ణమూర్తి. పాటలు, ఆరుద్ర, కృష్ణ మూర్తి. ఛాయ రవికాంత్.

చలన చిత్ర వార్తలు

దాగుడు మూతలు

అడగక యిచ్చిన మనసేముద్దు....

అందీ అందని అందమె ముద్దు ...


ముద్దు ముచ్చటలమీద ఆత్రేయ వ్రాసిన యీ పాటను "దాగుడు మూతలు"లో ఈమధ్య చిత్రీకరించారు. కొచ్చిన్‌లో ఈ పాటను చిత్రీకరించుదామను కొన్నారు. అయితే వాతావరణ దుష్ప్రభావంవల్ల 'ఛలో బెంగుళూరు' అన్నారు బెంగుళూరుకు చేరువగాగల హొసరగడ్డ గార్డెన్స్‌లో ముద్దు ముచ్చటలతో ప్రేక్షకులకు వెచ్చదనమిచ్చే పాట రామారావు, సరోజలపై చిత్రీకరించారు.

ఐదు మొదలు పన్నెండేళ్ళలోపు పిల్లలు ఐదారుగురికి (రామారావు పార్టీవారు!) సరోజ, అక్క ప్రేమతో ముద్దులు యిచ్చింది. అడల్ట్ రామారావు మోకాళ్ళ పై ప్రాకుతూ "మరినాకో!" అన్నాడు. ఇది రామారావు పెరిగిన యింట్లో (ఇంటీరియర్) జరిగింది. అడల్ట్ సరోజ మరి యేమని సమాధానమిచ్చింది? హొసరగడ్డ హుషారు సీన్సు తలచుకొంటేనే ఒళ్ళు పులకరిస్తుంది.

బెంగుళూరు లాల్ బాగ్‌లో యింకో ద్వంద్వగీతం "మెల్లగా మెల్లగా అణువణువు నీదెగా, మెత్తగ అడిగితే లేదనేది లేదుగా" అనే పాటను అదే జంటపై చిత్రీకరించారు. ఆత్రేయ ఆ పాటను రచించారు.

ఆ రెండుపాటలను ఘంటసాల సుశీల పాడారు. సంగీతం: మహదేవన్.

పై పాటల చిత్రీకరణలో పదిపన్నెండు మంది సహనర్తకులుకూడా పాల్గొన్నారు.



శ్రీ దేవి పిక్చర్సువారి "విచిత్రవ్యక్తులు"లో
దేవిక, శివాజీగణేశన్

శ్రీరామా పిక్చర్స "దేశద్రోహులు"లో
ఎన్. టి. రామారావు, దేవిక.



మే నెలలోనే విడుదల కాగల ఈచిత్రం గురించి దాగుడుమూతలు లేకుండా చెప్పే ఒక్క అంశం రాయి రత్నమైన విచిత్ర గాథ. రామారావు పాత్ర వైచిత్రి గమనించండి.

చిత్ర నిర్మాత: డి. బి. నారాయణ. దర్శకుడు: అదుర్తి. సంభాషణలు: ముళ్ళపూడి వెంకటరమణ. పాటలు: ఆత్రేయ, దాశరథి, ఆరుద్ర; ఛాయ పి. ఎల్. రాయ్. తారాగణంలో గుమ్మడి, సూర్యకాంతం, రమణారెడ్డి, పద్మనాభం, శారద, రాధాకుమారి, రావి కొండలరావు కూడా కలరు.

శాంతారామ్ "జక్కన్న"

వి. శాంతారామ్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీస్తున్న "గీత్ గాయా పథ రోనే" హిందీ చిత్రంకూడా అమరశిల్పి జక్కన్నగాథే. శాంతారామ్ కుమార్తె రాజశ్రీ 'మంజరి' పాత్రను, జితేంద్రకుమార్ జక్కన్న పాత్రను ధరిస్తున్నారు. హిందీ చిత్ర నిర్మాణం సందర్భంగా శాంతారామ్‌కు మద్రాసువారికి ఉత్తర ప్రత్యుత్తరాలుకూడా జరిగినవి. శాంతారామ్ కథకుడు కె. నారాయణ్. సగానికి పైగా చిత్రం తయారైంది

అమెరికా నుంచి అక్కినేని ప్రశ్న

నెలపైగా అమెరికాలో పర్యటన గావించిన అక్కినేని నాగేశ్వరరావుకు కొత్త తెలుగు నటులపైనే ధ్యాసపడింది.

వాషింగ్టన్‌నుంచి అదుర్తికి వ్రాసిన లేఖలో "తేనెమనసులు" కొత్త తారల ఎన్నిక యెంతవరకు వచ్చింది? శిక్షణ సంగతి ఏమిటి? "విశాల నేత్రాల"కు ఎంత వరకు పనికివస్తారు అంటూ అనేకప్రశ్నలు వేసినట్లు తెలుస్తున్నది. మే మధ్యలో "తేనె మనసులు" షూటింగ్ ప్రారంభమై 20 రోజులు ఇన్‌డోర్, పదిరోజులు ఔట్‌డోర్ షూటింగ్‌తో పూర్తి అవుతుంది. అవీ షూటింగ్ రోజులు.

నాగేశ్వరరావు అమెరికాలో పర్యటన ముగించుకొని మే 19 న బయలుదేరుతారని తెలుస్తున్నది. దోవలో ఐరోపా రాజ్యాలు దర్శించి ప్రాచ్యఖండ సందర్శనకు ఉపక్రమిస్తారు. టోకియోచేరేసరికి సతీమణి అన్నపూర్ణ అక్కడకు వస్తారు. దంపతులు జపాన్, సింగపూర్‌లు దర్శించి భారత్‌కు తిరిగి వస్తారు.

వాషింగ్టన్‌లో వున్నప్పుడు నాగేశ్వరరావు నాటకాలను, నాటక శిక్షణ తరగతులను తిలకించారు. కెనెడీ సమాధికి పుష్పాంజలి ఘటించారు. హిమవర్షం చూచారు. ఈ సంచిక వెలువడేసరికి న్యూయార్కులోని బ్రాడ్వే నాటకాల పరిశీలనకూడా పూర్తి కావచ్చు. హాలీవుడ్, డిస్నీలాండ్‌కూడా సందర్శించివుండవచ్చు. అచ్చటచ్చట శిక్షణతరగతులుచూచి డెందము ఆనందమొందగా తేనె మనసుల నూతన తారలు జ్ఞప్తికివచ్చి అదుర్తికి ఓ లేఖ వ్రాయించారు.

'వాయిస్ ఆఫ్ అమెరికా'లో తెలుగు లేనందున తమిళంలో బ్రాడ్‌కాస్ట్ చేశారు.



అమెరికాలో ఒక టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొంటున్న అక్కినేని నాగేశ్వరరావు

నాటకకళ ప్రొఫెసర్లతోను, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌వారితోను అక్కినేని ముచ్చటించారు.

జెమినీ తెలుగుచిత్రం వివరాలు

హిందీలో జయమొందిన "జిందగీ"ని జెమినివారు తెలుగులో పునర్నిర్మిస్తున్నారు.

రామారావు. దేవిక ప్రధాన పాత్రధారులు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య. ఆత్రేయ రచన సాగిస్తున్నారు.

కామేశ్వరరావు విచారం

భారతప్రభుత్వంవారు దేశస్థాయిని ప్రథమ యోగ్యతాపత్రమిచ్చిన "నర్తనశాల" దర్శకుడు కమలాకర కామేశ్వరరావు "జ్యోతి" ప్రతినిధికి తీరని విచారం వెలిబుచ్చారు.

28 వారాలు సాగుతున్న చిత్రం దర్శకుని విచారానికి కారణమేమిటి?

మద్రాసు సినిమా రసికసంఘంవారు కూడా "నర్తనశాల"ను ఉత్తమచిత్రంగా నిర్ణయించారు.

బి. ఎన్. రెడ్డి. రాజమన్నార్ సభ్యులుగాకల ఫిలింఫేర్ అవార్డ్ సెలక్షన్‌కమిటీ కూడా "నర్తనశాల" ఉత్తమచిత్రమన్నారు.

మరి కామేశ్వరరావు విచారం దేనికి?

సత్యజిత్‌రాయ్ అంతటి మేధావిని వెనుకపడవెయ్యడమే కామేశ్వరరావు సంతాపానికి కారణం. రాయ్ "మహానగర్"కు భారతస్థాయిలో ద్వితీయ స్థానం ("నర్తనశాల" తర్వాతి స్థానం) మాత్రమే లభించింది.

'బ్లిట్జ్'లో "లాస్ట్‌పేజి" (చివరిపుట)లో ధారావాహినిగా వ్రాసిన సంఘటనలను ఆధారంచేసుకొని కె. ఏ. అబ్బాస్ రచించిన "షహెర్ ఔర్ సప్న" అనే హిందీ చిత్రానికి రాష్ట్రపతి స్వర్ణపతకం బహూకరించారు.

విశ్వశాంతివారి "హంతకు డెవరు?" లో
బి. సరోజాదేవి, ఎమ్. జి. రామచంద్రన్





అన్నపూర్ణవారి "డాక్టర్ చక్రవర్తి"లో జగ్గయ్య, సావిత్రి

స్వర్ణపతకానికై "షహెర్ ఔర్ సప్న"కు, "నర్తనశాల"కు తీవ్రమైన పోటీ జరిగింది. ఒకే ఒక ఓటు ఎక్కువవచ్చి హిందీ చిత్రానికి స్వర్ణపతకం. నర్తనశాలకు తర్వాతి స్థానం వచ్చినవి.

ఈ కాలంవారు సృజనాత్మకశక్తితో రచించిన సాంఘికాలు వదిలి ఎవరో వ్రాసి వదలినవాటిని ఆధారంచేసుకొని తీసే పౌరాణికాలకు బహుమతులు యివ్వడం తగునా? అని ప్రశ్నించగా ప్రస్తుత పరిస్థితులలో దేశంలో నైతిక పునరుజ్జీవనం జరగాలి అంటే పురాణాలుపాటించవలసిందేనన్నారు. విరాటపర్వమంతటికరుణగాధ ప్రపంచసాహిత్యంలోమరెచ్చటాలేదని. ఐదుగురు మహాపురుషులు, వారిభార్యారత్నంచాటుగా అజ్ఞాత జీవితంగడిపి. ఉద్రేకాలు చంపుకొని. ఆశ్రయమిచ్చినవారిని తుదకు కాపాడారూ అంటే గొప్పవిశేషమని అన్నారు.

సాంఘికాల పేరిట నీతిదాయక చిత్రాలు రావడం లేదని. "మహానగర్" సచేతన్యంగా నిర్మాణాత్మకంగా లేక ఒకవిధమైన నైరాశ్యంతో ముగిసిందని చెప్పారు.

ఇంకో 20 శతాబ్దాలు గడిచినా పౌరాణికాల విలువ పౌరాణికాలదే నన్నారు.

జకార్తాలో తెలుగుపాటల తగ్గింపు

ఏప్రిల్ మాసాంతం మొదలు మే మొదటి వారంవరకు జకార్తాలో జరుగుతున్న ఆసియా చలన చిత్రోత్సవానికి భారత్‌నుంచి ఏకైక ఎంట్రీగా "నర్తనశాల" వెళ్ళింది.

ఇండొనీషియాలో భారత, భాగవత, రామాయణ గాథలు బాగా ప్రచారంలో వున్నాయి. ఆకాలపు పురుషుల పేర్లు ఈ కాలం వారికి వాడుకలో వున్నవి కూడా. అందుచేతనే "నర్తనశాల"ను పంపారు.

అచ్చటకు వెళ్ళిన చిత్రం 23 వేల అడుగులకు కుదించబడినది. ఇంగ్లీషులో సబ్‌టైటిల్స్ చేర్చబడినట్టుంది. వాటిని గిడుగు రామారావు రచించారు.

జకార్తా వర్షనులో చాలా పాటలు తీసేశారు. యుద్ధ దృశ్యాలలోని పద్యాలు తొలగించారు. భీష్మ ద్రోణాదులను పరిచయం చేస్తే ఒక్క పద్యమును మాత్రం వుంచారు. ఇంద్రలోకం పద్యాలు మటుకు వున్నవి. దుశ్శాసన పరాభవం తొలగించారు. ఉపకీచకుల ఊరేగింపు పాట తొలగించారు. వంటశాల దృశ్యాలుకూడా తొలగించారు.

జకార్తాకు నిర్మాతలు శ్రీధరరావు, లక్ష్మీరాజ్యం, నటులు రంగారావు, రేలంగి సావిత్రి వెళ్ళారు.

తెలుగు చిత్రాలలో "లవకుశ"కు రజత పతకం (ప్రథమస్థానం) లభించింది. "అమరశిల్పిజక్కన్న", "మూగమనసులు" చిత్రాలకు రాష్ట్రస్థాయి యోగ్యతా పత్రాలు లభించినవి.

ఢిల్లీలో బహుమాన ప్రదానోత్సవాలకు "నర్తనశాల", "లవకుశ" రామారావు ఇతర నిర్మాతలు, తారలు వెళ్లారు.

చలన చిత్రానికి జీవమైన కవి ప్రభుత్వం దృష్టిలో యెందుకూ కొరగాక పోవడం విచారకరం. ప్రభుత్వంవారు యీసారి అయినా సాహితీవేత్తల ఉనికిని గ్రహించగలరని మద్రాసు సినీవర్గాలవారు ఆశిస్తున్నారు.

నర్తనశాలపై కొత్తవెలుగు

ఆంధ్ర ఫిలిం జర్నలిస్టుల సంఘంవారు "నర్తనశాల" దర్శక నిర్మాతలను, "భరత కళాప్రపూర్ణ" బిరుదాంకితులు శ్రీ వేదాంతం రాఘవయ్యగారిని సన్మానించారు. ఆ సందర్భంలో చెయ్యబడిన ప్రసంగాలలో అనేక కొత్త విషయాలు వెల్లడయినవి. శ్రీ ఇంటూరి వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు.

నిర్మాత శ్రీ శ్రీధరరావు మాట్లాడుతూ "నర్తనశాల"లో బృహన్నల పాత్రకు రూపకల్పనచేసినది శ్రీశ్రీ అన్నారు.

శ్రీమతి లక్ష్మీరాజ్యం తన 30 సంవత్సరాల సినీ జీవితంలో తనను సత్కరించడమనేది ఇదే ప్రథమమన్నారు.

దర్శకుడు కామేశ్వరరావు "నర్తనశాల"లో కొన్ని లోపాలు విధిలేక జరిగినా ఇతివృత్తానికి మొత్తంమీద చాలా న్యాయం చేశామన్నారు. ఫిలింజర్నలిస్టులు "క్రిటిక్స్ అవార్డ్సు" ప్రకటించాలన్నారు.

శ్రీ రాఘవయ్య కూచిపూడి చరిత్రను వివరించి "కన్నియిన్ కాదలి" అనే రామనాథ్ చిత్రానికి నృత్యదర్శకుడుగా వున్నప్పుడు నిమిషానికి (సినిమాలో నృత్యం కన్పించే ఒక్క నిమిషానికి) రెండువేల రూపాయలు ఛార్జిచేశానని, దర్శకుడు

రామనాథ్‌కు 25,000 ముట్టగా, నృత్యదర్శకుడుగా తనకు 50 వేల రూపాయల పైచిలుకు లభించిందన్నారు.

పురుషులను జయించిన స్త్రీసేన

ఎస్. ఆర్. మూవీస్‌వారి "ప్రమీలార్జునీయం"లో ఆడవాళ్ళ రాజ్యంలోని కొన్ని చిత్రమైన దృశ్యాలను చిత్రీకరించారు. కోటగుమ్మంవద్ద ఆడసైనికులు గమ్మత్తులు చేసి, వీరోచితంగానూ పురుషసైనికులను జయించి కత్తులు కఠారులు లాగివేసుకొంటారు. ఛాయాదేవి, వాణిశ్రీ, బాలకృష్ణ మున్నగువారు ఆసీనులో కలరు. వాహినీలో ఆ సెట్టువేశారు. సరోజ కాల్‌షీట్స్ లభ్యమైతే అగస్టుకు చిత్రం విడుదలకు సిద్ధమౌతుంది. దర్శకుడు: ఎమ్. మల్లికార్జునరావు, రచన: పింగళి నాగేంద్రరావు, నిర్మాతలు: అదిభట్ల నాగమణి, ఛాయాగ్రహణం: రవికాంత్, కళ: గోఖలే. రామారావు, కాంతారావు, రేలంగి, పద్మనాభం, మిక్కిలినేని, శోభన్‌బాబు, గిరిజ, రాజశ్రీ తారాగణంలో కలరు.

హరనాథ్, మణిమాల డ్యూయెట్

బి.ఏ.ఎస్. ప్రొడక్షన్స్ 'మైరావణ'కు వీనస్ స్టూడియోలో ఏప్రిల్ మధ్యలో గార్డెన్ సెట్‌లో హరనాథ్, మణిమాలల డ్యూయెట్ చిత్రీకరించారు. మైరావణుడు రామలక్ష్మణులపై అకృత్యాలను తలపెట్టే ఘట్టంకూడా చిత్రీకరించారు. మైరావణుడు ధూళిపాళ, శ్రీరాముడు కాంతారావు, రేలంగి హనుమంతుడు.

దర్శకుడు: బి. ఏ. సుబ్బారావు. మరికొలది రోజులలో చిత్రం విడుదలవుతుంది.

రామారావు ద్విపాత్రాభినయాలు

రామారావు ఐదారు చిత్రాలలో రెండేసి పాత్రలు ధరిస్తున్నారు. "రాముడు - భీముడు"లో రాముడు, భీముడుకాక, విఠల్ ప్రొడక్షన్స్" "అద్భుతసోదరులు"లో జంట సోదరులు, "ప్రతాపరుద్రీయం"లో ప్రతాపరుద్రుడు, రజక పేరిగాడు పాత్రలు ధరించవచ్చు. రచన పింగళి నాగేంద్రరావు. బహుశా కామేశ్వరరావు దర్శకత్వం వహించవచ్చు. స్వంతసంస్థ ఎన్. ఏ. టి. చిత్రాలలో కూడా యిట్టివి తలపెట్టారు ఈ సంస్థ ముందు తీసే "కృష్ణపాండవీయం"లో భీముడి పాత్రకు కండలు తిరిగిన యువకుడు యింకా లభించలేదని రామారావు చెప్పారు.

రేలంగి మహారాజు విశిష్టత

"శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం" షూటింగ్ వాహినీ స్టూడియోస్‌లో చురుకుగా సాగుతున్నది. ఇందులో శివకేశవ మహారాజు అనే చిత్రపాత్రను రేలంగి ధరిస్తున్నారు. ఆమహారాజు శివభక్తుడు, వైష్ణవభక్తుడుకూడా. నామాలుకొంత, విభూతికొంతధరిస్తారు. సముద్రాల ఈ పాత్రను కొత్తరకంగా రూపొందించారు. రామారావు, కృష్ణకుమారి, అల్లు రామలింగయ్య మొదలైనవారు తారాగణంలో కలరు. దర్శకుడు నందన్‌రావు.

దొరికితే దొంగలు

డి. ఎల్. నారాయణ "దొరికితే దొంగలు"లో మరి రెండు సెట్లపై పని పూర్తి

సురేష్ ప్రొడక్షన్స్

రాముడు-భీముడు

చిత్రంలో యుగళగళగీతం

రచన : సి. నా. రె.

మ్యూజిక్ : పెండ్యాల

ప్లేబ్యాక్ : సుశీల, ఘంటసాల

పాత్రధారులు :

ఎన్. టి. రామారావు,

ఎల్ విజయలక్ష్మి







తళుకు తళుకుమని గలగల సాగే
తరుణీ యిటు రావేమే
చమకు చమకుమని చిన్నారి
నడకల చేరుకోవేమే

●

రమ్మనకు, హోయ్ రమ్మనకు
పగలే నను రారమ్మనకు
విరిమొగ్గలు చూచేవేళ
చిరుసిగ్గులు పూచేవేళ

●

చీకటి ముసిరేదెన్నడు
నాచేతికి అందేదెన్నడు
సిగ్గులు తొలిగే దెన్నడు
నీ బుగ్గలు పిలిచేదెన్నడు

●

కదిలేకన్నులు మూసుకో
మదిలో మగువను చూసుకో

●

నిన్నటికలలో మెత్తగా నా
నిద్దుర దోచితివెందుకు

●

అంతకు మొన్నటి రాతిరి గిలి
గింతలు మొదలైనందుకు

చేశారు. మెజస్టిక్ స్టూడియోలో వేసినసెట్ లో గుమ్మడి, సూర్యకాంతం తమ కుమార్తె శారద వివాహం గురించి యోచించడం చిత్రీకరించారు. ఇంకొక సెట్ లో పేకేటి, రమణారెడ్డి గుసగుసలాడుకొనడం, రామారావు రాకతో నిలిపేసి ప్లేటు మార్చడం మొదలైన సన్నివేశాలు చిత్రీకరించారు. దర్శకుడు సుబ్రహ్మణ్యం.

హేమాంబరధరరావు తదుపరి చిత్రం

లోగడ "చివరకు మిగిలేది" నిర్మించిన వారిలో ప్రముఖ పార్ట్నర్ అయిన ఎమ్. కొండలరెడ్డి స్వంతంగా ఒక ఫిలింకంపెనీ పెట్టి నేరప్రధాన చిత్రం తీయబోతున్నారు. పినిశెట్టి రచన సాగిస్తున్నారు. హేమాంబరధరరావు దర్శకుడు. జగ్గయ్య, కృష్ణకుమారి ప్రధాన పాత్రలు ధరించ వచ్చునని తెలుస్తున్నది.

ఇన్‌స్పెక్టర్ జనరల్ తారాగణం

సుగంధి పిక్చర్స్ "ఇన్‌స్పెక్టర్‌జనరల్" ఆధారంగా తెలుగులో ఒకచిత్రం తీయ తల పెట్టారు. రచన ప్రఖ్య శ్రీరామమూర్తి. కాంతారావు, రమణమూర్తి తారాగణంలో వుండవచ్చు. దర్శకుడు సి. ఎస్. రావు

డాక్టర్ చక్రవర్తి డ్యాన్సుపాట

"డాక్టర్ చక్రవర్తి" నిర్మాణం పూర్తి చెయ్యడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసే సందర్భంలో అన్నపూర్ణ పిక్చర్స్ అధినేత శ్రీ డి. మధుసూదనరావు ఏప్రిల్ మధ్యలో మద్రాసువచ్చి వారం రోజులు వున్నారు. ఒక డ్యాన్సు, ప్యాచ్‌వర్కు మాత్రం మిగిలివుంది. దర్శకుడు ఆదుర్తి.

● ● ●

విజయావారి "హరిశ్చంద్ర" (రచన పింగళి) రికార్డింగ్ ఘట్టం లో పడింది. దర్శకుడు కె. వి. రెడ్డి. "బభ్రువాహన" షూటింగ్ మళ్ళీ ప్రారంభమైంది.

స్వీటిష్ స్వీడిష్ చిత్రాలు

ఇతరదేశాల చిత్రాల తీరు వేరు, స్వీడిష్ చిత్రాల తీరు వేరు. ఇతర చిత్రాలన్నింటి నటన తీరు ఒకటి. స్వీడిష్ నటీ నటుల నటన యెత్తు ఒక్కటీ ఒకటి. స్వీడిష్ తారలు, ముఖ్యంగా నటులు ఏక టాకీగా నిమిషం మొదలు రెండుమూడు నిమిషాల వరకు భావప్రకటన చేస్తారు; చెయ్యకలుగుతున్నారు. ఇంతటి స్థిరమైన, శక్తిగల నటన ప్రపంచసినీరంగంలో నేచాలాఅరుదు.

మామూలు ప్రేక్షకులు - పాశ్చాత్య దేశాలవారు సయితం - స్వీడిష్ చిత్రాలను చూడాలన్నా, చూచి ఆనందించాలన్నా చాలా కష్టపడాలి; శ్రమించాలి; దృష్టిని చిత్రంపై పూర్తిగా కేంద్రీకరించాలి; మనసును పూర్తిగా లగ్నం చెయ్యాలి. అంటే కథా గతి, దర్శకత్వపు మెలికలు 'ఫాలో' కావాలి. అంటే ప్రేక్షకుడు స్ట్రెయిన్‌కాక తప్పదు. కళకళకోసమే అన్నది స్వీడిష్ చిత్రాలలో యితర దేశాల చిత్రాలలో కంటే యెక్కువగా కన్పిస్తుంది. అందుచేత చలన చిత్రకళకు సంబంధించి వంతవరకు స్వీడిష్

చిత్రాలను స్వీడిష్ ప్రత్యేకంగా పేర్కొన వచ్చు. కళలో అభిరుచిలేక, వినోదం కోసం వచ్చేవారికి అది '[illegible]'గా కన్పించినా అబ్బురంలేదు.

ఈ విషయాలు ఏప్రిల్ 14 నుంచి 17 వరకు మద్రాను ఫిలిం సొసైటీ వారు మద్రాసులో నిర్వహించిన స్వీడిష్ చలన చిత్రోత్సవం చూడగా రూఢి అయింది.

"వైల్డ్ స్ట్రాబెర్రీస్", "ది మెజిషియన్", "ది వర్జిన్ స్ప్రింగ్" (ఈ మూడింటి దర్శకుడున్యూ వేవ్‌దర్శకుడు ఇంగ్మార్ బెర్గ్‌మన్) "మిస్ జూలీ" (దర్శకుడు ఆల్ఫ్ స్జోబెర్గ్) అనే చిత్రాలను ప్రదర్శించారు.

మొదటి, నాల్గవ చిత్రాలలో దర్శకులు గతం, వర్తమానాలను ఫ్లాష్ బ్యాక్ కాని, ఎక్కువ ఫేడ్ ఔట్, ఫేడ్ ఇన్‌లుకాని ఉపయోగించక ఏక కాలంలో నడిపించారు. దాదాపు పదిహేను సంవత్సరాలక్రితం స్టాన్లీ క్రామర్ "ది డెత్ ఆఫ్ ఏ సేల్స్ మన్"లో (అమెరికన్ చిత్రం) ఈ పద్ధతిని జయప్రదంగా అమలుపరిచారు.

"ది వర్జిన్ స్ప్రింగ్" 13 వ శతాబ్దానికి సంబంధించిన జానపద గేయం ఆధారం చేసుకొని తీసినట్టిది. గొర్రెలకాపరులచే మానభంగం చెయ్యబడిన బాలిక శోకగాథ యిది. కథే బలమైనదైతే కథాగతి, నటన, సంఘటనలు రెండు మూడింతల బలం కూర్చినవి. కథాబలాన్నే కాక ఇతరహంగుల బలాన్నికూడా ఎలా సమకూర్చుకోవాలి అన్న అంశానికి ఈ చిత్రం ఒక మంచి పరిశోధన గ్రంథం. తల్లి ప్రేరేపణవల్ల పురుషులను ద్వేషించే ధనికురాలు మిస్ జూలీ. ఆమె ప్రియుడు, బాల్యస్నేహితుడు ఆమెయింటిలో బట్లర్. ఈతడు ధనికులను ద్వేషించే పేదవాడు. ఇద్దరిమధ్య మనస్సంఘర్షణ విషాదపరిణామాలను చాలా మలుపులతో చక్కగా చిత్రీకరించారు.

పోలిష్ చిత్రం 'పడవ మనుషులు'

సినిమా విజ్ఞానవ్యాప్తికి గణనీయమైన కృషి సల్పుతున్న మద్రాసు ఫిలిం సొసైటీ వారు చెన్ననగరంలో ఏప్రిల్ ఆరవ తేదీ నుంచి తొమ్మిదవతేదీవరకు పోలిష్ చలన చిత్ర ప్రదర్శనోత్సవం జరిపారు.

"పానిక్ ఆన్ ది ట్రెయిన్", "బర్త్ సర్టిఫికెట్", "ఎరియోకా", "నైఫ్ ఇన్ ది వాటర్" అనే చిత్రాలను ప్రదర్శించారు. మొదటి మూడింటికి యుద్ధకాలం ప్రాతిపదిక. నాల్గవది ఈరోజులది.

నాల్గింటిని చూచినమీదట ముందుగా కలిగేభావం టెక్నికల్‌గా, ముఖ్యంగా ఛాయాగ్రహణంలో పోలెండ్ మరే యూరోపు, అమెరికా దేశాలకు తీసిపోదని. వాస్తవికతకు పోలిష్ ప్రవీణులు చాలా శ్రద్ధవహిస్తారు; శ్రమపడతారు. 'డ్యూప్'లు (మారు మనుషులు) పెట్టక అసలు పాత్రధారులతోనే క్లిష్టమైన ఘట్టాలు తీస్తారు. 'నేరేషన్'లో, 'ప్రెజెంటేషన్'లో కొన్ని సోవియట్, ఇటాలియన్, అమెరికన్ చిత్రాలలో కాన వచ్చే విశిష్టతలు, తికమకలు వాటిలోలేవు. ఉన్నవిషయాన్ని సూటిగా సులభంగా సరళంగా చెప్పడం, చూపడం పోలిష్‌వారి సంప్రదాయంగా తోస్తుంది.

"నైఫ్ ఇన్ ది వాటర్", పై నాలుగు చిత్రాలలోకీ విశిష్టమైనది. ముగ్గురు పడవ మనుషుల మనసులను అది చిత్రంగా చిత్రీకరించింది. పడవ మనుషులంటే బెస్తవాళ్ళు అనికాదు అర్థం.

20 ఏళ్ళ అమ్మాయి. 40 ఏళ్ళ భర్త. అందులో సగానికి ఒకసంవత్సరం తక్కువ వయసు వున్న కాలేజీవిద్యార్థి. ఈముగ్గురూ ఒకరోజు పడవపై గడిపిన రసమయ సందర్భాలే ఆరేడువేల అడుగుల ఈచిత్రం యొక్కకథ. వేరే పాత్రధారి అంటూలేరు. వేరొకరి నీడ అయినా కంటికి కన్పించదు. విద్యార్థికి ప్రాణప్రదమైన కత్తిని భర్త సరస్సులో పడవేయడంతో నదిసరస్సులోని పడవలో తుఫాను లేస్తుంది.

ఒక ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటలకు నవదంపతులు సరస్సులో శృంగార విహారానికై ఇంటినుంచి కారులో బయలుదేరుతారు. దోవలో ఓ విద్యార్థి కారుకు అడ్డంపడి లారీలు లేకపోవడంవల్ల సుదూరానికి నడకసాగించవలసి వస్తున్నదని కారులో తీసుకొని వెళ్ళవలసిందని కోరుతాడు. భర్త అంగీకరిస్తాడు. నవయువకుని కళ్ళల్లోకి నవయువతి ఒక్కమారు తీక్షణంగా చూస్తుంది. రేవుకు వెళ్లాక నవదంపతులతోపాటు విద్యార్థికూడా పడవలో వెళ్ళవలసి వస్తుంది.

లోతు సరస్సు. ఒక్కపడవ. ఒక్క యువతి. ఒక్కయువకుడు. ఆయువ విద్యార్థి ప్రాణప్రదంగా యెంచేది ఒక్కకత్తి. ఒక్క మధ్యవయస్కుడు (భర్త) బలశాలి. తుఫాను(ల)ను యెదుర్కొనవలసివచ్చింది. రాత్రి నిద్రించేటప్పుడు యువకుని కత్తి మధ్యవయస్కుని వద్ద వుండిపోయింది. తెల్లవారుజామున లేచి చూస్తే భార్య తన పక్కనలేదు. పడవమీదకు వెళ్ళి చూస్తే ఏదో ఆలోచనలో వుంది. పడవ స్తంభం మీదకు యెక్కి కూర్చున్నాడు యువకుడు. తన అనుమానానికి ఆధారం వుందా? ఉదయం ఇంటికి తిరుగు ముఖం పట్టినప్పుడు కత్తియిచ్చి వేయమంటాడు యువకుడు. మధ్యవయస్కుడు కొంటెగా యివ్వబోతే చాకు సరస్సు పాలయింది.

ఒక్క యువతి. ఒక్కచాకు. ఇద్దరు పురుషులు. నదీ సరస్సు. ద్వంద్వయుద్ధం జరిగింది. పురుషులమధ్యనేకాదు. భార్యాభర్తలమధ్యకూడా (వాగ్యుద్ధం) ఫలితం? పడవ విహారంలో అనుక్షణం కామం బుసలుకొట్టినా అణచుకొన్న యువతీ యువకులుఏకమౌతారు. యువతి-మధ్యవయస్కుని భార్య - అబల, అయినా నిజం చెప్పింది భర్తకు. మరి ఆ దంపతుల మార్గం ఎటు? సహజీవనమా? తెగతెంపులా?

దర్శకుడు ఆ ప్రశ్నకు సమాధాన మివ్వకుండా చిత్రాన్ని ముగించారు.

తెల్లవారుజాము మొదలు మర్నాటి ఉదయంవరకు జరిగిన సంఘటనలను ఆ యా సమయాలకు అనుగుణమైన లైటింగ్‌తో చూపగలగడం ఈచిత్రంలోని అద్భుతమైన అంశం. రోమన్ పోలన్‌స్కీ దర్శకత్వం వహించిన తొలి చిత్రమిది.

ఛాయాగ్రాహకుడు లిక్మన్. చిత్రం యావత్తూ ఔట్‌డోర్‌లో తీశారు. స్విర్డ్వ సరస్సులో డ్యూపులు లేకుండా, బ్యాక్ ప్రొజెక్షన్ లేకుండా తీశారు. పాత్రధారులు కుమారి ఉమేకా, నీమ్‌జిక్, మలనొవిక్జ్ కెమెరాముందు నిలబడడం యిదే మొదటిసారి.

ఇద్దరే ఇద్దరు పాత్రధారులతో హాలీవుడ్ యీవరకు "ఫోర్ పోస్టర్" తీసింది. ఒకే ఒక పాత్రతో (సునీల్‌దత్ లేక దేవానంద్) హిందీచిత్రం తీయాలని అమధ్య తలపెట్టారు.

□□□



Wrapper Printed at Neo Art Press, Madras 2